
# ఐదుగురు అనుమానితులు

నవల

- కొమ్మూరి సాంబశివరావు




శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 68

జనవరి 2013 నుంచి అక్టోబర్ 2013 వరకూ

కౌముది మాసపత్రికలో

సీరియల్‌గా పునర్ముద్రణ పొందిన నవల

**"నాన్న కెలా ఉంది?"** హాల్లో అడుగుపెడుతూనే అడిగాడు రవి.

"మామయ్య నీ కోసరమే చూస్తున్నాడు" అన్నది సునీత.

"నా మీద కోపంగా ఉన్నాడా?" అడిగాడు రవి నవ్వుతూ.

సునీత జవాబు చెప్పలేదు. రవిని చాలా చీదరింపుగా చూసింది.

సునీతకు పద్దెనిమిదేళ్ళుంటాయి. పొడుగ్గా కాస్త సన్నగా ఉంటుంది.

మధ్య పాపిడి తీసుకుని, వాలుజడ వేసుకుంది. నల్లని ఉంగరాల జుట్టు చెంపలకు ఎంతో ఆనందాన్నిస్తున్నది. తెల్లని వాయిల్ చీర కట్టుకుని, లేత నీలంరంగు క్రేఫ్ జాకెట్టు వేసుకుంది. గులాబీరంగు ఒంటి ఛాయ, సునీత అందమైన యువతి. కానీ అందం కంటే విశిష్టంగా కనపడేది ఆమెలోని నైర్మల్యం, కళ్ళల్లోని అమాయకత్వం. సునీతను చూస్తే అప్పుడే వికసించిన గులాబీ పువ్వు, ప్రాతఃకాలపు మంచు బొట్టు, నిర్మలంగా ఉన్న పాలరాయి జ్ఞాపకం వస్తాయి.

రవి కాలుతున్న సిగరెట్టు నేలమీద పడేసి, కాలితో నొక్కి ఆర్పేసి, ఒకసారి సునీతను చూసి చకచకా తండ్రి గదిలోకి వెళ్ళాడు.

"రా! ఇలారా! ఆ కుర్చీ దగ్గరకు లాక్కుని కూర్చో!" అన్నాడు శివరామకృష్ణయ్య.

ఆయన తీక్షణమైన చూపులూ, గంభీరమైన కంఠస్వరమూ వింటే శివరామకృష్ణయ్య ధృఢసంకల్పుడనీ, మనో దారుఢ్యం కలవాడనీ తెలుస్తుంది. ఆయనకు దాదాపు అరవై ఏళ్ళుంటాయి. ఆజానుబాహువు. మొహం బాగా ముడతలు పడ్డది. జుట్టు పూర్తిగా నెరిసింది. బరువుగా ఊపిరి పీలుస్తున్నాడు. మంచం మీదనుంచి కదలలేని స్థితిలో ఉన్నాడాయన. రవిని ఒకసారి ఆపాదమస్తకమూ తేరిపార చూశాడు. ఇరవై ఏళ్ళ క్రితం పోయిన భార్య జ్ఞప్తికి వచ్చింది. రవి అంతా తల్లిపోలికే. శివరామకృష్ణయ్య కళ్ళు చెమ్మగిల్లాయి.

రవి మాట్లాడకుండా మంచం దగ్గరకు కుర్చీ లాక్కొని కూర్చున్నాడు. అతను సన్నగా, పొడుగ్గా ఉంటాడు. ఎర్రని దేహచ్ఛాయ. ఉంగరాలు తిరిగిన జుట్టు. సినిమా హీరోలాగా సన్నని మీసాలు. ట్వీడ్ పాంటూ, సిల్కు షర్టూ, షార్క్‌స్కిన్ కోటూ వేసుకున్నాడు. కోటు జేబులోంచి సిల్క్ రుమాలు బయటికి కనిపిస్తోంది. ఆ రుమాలుకు పూసుకున్న సెంటు ఘుమఘుమ వాసన కొడుతోంది.

"ఏం నాన్నా! ఒంట్లో ఎలా ఉంది?" అడిగాడు రవి. అతని కంఠస్వరంలో తండ్రిలో ఉన్న గాంభీర్యంగాని, మనోబలం కానీ ధ్వనించవు.

"నిజం చెప్పనా! ఇక అట్టేకాలం బతకను. ఇంకోనెల, లేదా రెండు నెలలు" అన్నాడు శివరామకృష్ణయ్య.

"ఛ! అదేమిటి నాన్నా! అలా అనక!"

"నువ్వు నాకు ధైర్యం చెబుతున్నావా?" నవ్వాడు శివరామకృష్ణయ్య. "డాక్టర్ని అడిగితే చెప్పాడు. కార్డియో ఎక్టాసిన్ వస్తే అది తగ్గే జబ్బుకాదు. ఈ వయస్సులో గుండె జబ్బు వచ్చాక బతకడం కష్టం. రవీ కుర్చీ ఇంకా దగ్గరకు లాక్కో. నీతో మాట్లాడాలి" అన్నాడు శివరామకృష్ణయ్య.

రవి కుర్చీ దగ్గరికి జరుపుకున్నాడు.

"మీ అమ్మ పోయి ఇరవై ఏళ్ళయింది. అప్పటినుంచీ నిన్ను నేనెంత గారాబంగా పెంచానో నీకు తెలుసు. నువ్వు అడిగిందల్లా ఇచ్చాను. నీ ఇష్టానికి ఎన్నడూ అడ్డుచెప్పలేదు. చదువు పూర్తి అయినాక కూడా నువ్వు ఈ పట్నం వదిలి మన ఊరికి రాకుండా, ఇక్కడే ఉండి నెలకు వెయ్యి రూపాయలు ఖర్చు చేస్తున్నా ఉరుకున్నాను. ఎందుకని?"

రవి మాట్లాడలేదు.

"ఎందుకంటే నువ్వు చిన్నవాడివి కనుక, నీకు జీవితం అనుభవించాలని ఇచ్ఛ ఉంటుందని నాకు తెలుసు కనుక, నీకు కావలసిన డబ్బు ఇచ్చే శక్తి నాకు ఉంది కనుక, నీకు కావలసిన డబ్బు ఇచ్చే శక్తి నాకు ఉంది కనుక, కుర్రతనంలో కులాసాగా తిరిగినా, తరువాతైనా నీ బాధ్యతలు నువ్వు తెలుసుకుని స్థిరపడతావని ఆశించి, నీకు దేనికీ అడ్డు చెప్పలేదు" శివరామకృష్ణయ్య రెండు నిమిషాలు ఊరుకుని మళ్ళీ ప్రారంభించాడు. "జబ్బుపడి వైద్యం కోసం నేను ఈ ఊరు వచ్చి మూడు నెలలయింది. ఈ మూడు నెలల్లో నువ్వు ఇక్కడికి ఎన్నిసార్లు వచ్చావు? ఇవాళతో కలిసి ఇది మూడోసారి. అవునా? నువ్వు చేస్తున్న పనేమిటి? ఏమిటి నీ రాచకార్యాలు? ఎక్కడ ఉంటున్నావు? ఎక్కడ తింటున్నావు? ఏం చేస్తున్నావు?" అన్నాడు.

రవి ఏదో చెప్పబోయాడు. ఏం చెప్పనవసరం లేదన్నట్లు చెయ్యి చూపించి "నాకు తెలుసు. ఏవో కల్లబొల్లి కబుర్లు చెబుతావు. అక్కర్లేదు, రవీ నిన్ను గారాబం చేసి, నువ్వు అడిగిందల్లా ఇచ్చి నేనే నిన్ను పాడు చేశానని నాకిప్పుడు తెలిసివచ్చింది. ఉత్త అప్రయోజకుడివయ్యావు, నేనింక ఎంతో కాలం బతకను. నేను పోయిన తర్వాత మన ఎస్టేటేమవుతుంది? నాకు తెలుసు. అమ్మేసి, డబ్బంతా ఈ పట్నంలో వినోదలకీ, విలాసాలకీ తగలెస్తావు. ఒక సంవత్సరం తిరగకముందే బికారివవుతావు. వీల్లేదు రవీ! అట్లా ఎన్నటికీ జరగడానికి వీల్లేదు. చిల్లికానీ లేనివాణ్ణి అష్టకష్టాలూ పడి, చమటోడ్చి, రక్తం కార్చి, స్వశక్తితో ఇంత ఆస్తి, ఇంత ఎస్టేటు సంపాదించాను. నే పోయిన తర్వాత ఇదంతా నామరూపాలు లేకుండా పోతుందంటే నా గుండె తరుక్కుపోతోంది. అలా జరగడానికి ఎంత మాత్రం వీల్లేదు. రవీ నేను ఇంకా ఈ పట్నంలో ఉండవలసిన అవసరంలేదు. ఈ తీసుకునే ఇంజెక్షన్లు అక్కడే తీసుకుంటాను. ఎస్టేటుకు బయలుదేరడానికి నిశ్చయించుకున్నాను"

"ఎప్పుడు బయలుదేరుతావు నాన్నా?" అడిగాడు రవి.

"రేపో, ఎల్లుండో! నువ్వు కూడా నాతో ఎస్టేటుకు వచ్చెయ్యి. ఇకనుంచీ ఎస్టేటు వ్యవహారాలు నువ్వే చూసుకో! తెలిసిందా?"

"నేనా! అక్కడికా?"

"ఏం?"

రవి మాట్లాడలేదు. ఎస్టేటులో వ్యవహారాలు చూసుకుంటూ ఉండిపోవడం తలుచుకుని భయపడ్డారు. అక్కడ సినిమాలుండవు. బీచ్ లేదు, హోటళ్ళు లేవు, క్లబ్బులు లేవు. పేకాట ఉండదు. స్నేహితులు ఉండరు. ఒక గంట ఒక యుగంలా ఉంటుంది.

"నాకక్కడ ఏమీ తోచదు నాన్నా! నేను రాను" అన్నాడు ధైర్యం చేసి.

"నువ్వా మాట అంటారని నాకు తెలుసు. అక్కడ ఎందుకు తోచదు? అక్కడ మనుష్యులు లేరా? వాళ్ళందరికీ తోచటం లేదా? నీ ఎస్టేటు వ్యవహారాలు నువ్వు చూసుకోకపోతే ఇంకెవరు చూస్తారు? నే చెబుతున్నా విను –"

"నాన్నా! నన్నెందుకు నిర్బంధ పెడతావు నా కక్కడ ఒక క్షణం కూడా తోచదు. నేను ఆ ఊళ్ళో ఉండలేను."

"సరే, రవీ నీ ఇష్టం. ఇక్కడే ఉండు. కానీ నా తదనంతరం నా ఎస్టేటు నీకు రాదని తెలుసుకో, అక్కడ ఉండి ఎస్టేటు చూసుకోగల మనిషికే ఇస్తాను. నా పినతండ్రి కొడుకు రామ్మూర్తికి ఇస్తాను. ఇక మీద నీకు డబ్బు కూడా పంపించను. ఈ పట్నంలో ఉండి నువ్వేం బావుకుంటావో చూస్తాను" అన్నాడు శివరామకృష్ణయ్య కొంచెం కోపంగా.

"పెళ్ళా! పెళ్ళెందుకు?" గాబరాగా అడిగాడు రవి.

"జీవితంలో స్థిరపడడానికి. వంశం నిలబడడానికి. గాలిలో ఎండుటాకు ఎగిరినట్లు ఎంతకాలం ఇలా తిరుగుతావు? నేను పోయే ముందు నా కళ్ళతో నిన్నూ నీ భార్యనీ చూడాలనిఉంది."

"నాన్నా! నువ్వు ఇలానా జీవితాన్నంతా శాసించడం న్యాయంకాదు" అన్నాడు రవి కాస్త చిరాకుగా.

"నీ మంచి కోరే చెబుతున్నాను. వింటే విను. నిర్భంధమేమీ లేదు.నీ ఇష్టం వచ్చినట్లే చెయ్యి. ఎటొచ్చీ నా మాట వినకపోతే నానించి రాగికానీ కూడా ఆశించవద్దు.నా ఆస్థి అంతా స్వార్జితం" అన్నాడు శివరామకృష్ణయ్య.

రవి మాట్లాడలేదు. ఏం జవాబు చెప్పాలో అతనికి తెలియలేదు.

"రవీ! సునీత ఎంత మంచిపిల్లనుకున్నావు? చిన్నప్పటి నుంచీ, దాని తల్లీ, తండ్రీ పోయినప్పటినుంచీ అది నా దగ్గరే పెరిగింది. దానికి తల్లీ, తండ్రీ పోయినప్పటినుంచీ అది నా దగ్గరే పెరిగింది. దానికి తల్లి అయినా, తండ్రి అయినా నేనే. చదువు చెప్పించాను. చాలా బుద్ధిమంతురాలు. జాలిగుండె, నిర్మల హృదయం నవనీతంలాంటిది. పాపం చదువు మాని ఈ మూడు నెలలనుంచీ నాకు ఎట్లా శుశ్రూష చేస్తుందో చూడు. నువ్వు దాన్ని పెళ్ళి చేసుకో"

రవి నవ్వాడు. "సునీతనా! నేనా?" అన్నాడు ఆశ్చర్యంతో.

"ఏం? సునీతకేం? దానిలో ఉన్న లోటేమిటి?"

సునీతలో లోటేమీటో రవి చెప్పలేకపోయాడు.

"సునీత నన్ను చేసుకోడానికి ఇష్టపడవద్దూ?" అన్నాడు.

"సునీతా సునీతా!" పిలిచాడు శివరామకృష్ణయ్య.

సునీత వచ్చి "ఏం కావాలి మామయ్యా?" అని అడిగింది.

"రా తల్లీ ఇలా కూర్చో. మీ అమ్మా, నాన్నా పోయినప్పటినుంచీ నిన్ను పెంచి పెద్దదాన్ని చేశాను. ఇంక నేను ఎంతో కాలం బతకను. నే పోయినాక నువ్వేం అవుతావు? ఒంటిగా ఎలా ఉంటావు? నేనుండగానే నిన్నొక ఇంటిదాన్ని చేసిపోతే, నా మనస్సుకు శాంతి ఉంటుంది. నువ్వు రవిని పెళ్ళి చేసుకో!" అన్నాడు శివరామకృష్ణయ్య సునీత తల రాస్తూ.

సునీత ఆశ్చర్యపోయింది. రెండు నిమిషాలసేపు మాట్లాడలేకపోయింది. తన మామయ్య రవిని పెళ్ళి చేసుకోమంటాడని తను కలలో కూడా అనుకోలేదు. రవినా పెళ్ళి చేసుకోవడం. అతను అందవికారి కాకపోతేమటుకేం? నీతి, నిజాయితీ ఏ కోశానా లేని మనిషి. ఆ విషయం తనకు బాగా తెలుసు. అతన్ని చూస్తే తనకు ఇసుమంతైనా గౌరవం లేదు.

సునీత శివరామకృష్ణయ్య కళ్ళల్లోకి చూసింది, ఆయన కళ్ళు నీళ్ళతో నిండి ఉన్నాయి. జీవితాంతంలో ఉన్న మనిషి ఆయన. పాపం, ఒక్కగానొక్క కొడుకు. ఆ కొడుకు ఎందుకూ కొరగానివాడుగా తయారైనాడు. ఆయనకు మనశ్శాంతి లేకుండా పోయింది. ఎలాగయినా కొడుకును ఒక ఇంటివాణ్ణి చేసి, ఓ మార్గంలో పెట్టి కళ్ళు మూద్దామని తాపత్రయపడుతోంది ఆ ముసలి ప్రాణం. బతికితే ఇంకో నెలో, రెండు నెలలో బతుకుతాడు. సరేనని ఆ ముసలాయన్ని సంతోష పెట్టితే పోయేదేమిటి? వెంటనే పెళ్ళి అయిపోదుగా! కాని మామయ్యను అబద్ధం చెప్పి మోసగించడం మెట్లా?

సునీత మనస్సులో ఈ ఆలోచనలు వేగంగా పరిగెత్తాయి. మాట్లాడకుండా కూర్చుంది. పెళ్ళి చేసుకుంటానని చెప్పి మామయ్యను వంచించలేకపోయింది. చేసుకోనని నిక్కచ్చిగా చెప్పనూ లేకపోయింది. అందువల్ల జవాబు చెప్పకుండా ఆ గదిలోంచి వెళ్ళిపోయింది.

"వెర్రిపిల్ల! చెప్పడానికి సిగ్గుపడుతోంది" అన్నాడు శివరామకృష్ణయ్య.

"ఏమో! ఇష్టంలేదేమో!" అన్నాడు రవి.

"ఇష్టం లేకపోతే, ఇష్టం కలిగేట్లు చెయ్యడం నీ వంతు. నేను చెప్పవలసింది చెప్పాను. ఇంకో గంటసేపట్లో నీ నిర్ణయం చెప్పు. ఇక వెళ్ళు" అన్నాడు ముసలాయన.

రవి అక్కణ్ణించి లేచి హాల్లోకి వచ్చాడు సిగరెట్ వెలిగించి ఆలోచించసాగాడు. తన తండ్రి చాలా నిక్కచ్చి మనిషి. ఎంత తోస్తే అంతే! తను పట్టిన కుందేటికి మూడే కాళ్ళు అనే రకం. ఆయన మాట తను వినకపోతే తనకు చిల్లి గవ్వకూడా దక్కదు. అన్నంత పనీ చేస్తాడు. తను అప్పుడేం చెయ్యాలి?

●●●

**కిటికీ దగ్గర నిలబడి తోటలోకి చూస్తున్న సునీతను** చూశాడతను. ఆమె దగ్గరకు వెళ్ళి "సునీతా!" అని పిలిచాడు.

సునీత ఉలిక్కిపడి వెనక్కి తిరిగి "ఏం?" అని అడిగింది.

"నాన్న స్థితి నిజంగా ప్రమాదంగా ఉందా?"

"అవును. ఒకటి రెండు నెలలకన్నా బతకడం కష్టం అని డాక్టరు చెప్పాడు."

విని సిగరెట్ పీల్చి పొగ వదులుతూ "సునీతా! నన్ను పెళ్ళి చేసుకోవడం నీకు ఇష్టమేనా?" అని అడిగాడు.

సునీత రవిని ఎగాదిగా చూసి పెంకిగా నవ్వింది.

"నిన్నా? నేనా? ఊహూ!" అన్నది.

"ఏం?"

"నువ్వంటే నాకు అసహ్యం" అన్నది సునీత నిర్మొహమాటంగా.

"థాంక్స్, మరి ఇందాక నాన్న అడిగినప్పుడు ఆ విషయం ఎందుకు చెప్పలేదూ?"

"మామయ్యను బాధ పెట్టడం ఇష్టంలేదు. మరి ఏం చేద్దాం? నువ్వేమో నన్ను చేసుకోనంటున్నావు?"

సునీత జవాబు చెప్పలేదు.

"నేనో మాట చెబుతాను, వింటావా?" అన్నాడు రవి.

"చెప్పు!"

"నాన్న మహా ఉంటే ఇంకో రెండు నెలలు ఉంటాడని డాక్టరు చెప్పాడన్నావు. ఈలోగా ఆయన మనస్సు మనం నొప్పించడం దేనికి? పోనీ ఆయన ఇష్టప్రకారమే చేద్దాం."

"ఊహూ! ఏమైనా నిన్ను నేను చేసుకోను" అన్నది సునీత.

రవి తీక్షణంగా సునీత కళ్ళల్లోకి చూసి "పోనీ సునీతా! ఇంకో ఉపాయం చెబుతా వింటావా? మనం పెళ్ళి చేసుకున్నట్లు నటిద్దాం. నాన్న ఆఖరి రోజులు ప్రశాంతంగా, సంతోషంగా గడుస్తాయి. నాన్న పోయినాక నీ దారిన నువ్వూ, నా దారిన నేనూ పోదాం."

"అంటే?" అడిగింది సునీత.

"ఏముంది మనం పెళ్ళి చేసుకుంటామని నాన్నకు చెబుదాం. అవసరమైతే చేసుకున్నామని కూడా చెబుతాను. ఆయన మంచం మీద నుంచి కదలలేడు కదా! రిజిస్టరు పెళ్ళి చేసుకున్నామని చెబితే ఆయన తృప్తి పడతాడు."

"నీకు మీ నాన్న మీద ఇంత ఇష్టం ఎప్పటినుంచీ వచ్చింది?" అడిగింది సునీత.

"నేను చెప్పినట్లు చేస్తే నీకు ఆస్తిలో కొంత –"

"ఛీ! ఆ మాట మళ్ళీ అనక" అన్నది సునీత కోపంగా.

"పోనీ, వద్దులే! నాన్న కోసం ఈ చిన్న నాటకం ఆడలేవూ? నీకు కలిగే నష్టమేముంది?" అన్నాడు రవి ప్రాధేయపడుతూ.

సునీత జవాబు చెప్పలేదు.

"సరే! సునీతా! నేను మళ్ళీ ఇంకో గంటలో వస్తాను. ఈలోగా ఆలోచించుకో. ఏం?" అని రవి గబగబా బయటికి వెళ్ళాడు. వీధి చివర ఉన్న టెలి ఫోన్ బూత్‌లోకి వెళ్ళి ఒక నెంబరు తిప్పాడు.

"హల్లో! డార్లింగ్!" అన్నాడు.

"హల్లో! రవీ!"

"ఏం చేస్తున్నావు ఎమిలీ డియర్" అన్నాడు రవి.

"నిద్రపోతున్నాను. టెలిఫోను వినపడగానే అమాంతం పక్క మీద నుంచి లేచివచ్చాను. "

"ఇంటికి వచ్చేందుకు నాకిప్పుడు తీరికలేదు. వెంటనే డ్రెస్ చేసుకుని నన్ను ఇరానీ రెస్టారెంటులో కలుసుకో!" అన్నాడు రవి.

●●●

సునీత తన గదిలోకి వెళ్ళి మంచం మీద పడుకుని ఆలోచించసాగింది. మామయ్య తనను పెంచి పెద్దదాన్ని చేశాడు. చాలా గారాబంగా చూసుకుంటున్నాడు. చిన్నతనంలో తన తల్లీ తండ్రీ పోయినప్పటినుంచీ తనకు దిక్కు మామయ్యే. తన తండ్రి ఇచ్చిపోయిన కొద్దిపాటి ఆస్తి తన చదువుకీ, పెళ్ళికీ సరిపోతుంది కనుక, మామయ్య తన కోసం డబ్బు ఖర్చు చెయ్యవలసిన అవసరం లేకపోయింది. కానీ, డబ్బుకన్నా ఎక్కువైన రక్షణా, పోషణా, దయా, ప్రేమా, వాత్సల్యం మామయ్య తనకిచ్చాడు. మామయ్య పట్ల తనకు ఉన్న కృతజ్ఞత అంతా ఇంతా కాదు. ఆయన్ని చూస్తే తనకు అపారమైన గౌరవం ఉంది. 'తల్లీ! అమ్మా! చిట్టీ' అని మామయ్య పిలుస్తున్నప్పుడు తన హృదయం ద్రవించిపోతుంది. అటువంటి మామయ్య జీవిత జ్యోతి ఆరిపోయే సమయం ఆసన్నమయిందని తనకు తెలుసు. మామయ్యను తృప్తి పరిచేందుకు రవిని పెళ్ళిచేసుకోవాలా? అది తన ధర్మమా? ఏమో? మామయ్య మీద తనకెంత ఇష్టమూ, గౌరవమూ ఉన్నా ఆయన్ని సంతోషపెట్టేందుకు తన జీవితమంతా ఎలా బాధపడగలదు? అదీ వీలుకాదు. కానీ రవిని చేసుకోనంటే పాపం మామయ్య ఎంతబాధపడతాడు. ఈ స్థితిలో ఆ బాధ భరించగలడా? ఎట్లా? ఏం చేయాలి?

ఎటూ పాలుపోక సందిగ్ధంలోపడ్డ సునీతకు రవి చెప్పిన ఉపాయం ఆదరణ యోగ్యంగా కనిపించింది. అవును, తనూ రవీ పెళ్ళి చేసుకున్నట్లు నటిస్తే మమయ్య తృప్తిపడతాడు. సంతోషిస్తాడు. అయితే మామయ్యను మోసం చెయ్యడమా? తనకోసం, తన స్వార్థం కోసం తనలా చేయటంలేదు కదా! ఒకవేళ మామయ్యకు తెలిస్తే? ఎలా తెలుస్తుంది? సునీత పరిపరివిధాల ఆలోచించింది. ఆమెది జాలిగుండె చూస్తూ చూస్తూ ఇంకొళ్ళకు బాధ కలిగించేదిలేదు.

ఇంతలో తన గది తలుపు ఎవరో తట్టిన చప్పుడయింది. లేచి వెళ్ళి తలుపు తెరిచింది.

"నువ్వా!?" అన్నది రవిని చూసి.

"అవును. నేను వెళ్ళి గంటయింది. మరి ఏం ఆలోచించావు?" అడిగాడు ఆత్రుతతో.

సునీత కాలి బొటన వ్రేలు నేలమీద రాస్తూ "నువ్వు నన్ను ముట్టుకోననీ, నా దగ్గరకు రాననీ మాట ఇస్తావా?" అన్నది.

"ఛ! నీ జోలికి ఎందుకు వస్తాను?" అన్నాడు రవి.

"కేవలం మామయ్య మనశ్శాంతి కోసమే అబద్దం చెప్పి, నీ భార్యగా నటించడానికి ఒప్పుకుంటున్నాను. జ్ఞాపకముంచుకో. నీకు దుర్బుద్ధి పుట్టి నా జోలికి వచ్చావా నిజం మామయ్యకు చెప్పేస్తాను" అన్నది సునీత.

"నా మాట నమ్ము. పద. నాన్నకు చెబుదాం."

"నేనెందుకు నువ్వే చెప్పు" అని రవిని పంపేసి గది తలుపు మూసుకుంది సునీత.

## 2

సునీతా, తనూ పెళ్ళి చేసుకుంటానని రవి చెప్పగానే శివరామకృష్ణయ్య సంతోషానికి అంతులేదు. ఆఖరికి తన ఆశలన్నీ ఫలించాయికదా అని తృప్తిచెందాడు. రిజిష్టరు పెళ్ళి చేసుకుంటామనీ, పెళ్ళికి ఎటువంటి ఆర్భాటమూ చెయ్యకూడదనీ, తనూ, సునీతా రిజిస్ట్రారు ఆఫీసుకు వెళ్ళి సంతకాలు పెట్టి వస్తామనీ తండ్రితో రవి చెప్పాడు. కొడుకు పెళ్ళికి ఒప్పుకోవడమే చాలుననుకుని శివరామకృష్ణయ్య సరేనన్నాడు. పెళ్ళికి కావలసిన బట్టలూ, అవీ కొనుక్కోమని రవికి రెండువేలు ఇచ్చాడు. సునీతకు ఓ రెండువేలు ఇచ్చాడు. తన భార్య నగలు ఎస్టేటులో ఉన్నాయనీ, అవన్నీ సునీతవేనని చెప్పాడు. పెళ్ళికోసం శివరామకృష్ణయ్య ప్రయాణం ఇరవైరోజులు వాయిదాపడ్డది. కొడుకునీ, కోడలినీ తనతో కూడా తీసుకువెళ్ళాలని ప్రయాణం ఆపుకున్నాడు. రవీ, సునీతా కలిసి ఆడుతున్న దొంగాటకం ఆయనకి తెలియదు. సునీత తనకు శుశ్రూష చేస్తూంటే "తల్లీ! నువ్వు ఎంతసేపూ నా దగ్గరే కూర్చుంటే ఎలా? ఇద్దరూ కలిసి ఈ నాలుగు రోజులూ కులాసాగా పట్నమంతా తిరగండి" అని చెప్పేవాడు. తలనొప్పిగా ఉందనో, ఏదో పని ఉన్నదనో వంక చెప్పి ఇంట్లోనే ఉండిపోయేది సునీత. రవి యధాప్రకారం తన విలాసాల్లో కాలం గడుపుతున్నాడు. రవి ఇంటికి రావటం లేదని ఆయనకు తెలియదు. రోజులు త్వరగా గడిచిపోతున్నాయి. ఓరోజు రవీ, సునీతా రిజిస్ట్రారు ఆఫీసుకు వెళ్ళివచ్చినట్లు నటించారు. ఇద్దరూ కొత్త బట్టలు కట్టుకున్నారు. శివరామకృష్ణయ్య ఇద్దర్నీ పిలిచి, వాళ్ళ తలలమీద చేతులు పెట్టి "శుభస్య శీఘ్రస్య పుత్ర ప్రాప్తిరస్తు" అని దీవించాడు.

ఆనందంతో ఆయన కళ్ళు చెమ్మగిల్లాయి. సునీత కళ్ళల్లోంచి కూడా నీటి చుక్కలు రాలాయి. తను చేస్తున్న మోసం, మామయ్య అమాయకత్వం తలుచుకుని లోలోపల ఏడ్చింది.

"మనం రేపే బయలుదేరుతున్నాం. ఇవాళ ఇద్దరూ కులాసాగా ఊరంతా తిరిగిరండి. వెళ్ళండి" అంటూ ఇద్దరికీ చెరొక వెయ్యిరూపాయలు ఇచ్చాడు శివరామకృష్ణయ్య.

ఇద్దరూ గదిలోంచి బయటికి వచ్చారు. బయటికి రాగానే సునీత ఒక నిట్టూర్పు వదిలింది. రవి నవ్వాడు.

"ఎంత అమాయకంగా నమ్మేశాడు!?" అన్నాడు రవి. సునీత మాట్లాడకుండా తన గదిలోకి వెళుతూ ఉంటే, "సునీతా! పద పోదాం" అన్నాడు రవి.

"ఎక్కడికి?"

"టవునుకు వెళ్ళి ఏవైనా వస్తువులు కొందాం. ఆ మాత్రం హడావిడి చెయ్యకపోతే నాన్నకు అనుమానం కలుగుతుంది. మళ్ళీ మనం త్వరగా వచ్చెయ్యాలి. నాకు పనుంది" అన్నాడు రవి.

రవి అన్నది నిజమే. ఏవైనా వస్తువులు కొనుక్కు వచ్చి, కులాసాగా కనపడకపోతే మామయ్యకు అనుమానం కలుగుతుంది.

రవీ, సునీతా మూర్ మార్కెట్‌కు వెళ్ళారు. సునీత కావలసినవీ, అక్కర్లేనివీ, కంటికి కనిపించినవల్లా కొంది. రవి మాత్రం జేబులోంచి డబ్బు బయటకు తియ్యలేదు.

మూర్ మార్కెట్టులోంచి బయటకు వస్తూండగా ఎవరో అతను రవిని చూసి "హల్లో! రవీ ఇలా వచ్చావేం?" అని పలకరించాడు.

అతన్ని చూడగానే రవి మొహం మారిపోయింది. "షాపింగుకు వచ్చాం" అంటూ గబగబా కారెక్కాడు.

"ఎమిలీ ఏది?" అడిగాడతను.

రవి ఆ ప్రశ్నకు జవాబు చెప్పలేదు, అతన్ని చాలా కోపంగా చూశాడు. అతను నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు.

కారు బయలుదేరింది. దారిలో "ఎమిలీ ఎవరు?" అని అడిగింది సునీత.

"ఎవరో తెలిసిన మనిషి" అన్నాడు ముక్తసరిగా.

ఎమిలీ ఎవరో తెలుసుకోవాలనిపించింది సునీతకు. అది స్త్రీ స్వభావం. ఇంతలో రవి తన భర్త కాడనీ, అతని అంతరంగిక జీవితాన్ని గురించి అడిగే అధికారం తనకు లేదనీ జ్ఞాపకం తెచ్చుకుని ఊరుకుంది. కానీ ఎమిలీ ఎవరు? అనే ప్రశ్న ఆమె మనస్సును కలతపెడుతూనే ఉంది.

ఇన్‌వాలిడ్ చైర్లో శివరామకృష్ణయ్యను ప్లాట్ ఫారం మీదకు తీసుకు వెళ్ళి, బొంబాయి మెయిలులో ఫస్టుక్లాసు కంపార్టుమెంటులో కూర్చోపెట్టారు. రవీ, సునీతా కూడా అదే కంపార్టుమెంటు ఎక్కారు. ట్రాలీలో తెచ్చిన సామానంతా కూలీకు కంపార్టుమెంటులో సర్దేశారు. శివరామకృష్ణయ్య చాలా సంతోషంగా ఉన్నాడు. రవినీ, సునీతనూ చూసి మురిసిపోతున్నాడు.

రైలు కదిలింది. నెమ్మదిగా సెంట్రలు స్టేషను ప్లాట్ ఫారం వదిలింది. రైలు వేగం హెచ్చవుతున్న కొద్దీ శివరామకృష్ణయ్యలో ఉత్సాహం ఎక్కువవుతోంది.

అతను తన జీవితాన్నంతా ఒకసారి మనస్సులో సింహావలోకనం చేసుకుంటున్నాడు. ముప్పయ్యేళ్ళ వయస్సు దాటకముందు తను కోడూరు దగ్గర ఒక ఎకరం నేల కొన్నాడు. అందులో బత్తాయి చెట్లు నాటాడు. తను పట్టిందల్లా బంగారమయింది. ఎకరం కాస్తా పది ఎకరాలయింది. పదెకరాలు చూస్తూవుండగా వంద ఎకరాలైయినాయి. పెద్ద పెద్ద తోటలు విరగ కాశాయి. నవీన పద్ధతులు అనుసరించి రకరకాల పళ్ళ చెట్లు నాటించాడు. మంచి ఆదాయం రాసాగింది. వంద ఎకరాలు వెయ్యి ఎకరాలయింది. ఆ జిల్లా మొత్తంలో గొప్ప ధనవంతుడిగా పేరుపొందాడు. అంతలో తన భార్య పోయింది. అప్పటి నుంచీ కంటిలో పాపలా రవిని చూసుకుంటూ అతి గారాబంగా పెంచాడు, తనకు జీవితంలో ఎస్టేటు, రవి తప్ప ఇంక దేనిమీదా ఆసక్తి లేదు. రవి పెద్దవాడైనాడు. మద్రాసుకు పై చదువుకు పంపాడు. చదువు పూర్తయినా ఎస్టేటుకు తిరిగిరాలేదు. తన తదనంతరం తను ప్రాణసమానంగా చూసుకుంటున్న ఎస్టేటు ఏమవుతుందోనని దిగులుపడసాగాడు. పెళ్ళీ పెటాకులూ లేకుండా, పనీ పాటా లేకుండా ఎందుకూ పనికి రాకుండా పోయాడు కొడుకు. ఈ దిగులుతో తనకు మనశ్శాంతి లేకుండా పోయింది. గుండె జబ్బు రావటానికి ఆ దిగులే కారణం. కోడూరు డాక్టరు తనేం చెయ్యలేనన్నాడు. పట్నానికి వెళ్ళి స్పెషలిస్ట్‌కి చూపించుకోమన్నాడు. ఎస్టేటుకు మేనేజర్ని నియమించి పట్నానికి వచ్చాడు తను.

అదంతా గతం. ఇప్పుడు తనకే దిగులూ లేదు. తన కొడుకు తను చెప్పిన మాట విని దోవలోకి వచ్చాడు. సునీత వాణ్ణి అదుపులోకి తెస్తుంది. ఇలా ఆలోచించుకుంటూ నిద్రపోయాడు శివరామకృష్ణయ్య.

రవి కూడా కునికిపాట్లు పడుతున్నాడు. ఇంకో నెలో రెండు నెలలో అంతే. తర్వాత తను పట్నానికి తిరిగి వెళతాడు. ఆస్తంతా తన స్వాధీనంలోకి వస్తుంది. తన ఇష్టానికి అడ్డు చెప్పేవాళ్ళెవరూ ఉండరు. నెలో, రెండు నెల్లో ఓపిక పట్టాలి. అంతే! అనుకుంటూ రవి నిద్రపోయాడు.

సునీత పరిగెడుగుతున్న రైలు కిటికీలోంచి చీకట్లోకి చూస్తోంది. ఒకసారి మామయ్యను చూసి తనలో తను నవ్వుకుంది. మామయ్య ఎంత హాయిగా నిద్రపోతున్నాడు. ఎమిలి ఎవరో మామయ్యకు తెలియదు కదా! తనకూ తెలియదు.

తెల్లవారుతోంది. ఇంకా వెలుగు రాకపూర్వమే రైలు కోడూరు స్టేషన్‌లో ఆగింది. అక్కడ మూడు నిమిషాలే ఆగుతుంది. కాని శివరామకృష్ణయ్య కోసం అయిదు నిమిషాలెక్కువ ఆపారు. ఇద్దరు కూలీలు ఇన్‌వాలిడ్ చైర్ తెచ్చి శివరామకృష్ణయ్యను కూర్చోబెట్టారు. సామానంతా ప్లాట్‌ఫారం మీద దిగింది. కూలీలు ట్రాలీ తెచ్చి సర్ది పెట్టారు.

"మీరు కారులో వెళ్ళండి. సామాను తీసుకుని నేను వస్తాను" అంటున్న మనిషి వైపు చూసింది సునీత.

పొడుగ్గా, భారీగా ఉన్నాడు. ఖద్దరు లాల్చీ, పైజమా వేసుకున్నాడు. ఉలెన్ మఫ్లర్ ఒకటి మెడకు చుట్టుకున్నాడు. అతని కంఠస్వరంలో నిండు దనం ఉంది. సంస్కారం, విజ్ఞానం ధ్వనిస్తున్నాయి.

"ఇతనే ఎస్టేటు మేనేజరు కాంతారావు. నా కుమారుడు రవీ, కోడలు సునీతా" అన్నాడు శివరామకృష్ణయ్య మేనేజర్ని పరిచయం చేస్తూ.

"ఓహో" అన్నాడు రవి మేనేజరు చాపిన చెయ్యి చూడకుండా.

సునీత నమస్కారం పెట్టింది. రవీ, సునీతా, శివరామకృష్ణయ్యా కారెక్కారు. స్టేషనుకి ఎస్టేటు పన్నెండు మైళ్ళుంది. డ్రైవరు కారుపోనిచ్చాడు.

●●●

**ఎస్టేటుకు** వచ్చి వారం రోజులైంది. సునీత వసారాలో పేము కుర్చీలో కూర్చుని దూరాన పోతున్న ఎద్దుబళ్ళను చూస్తోంది. అది చాలా పెద్ద ఇల్లు. శివరామకృష్ణయ్య అన్ని వసతులూ గల పెద్ద భవనాన్ని కట్టించాడు. ఇంటికి మూడు ఫర్లాంగుల దూరంలో ఎస్టేటు ఆఫీసు ఉంది. అందులో మేనేజర్ ఆఫీసు గదీ, ఎస్టేటు తాలూకు రికార్డులు ఉండే గదీ, పనిముట్లూ, విత్తనాలు దాచే గదీ ఉన్నాయి. ఎస్టేటు తాలూకు రికార్డులు ఉండే గదీ, పనిముట్లూ, విత్తనాలూ దాచే గదీ ఉన్నాయి. ఎస్టేటు మేనేజరు కాపరం కూడా అక్కడే

కోడూరు నుంచి డాక్టరు రోజూ వచ్చి శివరామకృష్ణయ్యకు ఇంజెక్షను ఇస్తున్నాడు. ఆయనకు శుశ్రూష చేయడంలోనూ, ఇంటి వ్యవహారాలు చక్కదిద్దుకోవడంలోనూ సునీత కాలం సాగిపోతూంది.

"మీ మామగారు నిద్రపోతున్నారా?"

సునీత ఉలిక్కిపడి వెనక్కి తిరిగింది. తన పక్కన కొంచెం దూరంలో నిలుచున్నాడు కాంతారావు. అతని చేతిలో కాగితాలున్నాయి. తల వంచుకుని నేల చూస్తున్నాడు. ఎప్పటిలా ఖద్దరు లాల్చీ, పైజమా తొడుక్కున్నాడు. పాతికేళ్ళకన్నా ఎక్కువ వయస్సుండదు అతనికి.

"చూసి వస్తానుండండి" అని చెప్పి సునీత శివరామకృష్ణయ్య గదిలోకి వెళ్ళింది. ఆయన నిద్రపోతున్నాడు. కిందికి దిగివచ్చి ఆ విషయం కాంతారావుకు చెప్పింది.

"మీ వారు ఉన్నారా?" అడిగాడు కాంతారావు.

"రవా! లేడు. ఎందుకు? ఎస్టేటు ఆఫీసులో లేడూ?" అడిగింది సునీత.

"ఆఫీసుకు వచ్చి నాలుగురోజులైంది. కొన్ని పద్దులు చూపించి, సంతకాలు పెట్టించుకోవాలి" అన్నాడు కాంతారావు.

సునీత ఆశ్చర్యంతో కాంతారావును చూసింది. రవి రోజూ పొద్దున్నే బయలుదేరి వెళుతున్నాడు. ఒక్కొక్క రోజు మధ్యాహ్నం కూడా ఇంటికి రావడం లేదు. ఆఫీసులో ఉండిపోతున్నాని చెప్పాడు. ఎక్కడికి వెళుతున్నాడో అని లోపల అనుకుని పైకి మాత్రం "మామయ్య నిద్రలేవగానే మీకు కబురు పంపుతాను" అన్నది.

కాంతారావు సరేనని తల తిప్పి వెళ్ళిపోయాడు. సునీత అతనినే చూస్తూ కూర్చున్నది. మనిషి ఎంత ఠీవిగా ఉన్నాడు. ఎంత మర్యాద? తనని కన్నెత్తి చూడలేదు. అతని ప్రవర్తనలో ఎంతటి ఉత్తమ సంస్కారం వ్యక్తమవుతోంది. అతన్ని చూడగానే తనలో ఎందుకో ఏదో ఒక కొత్త అనుభూతి కలుగుతోంది. ఏమిటి తనలో ఈ సంచలనం. అతని కంఠస్వరం వినగానే తనకెందుకు తొట్రపాటు. సునీత రవినీ, కాంతారావునీ మనస్సులో పోల్చి చూసుకుంది. వాళ్ళ ఇద్దరికీ రూపంలో, ప్రవర్తనలో, నైజాల్లో ఉన్న వ్యత్యాసం గురించి ఆలోచించసాగింది.

సునీత సమక్షంలోంచి వెళుతున్న కాంతారావుకు సునీత తనను తదేకంగా చూస్తోందని తెలుసు. ఆమె చూపులు అతని మెడమీద కితకితలు పెడుతున్నాయి. అనిర్వచనీయమైన ఆనందం ఏదో అతని హృదయంలో పొంగిపోతోంది. తనలో ఏదో నూతన ఉత్సాహం, నూతన వికాసం కలిగినట్లనిపించింది. సునీతను చూసినపుడల్లా, ఆమె మాటలు విన్నపుడంతా తనలో ఏదో సంచలనం కలుగుతోంది. ఎందుకు? అని తనను తను ప్రశ్నించుకున్నాడు కాంతారావు. సునీత ఎవరు? రవి భార్య. పరస్త్రీని చూసి తనెందుకిలా

అయిపోతున్నాడు. ఎంత తప్పు? ఇటువంటి ఆలోచన రావడమే నైతిక పతనం. తన ఆలోచనలనూ, ఆవేశాలనూ అదుపులో ఉంచుకోవాలి. వాటికి లొంగిపోతే తన జీవితమేకాక, మరికొన్ని జీవితాలు కూడా నాశనమవుతాయి అనుకుంటూ కాంతారావు తన ఆఫీసు గదిలోకి వెళ్ళాడు.

●●●

"నేనింక వెళ్తాను. ఆఫీసులో ఒకసారైనా కనిపించకపోతే ఆ మేనేజరుగాడు మా నాన్నకి చెబుతాడు" అన్నాడు రవి మంచం మీదనుంచి లేచి నిలబడి.

"డార్లింగ్ నాకు ఇక్కడ ఏం తోచడంలేదు. ఎలా ఉండను. ఇంక ఎంతకాలం ఉండాలో" అన్నది ఎమిలీ.

"చూడు ఎమిలీ మైడియర్. నిజానికి నువ్వు ఇక్కడ ఉండడం అనవసరం. ఇంకో నెలరోజుల్లో నేను మద్రాసుకి వచ్చేస్తాను. మళ్ళీ ఎక్కడికీ వెళ్ళను. చేతి నిండా డబ్బు ఉంటుంది. మన ఇష్టం వచ్చినట్లు ఖర్చుపెట్టుకోవచ్చు" అన్నాడు రవి ఎమిలీ భుజం మీద రెండు చేతులూ వేసి.

పిల్లికళ్ళలాగున్న కళ్ళను చిట్లించి ఎమిలీ తీక్షణంగా రవిని చూసింది. "నీ మీద నాకు నమ్మకం లేదు రవీ! నీకు మనోబలం లేదు" అన్నది.

ఎమిలీ ఆంగ్లో ఇండియన్ వనిత. ఇండియన్ కన్నా ఆమెలో ఆంగ్లజాతి లక్షణాలెక్కువ. చాలా అందగత్తె. అందాన్ని ప్రదర్శించి ఆకర్షించడం ఆమెకు బాగా తెలుసు. పెదిమలకు ఎర్రరంగూ, చెంపలకు గులాబీరంగూ చక్కగా దిద్దుకుంది. జుట్టు కత్తిరించి, ఉంగరాలు తిప్పి, రిబ్బన్లతో కట్టింది. గౌనులోంచి ఆమె ఒంటి రంగూ, నునుపూ కనిపిస్తున్నాయి. సన్నని నడుం, నడుంకు అంటుకుని గౌను. ఆమె వేసుకున్న జార్జెటు బ్లౌజులోంచి ఎత్తయిన ఆమె వక్షోజాలు తొంగి చూస్తున్నాయి.

ఎమిలీ అందం శరీరాన్ని ఉడుకెత్తించి, రక్తాన్ని ఉరకలు పెట్టించి, ఒళ్ళు ఝల్లుమనిపించే అందం. మొగాడికి వెర్రి ఎత్తించి, వీణ వాయించినట్లు నరాలను మీటే అందం ఆమెది. ఉచ్చనీచాలను మరిపించి, ఒళ్ళు తెలియని వాంఛల్లో ముంచుతుందా అందం.

రవి ఆమెకు దగ్గరగా జరిగి, రెండు చేతులు ఆమె వీపు మీద వేసి, తన దగ్గరకు లాక్కుంటూ "ఎమిలీ డియర్ నామీద నీకెందుకింత అనుమానం?" అన్నాడు.

"ఆ సునీతను నేనింతవరకూ చూడలేదు. ఆమెను చూసి, నిన్నామె తన వశం చేసుకోలేదన్న నమ్మకం కలిగేంతవరకు నాకు నీమీద అనుమానం పోదు. మీనాన్న చచ్చేవాడు త్వరగా చావరాదూ! మనం మద్రాసుకి వెళ్ళిపోవచ్చు" అన్నది ఎమిలి.

రవి నవ్వాడు. ఎమిలో తన్మయత్వంలో ఉన్నాడు. "అవును, డబ్బు మూటకట్టుకుని పోవచ్చు" అన్నాడు.

సాయంకాలం షికారుకు బయలుదేరింది సునీత. ఆ రోజంతా బాగా ఎండ కాసింది. చల్లదనం కోసం కాలవ గట్టుదాకా నడిచి వెళదామనుకుంది. మామిడి తోటలోంచి నడిచింది. బత్తాయి తోట దాటింది. కాలవగట్టు చేరుకుంది. కోయిల కూతలు వింటూ కూర్చుంది. కాలవలో నీళ్ళు నిర్మలంగా పారుతున్నాయి. అవతల గట్టున బాతులు తడిసిన రెక్కలను దులుపుకుంటున్నాయి.

సునీత అట్లా ఏకాంతంగా ఓ అరగంట సేపు కూర్చుంది. చీకటి పడుతున్నట్లనిపించింది. చేతి గడియారం చూసుకుంది. ఇంకా ఆరుగంటలైనా కాలేదు. తలెత్తి ఆకాశం వేపు చూసింది. మబ్బులు దట్టంగా అలుముకున్నాయి. చటుక్కున లేచి, వెనక్కి తిరిగి గబ గబా నడిచింది.

ఇల్లు ఇంకా మూడు ఫర్లాంగుల దూరం ఉండగా దబదబా చినుకులు పడటం మొదలుపెట్టాయి. సునీత పరిగెత్తింది. వాన ఎక్కువవుతోంది. ఎక్కడ తలదాచుకుందామా అని చుట్టూ చూసింది. దగ్గరలో ఎస్టేటు ఆఫీసు కనిపించింది. అటువేపు పరుగెత్తింది. అప్పటికే బాగా తడిసిపోయింది. ఆఫీసు వసారాలో నిలబడి మొహం మీద కారుతున్న నీళ్ళు తుడుచుకుంటోంది.

"ఎవరది?"

సునీత ఉలిక్కిపడి వెనక్కి తిరిగింది.

"ఓహో! మీరా! ఇలా వచ్చారేం?" అన్నాడు కాంతారావు.

"షికారుకు వెళ్ళాను. ఇంటికి వస్తూండగా పట్టుకుంది" అన్నది సునీత.

"బాగా తడిసిపోయారే!"

"అవును" అంటూ సునీత ఒకసారి తనను చూసుకుంది, సిగ్గేసి తలొంచుకుంది. తడిసిపోయిన గుడ్డలు బాగా ఒంటికి అతుక్కుపోయాయి, సెలిఫోను కాగితం అతికించినట్లు గుడ్డలలోంచి ఆమె ఒంపులు స్పష్టంగా కనపడుతున్నాయి.

"ఇక్కడే నిలుచున్నారేం? ఆ గదిలోకి వెళ్ళండి. ఎవరూ లేరు" అన్నాడు కాంతారావు తను కూడా సిగ్గుపడుతూ.

సునీత గదిలోకి వెళ్ళింది. అది చాలా చిన్నగది. నాలుగయిదు అలమారలు, వాటిలో పుస్తకాలూ, ఒక బల్లా, ఒక కుర్చీ మాత్రం ఉన్నాయి. లోపలికి వెళ్ళి తలుపు గడియపెట్టుకుంది. తడిసిపోయిన చీర అంచులు పిండింది. ఇంతలో తలుపు పైన ఉన్న కిటికీలోంచి గదిలో ఏదో పడ్డది. సునీత భయపడి అటు చూసింది. రెండు టర్కిష్ తువ్వాళ్ళు కింద పడివున్నాయి. కాంతారావు పడేసి ఉంటాడని అనుకుని సునీత నవ్వుకుంది. వాటిని తీసుకుని తలతుడుచుకుంది. జాకెట్టు విప్పేసి, నీళ్ళు పిండి, మళ్ళీ తొడుక్కుంది. కాళ్ళూ, చేతులూ తువ్వాలుతో తుడుచుకుంది. కిటికీలోంచి బయటికి చూసింది. బాగా చీకటిగా ఉంది. గదిలో కూడా వెలుగులేదు. వాన జోరుగా కురుస్తోంది. ఇంటికి వెళ్ళడం ఎలాగా అని ఆలోచిస్తూ కిటికీ దగ్గర పదిహేను నిమిషాలు నిలబడ్డది.

అంతలో తలుపు తట్టిన చప్పుడయి "ఎవరు?" అని అడిగింది.

"ఓసారి తలుపు తీస్తారా?" అన్నాడు కాంతారావు బయటనుంచి.

"ఎందుకు?" సునీత కాస్త గట్టిగా అడిగింది.

అతనేమీ జవాబు చెప్పలేదు. ఓ నిమిషం ఆగి సునీత తలుపు తెరిచింది. కాంతారావు లేడక్కడ. తలుపు దగ్గర ఒక లాంతరు ఒక ట్రే ఉన్నాయి. ట్రేలో ఒక పాట్, ఒక కప్పు, సాసర్లో బిస్కట్లు ఉన్నాయి. తను మొరటుగా మాట్లాడినందుకు సిగ్గుపడ్డది. అతనిలో ఎంత హుందా? ఎంత మర్యాద? ఎంత సంస్కారం. అనుకుంటూ "కాంతారావుగారూ" అని పిలిచింది సునీత.

"ఆఁ" లోపల్నించి అతని కంఠస్వరం వినపడ్డది.

సునీత అటువేపు వెళ్ళింది. వెనక గదిలో బల్లముందు కూర్చుని కాంతారావు ఒంటిగా కాఫీ తాగుతున్నాడు. చిన్న గోడ దీపం వెలుగుతోంది. సునీతను చూడగానే కాఫీ కప్పు బల్లమీద పెట్టి లేచి నిలబడ్డాడు. సునీత మాట్లాడకుండా వెనక్కి వెళ్ళి, తలుపు దగ్గర ఉన్న ట్రేని, దీపాన్ని తీసుకుని అతనున్న గదిలోకి వచ్చింది. ట్రే బల్లమీద పెట్టి ఒక బిస్కెట్ తీసుకుని కొరుకుతూ "మీరుండడమిక్కడేనా?" అని అడిగింది.

కాంతారావు ఖంగారుపడుతున్నాడు. తలెత్తి ఆమెను చూడను కూడా లేదు. "అవును" అన్నాడు.

"ఒక్కరే ఉంటున్నారా?" అడిగింది.

"అవును" అన్నాడు.

ఇంకేం మాట్లాడాలో సునీతకు తెలియలేదు. కాఫీ రుచి చూసి "చాలా బాగా చేశారే" అంది.

"అలవాటు" అన్నాడతను.

కాఫీ తాగేసి కప్పు బల్లమీద పెట్టింది. అతను ఆ కప్పును తీసుకుని, అక్కడే కుండలో ఉన్న నీళ్ళతో రెండు కప్పులూ కడిగి అలమారులో పెట్టాడు.

"మీరెందుకు కడిగారు? నేను కడగనూ" అంది సునీత.

"అలవాటు" అన్నాడతను.

అతను ఆమె వేపు చూడటానికే భయపడుతున్నాడు. ముళ్ళమీద కూర్చున్నట్లున్నాడు. తను ఉండడం అతనికి బాధగా ఉందేమో అనుకుంది సునీత.

"వాన తగ్గిందేమో?" అంటూ దీపం తీసుకుని గదిలోంచి బయటకు వెళ్ళిందామె. అతనూ ఆమె వెనకే వెళ్ళాడు. ఇద్దరూ హాల్లోకి వచ్చారు. సునీత కాలుమీద ఏదో వాలినట్లయింది. కెవ్వున కేక పెట్టి భయంతో వెనక్కి తిరిగింది. చేతిలోంచి లాంతరు జారి కిందపడి ఆరిపోయింది. మళ్ళీ కాలు మీద ఏదో పాకింది. కెవ్వుమని కేక పెట్టి వెనక ఉన్న కాంతారావును పట్టుకుంది.

"ఏమిటి?" అంటూ అతను ఆమెను పట్టుకున్నాడు.

చీకటి, బయట వాన హోరు, తడిగా నున్నగా ఉన్న ఆమె ఒళ్ళు, ఆమె ఒంటి సువాసన, ఆమె కురులు తన చెంపకు తగలడం, ఆమె చేతులు తన వీపుమీద ఉండడం - వీటన్నిటివల్లా అతనికి మైకం కమ్మినట్లయింది.

ఆమెను గాఢంగా కావలించుకున్నాడు. పెదిమలమీద గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు. "సునీతా!" అన్నాడు చెవిలో.

తను చేస్తున్న పనేమిటో వెంటనే అతనికి తెలిసి వచ్చింది. కాలుతున్న కట్టెను వదిలిపెట్టినట్లు ఆమె మీద నుంచి చేతులు తీసేశాడు. ఒక అడుగు వెనక్కి వేసి, జేబులోంచి అగ్గిపెట్టె తీసి ఓ పుల్ల వెలిగించాడు. "ఎలిక అయి ఉంటుంది" అంటూ లాంతరు కోసం చూశాడు. చిమ్నీ పగలలేదు. దీపం వెలిగించాడు. ఆమె వేపు చూసే ధైర్యం లేదతనికి. గోడకు ఆనించి ఉన్న గొడుగు తీసి సునీతకు ఇస్తూ "పదండి మిమ్మల్ని ఇంటి దగ్గర దిగబెడతాను" అన్నాడు.

సునీత అతన్ని రెప్పవాల్చకుండా చూస్తోంది. ఆమెకు ఏడుపూ, నవ్వూ కూడా వస్తున్నాయి. అతని తొట్రుపాటు, అతని ఖంగారు, అతని భయమూ చూస్తే ఆమెకు నవ్వు వస్తోంది. తను వివాహిత అనే అతను భయపడుతున్నాడు. కాదని తెలిస్తే ఏమంటాడు? ఆ మధురానుభవం క్షణంలో అంతమయినందుకు ఏడుపొచ్చింది. అతని పెదిమల వెచ్చదనాన్ని తలుచుకుని ఆమె ఉప్పొంగిపోయింది.

చినుకులు సన్నగా పడుతున్నాయి. తను గొడుగు వేసుకుంది. అతను తను గొడుగు వేసుకున్నాడు. అతను తడుస్తూ పక్కన నడుస్తున్నాడు.

"మీకు పెళ్ళయిందా?" అడిగింది.

"ఏం?"

"వానలో తడిసి మీ ఇంటికి తలదాచుకోడానికి వచ్చిన వాళ్ళని అందర్నీ ఇలాగే సత్కరించడం మీ అలవాటా?" అంటూ అతన్ని కవ్వించడం ప్రారంభించింది సునీత.

అతడు మాట్లాడలేదు.

"నాకు పెళ్ళయిందనీ, నేను మీ యజమాని కోడలుననీ మరిచిపోయారా?" నడుస్తూ అతనికి సూదుల్లా గుచ్చుకునే ప్రశ్నలు వేసింది. అతను జవాబు చెప్పలేక దీనంగా తలొంచుకున్నాడు.

"ఎందుకలా చేశారు?" అడిగింది మళ్ళీ.

అంతలో ఇల్లు చేరుకున్నారు. "క్షమించండి" అని అతను వెనక్కి తిరిగాడు.

●●●

శివరామకృష్ణయ్య మంచం మీద పడుకున్నాడు. సునీత ఆయన పక్కనే కుర్చీలో కూర్చుని బిగ్గరగా పత్రిక చదివి వినిపిస్తోంది. ఇంతలో నౌకరు వచ్చి "మేనేజరుగారు వచ్చారు" అని చెప్పాడు.

"రమ్మను" అన్నాడు శివరామకృష్ణయ్య.

సునీత లేచి వెళ్ళబోయింది.

"కూర్చో నువ్వెందుకు వెళ్ళడం ఎస్టేటు వ్యవహారాలు రహస్యాలేమీ కావు. నువ్వూ తెలుసుకోడం మంచిది" అన్నాడు శివరామకృష్ణయ్య.

సునీత కూర్చుంది.

కాంతారావు గదిలోకి వచ్చి సునీతను చూసి ఒక అడుగు వెనక్కి వేశాడు.

"రా కాంతారావు. రా! ఆ కుర్చీలో కూర్చో!" అన్నాడు శివరామకృష్ణయ్య.

కాంతారావు కూర్చుని జమా, ఖర్చులు రాసిన పద్దు పుస్తకం తీసి ఇచ్చాడు. "చూసి సంతకం పెట్టండి" అన్నాడు కాంతారావు.

శివరామకృష్ణయ్య ఆ పుస్తకం తెరవకుండానే "నా దగ్గరికి ఎందుకు తెచ్చావు? రవి ఏడీ?" అడిగాడు.

"కోడూరు దగ్గర ఎవరో కొత్త రకం నీళ్ళ పంపు పెట్టించారట. అదెలా పనిచేస్తున్నదో చూడటానికి నాలుగురోజుల్నుంచి రవి కోడూరు వెళుతున్నాడు" అని అబద్ధం చెప్పింది సునీత.

"ఫర్వాలేదే కొంచెం శ్రద్ధ వచ్చిందన్నమాట" అంటూ శివరామకృష్ణయ్య పద్దు చూసి, సంతకం పెట్టి పుస్తకాన్ని కాంతారావుకు ఇచ్చి "సరే ఇకవెళ్ళవోయ్" అన్నాడు.

కాంతారావు కదలలేదు.

"ఇంకా ఏమిటి? చెప్పు? సందేహిస్తావేం?" అన్నాడు శివరామకృష్ణయ్య.

"దయచేసి మీరు ఇంకో మేనేజర్ని చూసుకోండి."

"ఇంకో మేనేజర్నా! ఎందుకు? నువ్వెక్కడికి వెళతావు?"

"నేను ఉద్యోగం మానేసి వెళ్ళిపోతున్నాను."

"ఎక్కడికి?"

"మా ఊరికి"

"ఎందుకు?"

కాంతారావు జవాబు చెప్పలేదు.

"ఏం జీతం చాలదనా? ఎక్కువ కావాలంటే ఇస్తాగా ఎంత కావాలో చెప్పు" అన్నాడు శివరామకృష్ణయ్య.

"జీతం విషయం కాదు."

"మరి"

"మా ఊళ్ళో నా స్వంత వ్యవహారాలు కొన్ని అవసరంగా చూసుకోవలసివచ్చింది. వెళ్ళాలి."

"అయితే వెళ్ళి అవి పూర్తిచేసుకు రాకూడదూ!"

"రావడానికి వీలుంటుందనుకోను. అక్కడే ఉండిపోవలసి వస్తుంది."

"ఎప్పుడు వెళ్ళాలి?"

"ఎంత త్వరగా వీలయితే అంత త్వరగా వెళ్ళాలి"

శివరామకృష్ణయ్య ఓ నిమిషం ఆలోచించాడు.

"కాంతారావూ నువ్వు వెళ్ళిపోవడం నాకేమీ ఇష్టం లేదు. రవికి ఎస్టేటు వ్యవహారాలు ఇంకా ఏమీ తెలియవు."

"ఇంకో మేనేజర్ని"

"సరే తప్పనిసరైతే ఏం చేస్తాము. అదుగో ఆ ఫైలు ఇట్లాతే. అందులో నా ప్రకటనకు వచ్చిన దరఖాస్తులు ఉన్నాయి" అన్నాడు శివరామకృష్ణయ్య.

కాంతారావు ఫైలు తీసి ఇచ్చాడు. శివరామకృష్ణయ్య ఒక ఉత్తరం చూపించి "ఇతను ఇదివరకు దక్షిణంలో ఎక్కడో ఎస్టేటు మేనేజరుగా పనిచేశాట్ట. ఇతనికి రాయి. నూట యాభై జీతం ఇస్తాననీ వెంటనే రమ్మని రాయి. అతను రాగానే నువ్వు వెళ్ళవచ్చు" అన్నాడు శివరామకృష్ణయ్య.

కాంతారావు వెళ్ళిపోయాడు. అక్కడే కూర్చున్న సునీత ఈ సంభాషణంతా విన్నది. ఆమె లేచి వెళ్ళిపోబోతుంటే "సునీతా! మాట" అని పిలిచాడు శివరామకృష్ణయ్య.

"రవి ఎస్టేటు రొక్కంలోంచి రోజూ డబ్బు తీసుకుంటున్నాడు. ఇవ్వవద్దని మేనేజరుకు ఎలా చెప్పను. నువ్వు వాణ్ణి కొంచెం జాగ్రత్తగా కనిపెట్టి ఉండమ్మా!" అన్నాడు.

"సరే మామయ్యా!" అని సునీత మెట్లు దిగి వసారాలోకి వెళ్ళింది. కాంతారావు అప్పటికే బయటికి వెళ్ళిపోయాడు.

●●●

**సునీత కాంతారావును కలుసుకునేందుకు** చాలాసార్లు ప్రయత్నించింది. మూడుసార్లు ఎస్టేటు ఆఫీసుకు వెళ్ళింది. మూడుసార్లూ అతను లేడు. అతను తన మామయ్యను చూడడానికి వచ్చినప్పుడు అతనికోసం కింద వసారాలో కాపు కాచింది చాలాసార్లు. కానీ ఆమె దురదృష్టం కొద్దీ కాంతారావు మాట్లాడి బయటకు రాగానే శివరామకృష్ణయ్య సునీతను పిలిచేవాడు. ఇలా నాలుగు రోజులు జరిగింది. ఆ రోజు కొత్త మేనేజరు వస్తున్నాడు. అతన్ని తీసుకురావడానికి ఎస్టేటు కారులో కాంతారావు కోడూరు వెళతాడని సునీతకు తెలుసు.

సునీత ముస్తాబు చేసుకుని కారు షెడ్ దగ్గిర తారట్లాడుతోంది. ఎనిమిది గంటలు కావస్తుండగా కాంతారావు కారు షెడ్‌లోకి వెళ్ళి కారు బయటకు తీశాడు. సునీత అతన్ని సమీపించి "ఎక్కడికి వెళుతున్నారు?" అని అడిగింది.

"స్టేషనుకి" అన్నాడతను ఆమె వేపు చూడకుండా.

"కొన్ని వస్తువులు కొనుక్కోవాలి, నేనూ వస్తాను" అంటూ కారెక్కి ముందు సీటులో కాంతారావు పక్కన కూర్చుంది సునీత.

"మీరు తర్వాత వెళ్ళవచ్చు" అన్నాడతను కారు స్టార్టు చెయ్యకుండా.

"ఉహూఁ! ఇప్పుడే వెళ్ళాలి. కారు స్టార్టు చెయ్యండి" అన్నది సునీత.

కాంతారావు ఎదురు చెప్పలేకపోయాడు. కారు స్టార్టు చేశాడు.

నాలు ఫర్లాంగులు వెళ్ళిన తరవాత "మీరెందుకు ఉద్యోగం మానేస్తున్నారు?" అడిగింది సునీత.

అతను మాట్లాడలేదు.

"నిజంగా సొంత వ్యవహారాలు చూసుకునేందుకు మీరు మీ ఊరు వెళ్ళాలా?"

అతను తల ఊపాడు.

"ఆవాళ వానలో మీ ఆఫీసులో.. మర్నాడే కదూ మీరు ఉద్యోగ్యం మానెయ్యడానికి నిశ్చయించుకున్నారు?"

అతను మళ్ళీ తల ఊపాడు.

"ఎందుకు? నా వల్లనే?" అడిగింది సునీత.

అంత సూటి ప్రశ్న వేసేటప్పటికి అతను ఆమె వంక చూశాడు. ఆమె కళ్ళనిండా నీళ్ళు నిండాయి.

"అవును. నేను ఇక్కడ ఉండలేను" అన్నాడు.

అతని గొంతు బొంగురుపోయింది.

"మీకు నన్ను చూస్తే అంత ఇష్టమా?" అడిగింది సునీత అమాయకంగా.

అతను చకితుడై ఆమెను చూశాడు, "దయచేసి ఇంక విషయం ప్రస్తావించకండి. ఇష్టముంటేనేం? లేకపోతే నేం, మీకు పెళ్ళయింది. నేను నీతిలేనివాణ్ణి కాను" అన్నాడు.

"నాకు పెళ్ళి అయి ఉండకపోతే, మీరు ఉద్యోగం మానరు కదూ! ఇక్కడే ఉంటారు కదూ!"

అతను మాట్లాడలేదు.

"నిజానికి నాకు పెళ్ళికాలేదు. నేను అవివాహితను. కన్యను" అన్నది సునీత.

అతను ఆశ్చర్యంతో ఆమె వేపు తిరిగాడు. కారు ఆపాడు.

సునీత కళ్ళల్లోంచి అశ్రువులు చెక్కిళ్ళమీదకు ధారగా కారాయి. అతని ఒళ్ళోకి ఒరిగిపోయింది.

"ఏమిటిది సునీతా! తప్పు" అనగలిగాడతను.

"నిజం. నాకు పెళ్ళికాలేదు. రవి నా భర్త కాడు" అంటూ సునీత జరిగినదంతా కాంతారావుకు చెప్పింది. అతను చెవులప్పగించి ఆశర్యంతో విన్నాడు.

"నమ్మలేకుండా ఉన్నాను. కథలో లావుంది" అన్నాడు. రెండు చేతులో ఆమె చెంపలను పట్టుకుని కళ్ళను తుడుస్తూ "సునీతా అయితే నువ్వు నన్ను పెళ్ళిచేసుకుంటావా? నేను బీదవాణ్ణి, అయితే మాత్రం ఏం, నిన్ను నా ప్రాణంగా చూసుకుంటాను" అన్నాడు.

సునీత ఆనందంతో నవ్వి అతని నుదుటి మీద వేళ్ళతో రాస్తూ "నాకు తెలుసు కాంతా! నువ్వు పేదవాడివైనా, గొప్పవాడివైనా నాకు ఒకటే. నువ్వు ప్రాణం, కాని -"

"కాని -"

"మామయ్య" అని ఆగిపోయింది సునీత. పూర్తిగా చెప్పలేకపోయింది.

కాంతారావుకు అర్ధమయింది. అతను తల ఊపాడు.

మామయ్య కళ్ళు మూస్తేనే గాని తాము పెళ్ళి చేసుకునేందుకు వీలులేదు. తనూ, రవీ పెళ్ళి చేసుకోలేదన్న విషయం ఆయనకు తెలియకూడదు.

"కాంత్ నువ్వు ఉద్యోగం మాని వెళ్ళిపోకు. ఇక్కడే ఉండిపో" అన్నది సునీత.

"అదెట్లా? కొత్త మేనేజరు వస్తున్నాడు కదా! ఇంత వరకూ వచ్చాక ఇప్పుడూ మీ మామగారికి ఏమని చెప్పను. "

"మీ ఊళ్ళో నీ వ్యవహారాలు చక్కబడ్డాయి. నువ్వు వెళ్ళవలసిన అవసరం లేదని చెప్పు. మా మామయ్యకి నువ్వంటే చాలా ఇష్టం. తనే నిన్ను ఉండిపొమ్మంటారు."

కాంతారావు తల ఊపాడు. కారు స్టార్టు చేసి బయలుదేరారు. ఇరవై నిమిషాల్లో కారు కోడూరు చేరుకుంది. సామానులు కొనుక్కోవాలని సునీత బజారు వీధిలో ఆగిపోయింది. రైలు సరిగా టైంకి వచ్చింది. కొత్తగా వచ్చిన అతన్ని కారులో ఎక్కించుకుని బయలుదేరి బజారులో కారు ఆపాడు.

"ఇక్కడ ఎందుకు ఆపారు?" అడిగాడు ఆ కొత్తమనిషి.

"శివరామకృష్ణయ్యగారి మేనకోడలు బజారులో ఉన్నారు" అన్నాడు కాంతారావు. కొత్తగా వచ్చినతన్ని చూడగానే కాంతారావుకు ఎందుకో అయిష్టం ఏర్పడింది.

అతను పొట్టిగా, బక్కగా ఉన్నాడు. పల్చని జుట్టు దువ్వుకున్నాడు. పాంటు వేసుకుని, బుష్ షర్టు తొడుక్కున్నాడు. కళ్ళకి రిమ్‌లెస్ అద్దాలు, నోట్లో ఆగకుండా సిగిరెట్. అతని పేరు సూర్యనారాయణ. "ఓహో! బజారుకి ఇంత దూరం రావాలన్నమాట" అన్నాడు అతను. అంతలో సునీత కారు దగ్గరికి వచ్చింది. "ఈయనే సూర్యనారాయణగారు. కొత్త మేనేజరు" అన్నాడు కాంతారావు. సూర్యనారాయణ కొంచెం వెకిలిగా నవ్వుతూ నమస్కారం పెట్టాడు.

సునీత కారు వెనక సీటులో కూర్చుంది. కారు కదులుతున్నది.

"అరెరే! కొంచెం ఆపండి. ఎమిలీ ఎమిలీ" అంటూ సూర్యనారాయణ కారు దిగాడు.

బజారు వీధిలో వెళుతున్న ఎమిలీ ఆ పిలుపు విని పక్కకు తిరిగి చూసింది.

"ఏమిటీ వేషం. చీర కట్టుకున్నావేం? ఇక్కడున్నావేం రవేడి?" అడిగాడు సూర్యనారాయణ.

"పని మీద వచ్చాను. నువ్వెందుకు ఇక్కడికి వచ్చావు?" అడిగింది ఎమిలి.

"నేను ఓ ఎస్టేటుకు మేనేజరుగా వెళుతున్నాను. అన్నట్లు రవి తండ్రి ఎస్టేటు కూడా ఈ ప్రాంతంలోనే కదూ?"

"అవునవును. నేను తొందర పనిమీద వెళుతున్నాను. తర్వాత మళ్ళీ కలుసుకుందాం" అని ఎమిలీ చకచకా వెళ్ళిపోయింది.

కాంతారావూ, సునీతా ఒకళ్ళ మొహం ఒకరు చూసుకున్నారు, ఎస్టేటు ఆఫీసు దగ్గరికి వెళ్ళాక కారు ఆపాడు కాంతారావు.

"మీ సామాను ఆ గదిలో పెట్టుకోండి. చేతులూ కాళ్ళూ కడుక్కుని రండి. శివరామకృష్ణయ్యగారి దగ్గరకు తీసుకు వెళతాను" అన్నాడు కాంతారావు సూర్యనారాయణతో.

సూర్యనారాయణ కారు దిగగానే, సునీతను దింపేందుకు కారు స్టార్ట్ చేశాడు కాంతారావు.

"నువ్వు మామయ్యను కలుసుకుని వెళ్ళడంలేదని చెప్పు. ఈ సూర్యనారాయణని వెంటనే తిరుగు రైలు ఎక్కిద్దాం" అన్నది సునీత నవ్వుతూ.

కాంతారావు ఉద్యోగం మానేసి ఊరికి వెళ్ళవలసిన అవసరం లేనందుకు శివరామకృష్ణయ్య చాలా సంతోషించాడు. కానీ ఉద్యోగం ఇస్తామని మద్రాసునుంచి పిలిపించి, ఇప్పుడు మళ్ళీ అక్కర్లేదు వెళ్ళిపొమ్మనడం అన్యాయం అన్నాడు శివరామకృష్ణయ్య. అందుకు సూర్యనారాయణని అసిస్టెంటు మేనేజరుగా ఉండమని అడిగాడు. అందుకు సూర్యనారాయణ ఒప్పుకున్నాడు. సూర్యనారాయణకు ఎస్టేటు ఆఫీసులోనే బస ఏర్పాటు చేసుకోమని చెప్పాడు.

శివరామకృష్ణయ్యతో మాట్లాడి వస్తుండగా హాల్లో సూర్యనారాయణకు రవి కనిపించాడు.

"హల్లో రవీ నువ్వు ఇక్కడున్నావేం?" అడిగాడు సూర్యనారాయణ.

"ఈయన శివరామకృష్ణయ్యగారి కుమారుడు. మీ ఇద్దరికీ ఇదివరకు పరిచయం ఉన్నదా?" అన్నాడు పక్కనే ఉన్న కాంతారావు.

సూర్యనారాయణను చూడగానే రవి మొహంలో నెత్తురు చుక్కలేదు.

"నువ్వు ఎందుకు ఇక్కడకు వచ్చావు?" అడిగాడు ఖంగారుగా.

సూర్యనారాయణ చెప్పాడు. కోడూరులో ఎమిలీని చూసిన విషయం కూడా చెప్పాడు. ఎమిలీ పేరెత్తగానే రవి ఉలిక్కిపడ్డాడు. అది గమనించిన సూర్యనారాయణ ఇక్కడేదో మోసం జరుగుతోందని అనుమానపడ్డాడు. అదేదో నింపాదిగా తెలుసుకోడానికి నిశ్చయించుకున్నాడు. కానీ అతనికా శ్రమ లేకుండా రవే ఆ సాయంత్రం అతన్ని కలుసుకుని జరుగుతున్న నాటకమంతా చెప్పేసి "సూరీ! నువ్వు నన్ను బయటపెట్టకూడదు. నాకు సాయం చెయ్యాలి. నాన్నతో చెప్పక" అని ప్రాధేయపడ్డాడు.

సూర్యనారాయణ నవ్వాడు, ఇదంతా అతనికి చాలా బావుంది. రొట్టె విరిగి నేతిలో పడ్డట్లయింది.

సూర్యనారాయణా, రవీ మద్రాసులో కాలేజీలో సహవిద్యార్థులు. ఆ తర్వాత కూడా మద్రాసులో రవి ఏం చేస్తున్నదీ ఎలా ఉంటున్నదీ అంతా సూర్యనారాయణకి పూర్తిగా తెలుసు. డబ్బు చేసుకునే అవకాశం దొరికితే సూర్యనారాయణకు మిత్రుడూ, శత్రువూ అనే వ్యత్యాసం ఉండదు. అతనికి కావలసింది డబ్బు.

"సరే! ఎవరికీ చెప్పనులే మరి నాకెంత ఇస్తావు?" అడిగాడు సూర్యనారాయణ.

"డబ్బా! నా దగ్గర ఇప్పుడు డబ్బేముంది?" అన్నాడు రవి.

"ఇప్పుడు కాదులే. రేపు మీ నాన్న పోయాక ఇదంతా నీదవుతుందిగా అప్పుడేం ఇస్తావు?" అన్నాడు సూర్యనారాయణ ఇంకో సిగరెట్ వెలిగిస్తూ.

"అప్పుడు చూద్దాంలే" అన్నాడు రవి.

"ఆ విషయం ఇప్పుడే ఓ నిర్ణయానికి రావడం మంచిది."

"సరే ఎంతకావాలి చెప్పు."

"పదివేలు"

"పదివేలే?"

"అవును. నీకు వచ్చే ఆస్తి ఎంత?" ఎదురు ప్రశ్న వేశాడు సూర్యనారాయణ.

"అది మా నాన్న ఆస్తి. నీకు ఊరికే పదివేలు ఎందుకు ఇవ్వాలి?" అన్నాడు రవి.

"సరే ఇవ్వక్కర్లేదులే. మీ నాన్నకు చెబుతాను" అన్నాడు సూర్యనారాయణ నవ్వుతూ.

"చెబుతావూ మంచి పని చేస్తావు. సర్లే ఇస్తానులే" అన్నాడు రవి అప్పటి సంగతి చూసుకోవచ్చునని.

"అయితే, పదివేలకి ఓ ప్రామిసరీ నోటు వ్రాసి ఇయ్యి" అన్నాడు సూర్యనారాయణ.

పదివేల రూపాయలకు నోటూ వ్రాసి ఇవ్వక తప్పిందికాదు రవికి. చాలా సులభంగా పదివేలు సంపాదించుకున్నందుకు సూర్యనారాయణ తన తెలివి తేటలకు తనను తనే అభినందించుకున్నాడు. సూర్యనారాయణ వల్ల ప్రస్తుతం ఎంటువంటి ప్రమాదమూ లేదు కదా అని రవి తృప్తిపడ్డాడు. ఆ తరువాత ఎమిలీని కలుసుకున్నప్పుడు రవి జరిగిన విషయమంతా చెప్పాడు. ఎమిలీ కాసేపు సూర్యనారాయణని తిట్టింది. చివరికి పదివేలతో సూర్యనారాయణని కొని అతని నోరుకు తాళం వేయడమే మంచిదని నిర్ణయించింది. శివరామకృష్ణయ్య ఇంకా ఎంతకాలం రోగంతో తీసుకుంటూ ఉంటాడని చికాకు పడ్డది.

●●●

ఓ వారం రోజులు గడిచాయి. రవి స్థితి చాలా ఇరకాటాన పడ్డది. సూర్యనారాయణ అయిదూ, పదులతో ప్రారంభించి నెమ్మదిగా వందలలోకి దిగాడు. రవికి ఇవ్వక తప్పడంలేదు. ఎస్టేటు ఖజానాలోంచి డబ్బు తీసుకున్నందుకు శివరామకృష్ణయ్య రవిని గట్టిగా చివాట్లు పెట్టాడు. ఇక ముందెప్పుడూ ఎస్టేటు డబ్బు ముట్టుకోవద్దనీ, డబ్బు కావలసి వస్తే తనను అడగమని చెప్పాడు. కానీ రోజూ తండ్రిని వందా రెండు వందలూ ఎట్లా అడుగుతాడు. సూర్యనారాయణకు ఇవ్వకపోతే అతను ఊరుకోవడం లేదు. అందుకని గత్యంతరం లేక ఎస్టేటు ఖజానాలోనుంచి డబ్బు కాచెయ్యడం మొదలుపెట్టాడు. తను తీసుకున్నట్లు ఖర్చు రాయడం లేదు. ఖజానా తాళం చెవి ఒకటి రవి దగ్గరా, ఒకటి కాంతారావు దగ్గరా ఉన్నాయి. తను డబ్బు లాగేస్తున్న విషయం బయట పడుతుందని రవికో పక్కన భయంగా ఉంది. అంతగా వస్తే దొంగతనం కాంతారావుకు అంటగడదామనుకున్నాడు. అటు చూస్తే ఎమిలీకి రోజు రోజుకీ సహనం పోతోంది. ఇంకా ఎంతకాలం ఈ పల్లెటూళ్ళో ఉండటమంటోంది. ఆస్తి విషయం, డబ్బు విషయం ఏమైనా త్వరగా ఇక్కడనుంచి వెళ్ళిపోవాలని గోల

చేస్తోంది. అటు తండ్రికి అనుమానం కలగకూడదు. ఇటు ఎమిలీకి విసుగు పుట్టకూడదు. ఇంకో వైపు సూర్యనారాయణను తృప్తిపరుస్తూ ఉండాలి. వీళ్ళ మధ్య అతను పడేపాట్లు దేవుడి కెరుక. తండ్రి ఎలాగూ బతికేది లేదు. ఆ పోయే ప్రాణం కాస్త త్వరగా పోకూడదా అని మనస్సులో ఒకటి రెండుసార్లు అనుకున్నాడు రవి.

●●●

కాంతారావూ, సునీతా కలుసుకోడానికే వీలుపడటం లేదు, ఎస్టేటు ఆఫీసులో సూర్యనారాయణ కూడా ఉంటున్నాడు. బయట ఎక్కడైనా కలుసుకుందామంటే ఎవరైనా చూస్తారేమో, ముసలాయన వరకూ ఆ విషయం వెళుతుందేమో. నిజం బయటపడుతుందేమోనని భయం.

చివరికి విసుగెత్తి ఓ రోజున "ఎందుకు సునీతా మనకీ దొంగతనం. ఆయనతో నిజం చెప్పెయ్యి. ఏమంటాడేం. కొడుకుని తిడతాడు" అన్నాడు కాంతారావు.

"ఒద్దు కాంత్. ఇన్ని రోజులు ఓపిక పట్టాం. పాపం ఆయన్ని ఇప్పుడు బాధపెట్టడం దేనికి? అందరం కలిసి మంచం మీదనుంచి కదలలేని తనని మోసం చేశామని తెలిస్తే ఎంత బాధపడతాడు. తన కొడుకు ఆస్తికోసం ఇంత దొంగాటకం ఆడాడని తెలిస్తే ఆ ముసలి ప్రాణం ఎంత క్షోభపడుతుంది" అన్నది సునీత.

"నిజమే కానీ ఆయన?"

"ఉష్ అటువంటి ఆలోచన కూడా రాకూడదు కాంత్.. మామయ్య చివరి రోజులు సంతోషంగా గడిపి, కళ్ళు మూస్తే ఆ జీవిని చివరి రోజుల్లో సంతోష పెట్టామనే తృప్తి మనకు జీవితాంతమూ ఉంటుందిగా" అన్నది సునీత.

ఇంకో వారం గడిచింది. డాక్టరు రోజూ వచ్చి శివరామకృష్ణయ్యకు ఇంజక్షన్ ఇస్తున్నాడు. ఎస్టేటు ఖజానాలోంచి డబ్బు పోతున్నదని కాంతారావు శివరామకృష్ణయ్యకు చెప్పాడు. రెండు రోజుల్లో మూడు వందలు తేడా వచ్చింది. రవిని పిలిచి శివరామకృష్ణయ్య కేకలేశాడు. రవి తను తీయలేదని బుకాయించాడు. కాంతారావే తీసివుంటాడున్నాడు. కానీ శివరామకృష్ణయ్య నమ్మలేదు. కాంతారావు అలాటివాడు కాదని ఆయనకు తెలుసు.

"సరేలే ఆ ఖజానా తాళం చెవి ఇట్లా ఇచ్చెయ్యి. ఈసారి డబ్బుపోతే అతనే తీశాడని తేలుతుంది" అన్నాడు శివరామకృష్ణయ్య రవితో. రవి తాళం చెవి ఇవ్వక తప్పిందికాదు. రవి స్థితి మరీ ఇరుకులో పడ్డది. ఒక పక్కన ఎమిలీ, ఇంకో పక్కన సూర్యనారాయణ డబ్బుకు వేధిస్తున్నారు. ఆ పల్లెలో ఇన్ని కష్టాలుపడుతూ అతను ఉండలేకపోయాడు.

యధాప్రకారం డాక్టరు పొద్దునే వచ్చి శివరామకృష్ణయ్యకు ఇంజక్షన్ ఇచ్చి వెళుతూ ఉండగా రవి ఆయన్ని హాలులో కలుసుకున్నాడు.

"డాక్టరుగారూ నాన్నకి ఎలా ఉంది?" అడిగాడు.

"ఇదివరకంటే చాలా నయంగా ఉంది" అన్నాడు డాక్టరు.

డాక్టరు గొంతు విని సునీత కూడా హాల్లోకి వచ్చింది. శివరామకృష్ణయ్యతో మాట్లాడటానికి అంతకుముందే కాంతారావు వచ్చాడు అతనూ హాలులో నిలబడి డాక్టరు చెపుతున్నది వింటున్నాడు.

"అదికాదు డాక్టర్ నాన్నకి పూర్తిగా ఆరోగ్యం వస్తుందంటారా?" అడిగాడు రవి.

"ఆరోగ్యమా? మళ్ళీ యధాప్రకారం లేచి తిరుగుతారా అని అడుగుతున్నావా! సారీ రవీ అబద్ధం చెప్పడం దేనికి? మీ నాన్న లేచి మళ్ళీ తిరగడం సంభవం కాదు. జీవితాంతమూ అలా ప్రక్కమీద పడుకునుండవలసిందే ఏ మాత్రం లేచి తిరిగినా ప్రాణాపాయం తప్పదు" అని చెప్పి డాక్టరు వెళ్ళిపోబోయాడు.

"అయితే ప్రస్తుతానికి ప్రమాదం ఏమీ లేదంటారా?" అడిగాడు రవి డాక్టర్ని ఆపి.

డాక్టరు రవిని ఎగాదిగా చూశాడు. "అవును. రోజూ ఇంజక్షను తీసుకుంటూ, మందు సరిగా వేసుకుంటూ ఉంటే ఇలా ఇంకా నాలుగేళ్ళ పాటైనా ఈడ్వవచ్చు" అన్నాడు.

రవి సునీత మొహం చూశాడు. సునీత కాంతారావుని చూసింది.

"అయితే మద్రాసులోని డాక్టర్లు ఎందుకలా భయపెట్టారు? ఒకటి రెండు నెలలకన్నా బతకడని చెప్పారే?" అన్నాడు రవి.

"అప్పటి స్థితి అలా ఉంది. మందు బాగా పనిచేసింది. పూర్తి విశ్రాంతి తీసుకోవడం వల్ల కోలుకున్నారు" అని డాక్టరు వెళ్ళిపోయాడు.

రవి, సునీత, కాంతారావు ఒకళ్ళ మొహం ఒకళ్ళు చూసుకున్నారు. నవ్వాలో ఏడవాలో తెలిసిరాలేదు వాళ్ళకు.

●●●

**డిటెక్టివ్ యుగంధర్ దినపత్రిక** చదవడం పూర్తిచేసి మడిచి బల్లమీద పెట్టాడు. సిగరెట్ వెలిగించి, కుర్చీలో జారగిలబడి ఆలోచిస్తున్నాడు. అసలు మనుష్యులు నేరాలెందుకు చేస్తారు? నేరాలు చెయ్యకుండా ఆపడం ఎలా? అదీ అతని ఆలోచన.

రాజు క్రిదటి రోజు వచ్చిన ఉత్తరాలు ఫైల్స్‌లోకి ఎక్కిస్తున్నాడు.

నౌకరు రెండు కప్పుల్లో కాఫీ తెచ్చి బల్లమీద పెట్టాడు. కాఫీ చాలా వేడిగా ఉండడం వల్ల అలాగే ఉంచేశాడు యుగంధర్. గడియారం పదిగంటలు కొడుతోంది. అంతలో టెలిఫోను గణగణ మోగింది. రాజు ఫోను తీశాడు. ఒక నిముషం విన్నాడు.

"ట్రంకాల్ సార్! కోడూరు నుంచి ఎవరో మిమ్మల్ని పిలుస్తున్నారు" అంటూ రిసీవరు యుగంధర్‌కి అందించాడు రాజు.

"యుగంధర్ స్పీకింగ్!" అన్నాడు యుగంధర్.

అవతల వేపు నుంచి ఎవరో రెండు నిముషాల సేపు ఆపకుండా మాట్లాడారు. యుగంధర్ ఓపిగ్గా విన్నాడు.

"ఒక నిముషం ఆగండి. ప్రస్తుతం వేరే పనేమైనా ఉందేమో చూసి చెబుతాను" అంటూ ఉండగానే రాజు ఎంగేజ్‌మెంట్సు డైరీ తీసి చూసి "ఏమీ లేదు సార్" అన్నాడు.

యుగంధర్ "సరే, వెంటనే కారులో బయలుదేరతాను" అని టెలిఫోన్ పెట్టేశాడు.

"ఎవరు సార్?" అడిగాడు రాజు.

"కాంతారావుట. శివరామకృష్ణయ్యగారి మేనేజరుట."

"ఎందుకు ఫోను చేశాడు?"

"శివరామకృష్ణయ్యగారు మరణించారుట!!" అన్నాడు యుగంధర్.

"అయితే, మనం ఎందుకు?"

"ఆయన సహజంగా చచ్చిపోలేదని అతనికి అనుమానంగా ఉందిట. మనల్ని వచ్చి దర్యాప్తు చేయమంటున్నాడు కారు రెడీ చెయ్యి. బయలుదేరాం."

"ఇప్పుడేనా?"

"అవును. నువ్వు కారులో పెట్రోలు పోసి తెచ్చేటప్పటికి నేను సూట్ కేసులు సర్దిపెడతాను. అక్కడ ఎన్ని రోజులు ఉండవలసివస్తుందో ఏమో" అంటూ యుగంధర్ మేడమెట్లు ఎక్కాడు.

పదిహేను నిమిషాల్లో యుగంధర్, రాజా క్రిస్లర్ కారులో బయలుదేరారు. రాజు చేతిలో కారు ఇంద్రుడి రథంలా పోతున్నది. గంటకి అరవై, డెబ్బై మైళ్ళ స్పీడులో పోతోంది. మధ్యాహ్నమయేటప్పటికి కారు కోడూరు చేరుకుంది. అక్కడ శివరామకృష్ణయ్యగారి ఎస్టేటుకు దారి అడిగి తెలుసుకుని మళ్ళీ బయలుదేరారు.

శివరామకృష్ణయ్యగారి బంగళా దగ్గిర కారు ఆగేటప్పటికి మధ్యాహ్నం ఒంటిగంట అయింది. కారు ఆగడం చూసి కాంతారావు పరిగెత్తుకుంటూ వచ్చి "తమరే యుగంధర్‌గారనుకుంటాను" అన్నాడు.

"అవును. మీరేనా కాంతారావుగారు? ఇతను నా అసిస్టెంటు రాజు" అని చెప్పాడు యుగంధర్.

"పోలీసులు శవాన్ని తీసుకువెళ్ళిపోయారు. మార్చురీకి తీసుకువెళ్ళి ఉంటారనుకుంటాను. శివరామకృష్ణయ్యగారి గదికి తాళం వేశారు. ఇద్దరు కానిస్టేబుల్సును కాపలా ఉంచారు. మళ్ళీ వస్తామని చెప్పారు. దయచేసి మీరు ఆఫీసులోకి వస్తే కొన్ని విషయాలు చెబుతాను" అన్నాడు కాంతారావు.

అతను చాలా ఆందోళన పడుతున్నట్లు కనబడ్డాడు. మాటలు తడబడుతున్నాయి. యుగంధర్ కాంతారావును ఆపాదమస్తకమూ పరీక్షగా చూశాడు. కారు దిగి కాంతారావు పక్కనే నడుస్తూ వెళ్ళాడు. రాజు ఓ పక్కగా కారు ఆపి, యుగంధర్ వెనకే వెళ్ళాడు.

ముగ్గురూ ఎస్టేటు ఆఫీసులో ప్రవేశించారు. కుర్చీలు చూపించి యుగంధర్నీ, రాజునీ కూర్చోపెట్టాడు కాంతారావు.

"ఒక నిముషంలో వస్తాను ఉండండి" అని చెప్పి కాంతారావు లోపలికి వెళ్ళాడు.

యుగంధర్ గదంతా పరీక్షగా చూశాడు. గోడలకు చెక్క అలమారాలు ఆనించి ఉన్నాయి. వాటిలో ఫైల్సు, దస్తావేజులు ఉన్నాయి. కొన్ని పనిముట్లూ, చెడిపోయిన నీళ్ళ పంపు ఒకటీ, ఓ ఇంజనూ ఉన్నాయి.

కాంతారావు తిరిగి వచ్చి యుగంధర్‌కి ఎదురుగా కుర్చీలో కూర్చున్నాడు. "మీకు శివరామకృష్ణయ్యగారు తెలుసుననుకోను" అన్నాడు.

యుగంధర్ తల ఆడించి "తెలుసు. బాగా పరిచయం లేదనుకోండి. అయిదేళ్ళ క్రితం, నేను కడపజిల్లా కలెక్టరు అతిథిగా ఉన్నప్పుడు, ఓ రోజు శివరామకృష్ణయ్యగారు అక్కడికి విందుకు వచ్చారు. అప్పుడు కలుసుకున్నాను. మర్నాడు కలెక్టర్నీ, నన్నూ ఇక్కడికి తీసుకువచ్చి తోటలన్నీ చూపించారు" అన్నాడు.

"యుగంధర్‌గారూ మీ గురించి నేను చాలా విన్నాను. అందుకే ధైర్యం చేసి మమ్మల్ని రమ్మని కోరాను. మీకు శ్రమ కలిగినందుకు క్షమించండి. నేను డబ్బున్నవాణ్ణికాను. కానీ నాకు చేతనయినంత –"

యుగంధర్ చెయ్యి నోటి దగ్గిర పెట్టుకుని "ఉష్! ఆ విషయం మీరు ఫోనులో చెప్పారుగా! దానికి అంగీకరించే నేను వచ్చాను" అన్నాడు.

"ధన్యవాదాలు. మిమ్మల్ని ఎందుకు రమ్మన్నదీ చెబుతాను వినండి. ఇవాళ తెల్లారగట్టే శివరామకృష్ణయ్యగారి నౌకరు వచ్చి "అయ్యగారు పోయారు" అని చెప్పాడు. అప్పుడే నిద్రలేచి కాఫీ చేసుకుంటున్నాను. వెంటనే బైలుదేరి అక్కడికి వెళ్ళాను. శివరామకృష్ణయ్యగారి గది బయట ఆయన కుమారుడు రవి, మేనకోడలు సునీత నిలబడివున్నారు. నేను మంచం దగ్గిరకి వెళ్ళి శివరామకృష్ణయ్యగారి చెయ్యి పట్టుకుని నాడి పరీక్షించాను. నాడి ఆడటం లేదు. శరీరం బాగా చల్లగా ఉంది. గదిలోంచి బయటికి వచ్చేశాను."

"ఒక నిమిషంలో వస్తాను. క్షమించండి" అంటూ కాంతారావు లోపలికి వెళ్ళాడు. అయిదు నిముషాల్లో ట్రేలో మూడు కప్పుల కాఫీ తీసుకొచ్చి బల్లమీద పెట్టి "కారులో ఇంతదూరం వచ్చారు. అలిసిపోయివుంటారు. కాఫీ తీసుకోండి" అంటూ తనొక కప్పు తీసుకుని కాఫీ చప్పరిస్తూ మళ్ళీ చెప్పడం ప్రారంభించాడు.

"రోజూ పొద్దున్న ఒకసారీ, సాయంత్రం ఒకసారీ, కోడూరు నుంచి డాక్టరు సుబ్రమణ్యంగారు వచ్చి శివరామకృష్ణయ్యగారికి ఇంజక్షను ఇస్తుంటారు. ఆరు నెలల నుంచీ గుండె జబ్బుతో మంచం పట్టారు. మద్రాసుకు వెళ్ళి మూడు నెలలనుండి పెద్ద డాక్టర్ల దగ్గర మందు తీసుకున్నారు. అక్కడి డాక్టరు అది కుదిరే జబ్బుకాదనీ, ఒకటి రెండు నెలలకంటే బ్రతకడం కష్టం అనీ చెప్పారు. అందువల్ల శివరామకృష్ణయ్యగారు పోవడం నిజానికి ఏమీ ఆశ్చర్యంగాని, అనుమానంగాని కలిగించవలసిన అవసరంలేదు. కానీ డాక్టరు సుబ్రమణ్యంగారు శివరామకృష్ణయ్యగారు కోలుకుంటున్నారని, పూర్తి ఆరోగ్యం రాకపోయినా, ఇంకా నాలుగైదు ఏళ్ళు ఇట్లాగే బతకవచ్చునీ నిన్న చెప్పారు. అందువల్ల శివరామకృష్ణయ్యగారు ఆకస్మికంగా మరణించడం నాకు ఆశ్చర్యం వేసింది. రాత్రి గుండెనొప్పి ఏమైనా ఎక్కువై బాధపడ్డారా అని అడిగితే ఇంట్లో అందరూ తమకు ఆ సంగతి తెలియదన్నారు. సునీత మామూలుగా పొద్దున్న ఆయన గదిలోకి వెళ్ళి చూసినపుడు ఆయన పోయిన సంగతి తెలిసిందట. ఆయన మొహం చూస్తే ఏమీ బాధ పడ్డట్టు లేదు. ప్రశాంతంగా ఉంది" కాంతారావు ఆగాడు.

యుగంధర్ "ఊఁ!" అని ఒక సిగరెట్ వెలిగించి కాంతారావుకి ఒకటి ఇవ్వబోయాడు.

"థాంక్స్ నేను సిగరెట్లు తాగను" అన్నాడు కాంతారావు.

రాజు కూడా ఒక సిగరెట్ వెలిగించాడు.

"మాకెవరికీ డాక్టర్ని పిలవాలన్న ఆలోచన లేదు. మామూలు ప్రకారం డాక్టరు సుబ్రమణ్యం ఉదయం ఏడుగంటలకల్లా వచ్చారు. శివరామకృష్ణయ్యగారు పోయారని చెప్పగానే ఆయన ఆశ్చర్యపోయారు. గబగబా ఆయన గదిలోకి వెళ్ళారు. నేనూ రవీ, సునీతా కింద హాల్లో కూర్చున్నాము. ఈ వార్త విని అసిస్టెంటు మేనేజరు సూర్యనారాయణ కూడా వచ్చాడు. పదినిమిషాల తర్వాత డాక్టరు కిందకి దిగివచ్చారు. మా అందర్నీ ఒకసారి తీక్షణంగా చూసి, 'శివరామకృష్ణయ్యగారు సహజంగా మరణించినట్లు నాకు కనబడలేదు. శవాన్ని ఆటాప్సీ చేస్తేకానీ మరణపత్రం ఇవ్వలేను. మేజిస్ట్రేట్‌కు తెలియజేయవలసిన బాధ్యత నాకుంది.' అని ఒక ఉత్తరం రాసి నా చేతికిచ్చారు. దయచేసి ఈ ఉత్తరం వెంటనే కోడూరు మేజిస్ట్రేటుకు పంపండి' అని చెప్పారు. శవాన్ని కానీ, అక్కడ వస్తువులు కానీ ఏవీ ముట్టుకోవద్దనీ, నౌకర్లతో సహా అందర్నీ హాల్లోనే ఉండమని, ఎవరినీ ఆ గదిలోకి వెళ్ళవద్దని చెప్పారు డాక్టరు. నేనే కోడూరుకి వెళ్ళి మేజిస్ట్రేటుకి ఉత్తరం ఇచ్చాను. వెంటనే పోలీసు ఇన్‌స్పెక్టర్ని పంపుతానని చెప్పాడు మేజిస్ట్రేటు. అక్కణ్ణించి మీకు ఫోను చేశాను" అని చెప్పాడు కాంతారావు.

యుగంధర్ ఒక నిమిషం మాట్లాడలేదు. తర్వాత "కాంతారావుగారూ మీరు నన్ను రమ్మని ఎందుకు ఫోను చేశారు?" అని అడిగాడు.

"శివరామకృష్ణయ్యగారి చావుకు కారణం తెలుసుకునేందుకు. ఆయన ఆత్మహత్య చేసుకున్నారో, హత్య చేయబడ్డారో నిరూపించేందుకు మీ సహాయం కోరుతున్నాను. మీరు నిరూపించగలరని నాకు గట్టి నమ్మకముంది"

"ఆ పని పోలీసులు ఎలాగూ చేస్తారుగా! నేనెందుకు?"

"పోలీసులు నిజం కనుక్కోగలరని నాకు నమ్మకం లేదు."

"ఎందుకని?"

"పోలీసులు అంత సమర్థులుకారని కాదు. వాళ్ళు పొరపాట్లు చెయ్యవచ్చు. "

"ఎటువంటి పొరపాట్లు?" అడిగాడు యుగంధర్.

"ఏమో!" అన్నాడు కాంతారావు.

యుగంధర్ కాంతారావును తీక్షణంగా కళ్ళల్లోకి చూశాడు.

"కాంతారావుగారూ మీ యజమాని హత్య చెయ్యబడ్డారని మీకు అనుమానం ఉందా?" అడిగాడు.

"ఏమో హత్యచేయబడి ఉండవచ్చుకదూ!"

"ఎవరు హత్యచేసి ఉంటారో మీ కెవరిమీదనైనా అనుమానం ఉందా?"

"లేదు"

"నేరం మీ మీదకు వస్తుందని మీకేమైనా భయంగా ఉందా?"

"నామీదకా నా కటువంటి భయమేమీ లేదు" అన్నాడు కాంతారావు ఖంగారుగా.

యుగంధర్ లేచి నిలబడి "సారీ, కాంతారావూ నేను మీకు ఏమీ సహాయం చెయ్యలేను. అసలు నేను రావడమే పొరపాటు. వెళుతున్నాను" అన్నాడు.

"అదేమిటి? ఎందుకు? నా వల్ల ఏం పొరపాటు జరిగింది?" అడిగాడు కాంతారావు ఆదుర్దాగా.

"మీరు నాతో నిజమంతా చెప్పటం లేదు. మీకు తెలిసినదంతా దాచకుండా నాకు చెప్పకపోతే నేను మీకు చేయగల సహాయం ఏమీ ఉండదు. మీరు ఏదో దాస్తున్నారని నాకు స్పష్టంగా కనపడుతోంది. మీరు చెప్పదలచుకోకపోతే చెప్పమని మిమ్మల్ని నిర్భంధించే అధికారం నాకు లేదు. కానీ నా క్లయింటే నాకు నిజం చెప్పని పక్షంలో ఆ క్లయింటునూ, ఆ కేసునూ వదులుకుంటాను" అన్నాడు యుగంధర్.

"మీకు కోపం తెప్పించినందుకు క్షమించండి. నేనేమీ దాచడంలేదు. శివరామకృష్ణయ్యగారు ఆత్మహత్య చేసుకున్నారని మీరు నిరూపించండి, చాలు." అన్నాడు కాంతారావు.

యుగంధర్ కాంతారావుని ఆశ్చర్యంతో చూశాడు. "ఆత్మహత్య చేసుకున్నారని నిరూపించమంటారా? ఆత్మహత్య చేసుకున్నారని మీకు తెలుసా?" అడిగాడు.

"ఆత్మహత్యే అయుండాలి. నిన్న మధ్యాహ్నం శివరామకృష్ణయ్యగారు మునసబును పిలుచుకు రమ్మన్నారు. మునసబును పిలుచుకు వచ్చాను. ఆయన వీలునామా వ్రాసి సిద్ధంగా ఉంచారు. నన్నూ, మునసబునీ సాక్షి సంతకాలు చెయ్యమన్నరు. చేశాము. ఓ కాగితం కవరులో పెట్టి, అతికించి మునసబు కిచ్చారు. దాని ప్రతి ఒకటి ఇంకో కవరులో పెట్టి, అతికించి బీరువా సొరుగులో పెట్టి తాళం వేసి చెవి తనకివ్వమన్నారు. నేను అలా చేశాను."

"అయితే" అడిగాడు యుగంధర్.

"నిన్న పొద్దున్న డాక్టర్ వచ్చి శివరామకృష్ణయ్య గారు జబ్బుతో తీసుకుంటూ ఇంకా నాలుగేళ్ళవరకూ బతకవచ్చని చెప్పారు. ఆ సంగతి శివరామకృష్ణయ్యగారితో కూడా డాక్టరు చెప్పి ఉంటాడు. డాక్టరు వెళ్ళిపోయిన తర్వాత ఈ వీలునామా రాశారు. కనుక ఆయనకి ఇలా మంచం మీద తీసుకుంటూ, జీవచ్చవంలా ఇంకా నాలుగేళ్ళ పాటు బతకడం ఇష్టంలేదనీ, అందుకే ఆత్మహత్య చేసుకున్నారనీ అర్థ కావటంలేదా!" అన్నాడు కాంతారావు.

"కాంతారావుగారూ మీరు ఏదో దాస్తున్నారనీ, జరిగినదంతా పూర్తిగా చెప్పటం లేదనీ నాకు సందేహంగా ఉంది. హత్యా పరిశోధనలో చివరకు నిజం ఎలాగూ బయటపడుతుంది. మీరు దాచిపెట్టి ప్రయోజనం లేదు. చెప్పెయ్యండి" అన్నాడు యుగంధర్.

"యుగంధర్ గారూ! నేను ఇంతవరకూ మీకు చెప్పడానికి సందేహించిన విషయం ఒకటి ఉంది. చెప్పేస్తాను వినండి" అంటూ రవీ, సునీతా కలిసి పెళ్ళి చేసుకున్నామని ఆడిన దొంగాటకం విషయం చెప్పాడు. "దీనికి, ఆయన చావుకీ సంబంధం లేదని మీకు చెప్పలేను. నిజానికి ఆ విషయం వాళ్ళ రహస్యం. అది వెల్లడి చేసే అధికారం నాకు లేదు. అందుకే సందేహించాను." అన్నాడు కాంతారావు.

"వాళ్ళు అలా దొంగాటకం ఆడుతున్నారనీ, నిజంగా పెళ్ళి చేసుకోలేదనీ మీకెట్లా తెలుసు?" అడిగాడు యుగంధర్.

కాంతారావు తల ఒంచుకున్నాడు. జవాబు చెప్పలేదు.

"సునీత మీకు చెప్పిందా?" అడిగాడు యుగంధర్.

కాంతారావు అవునని తల ఆడించాడు.

"పోలీసు వారు మళ్ళీ ఎప్పుడు వస్తామని చెప్పారు"

"త్వరగా వస్తామన్నారు. వచ్చారేమో కూడా" అన్నాడు కాంతారావు.

●●●

శివరామకృష్ణయ్యగారి ఇంటి హాల్లో యుగంధర్, రాజు, కాంతారావూ అడుగుపెట్టారో లేదో "హాల్లో మిస్టర్ యుగంధర్! మీరిక్కడికి ఎప్పుడు, ఎందుకు? గుడ్‌గాడ్ 'అందుగల డిందులేడు' అన్నట్లు" అంటూ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ స్వరాజ్యరావు గబగబా యుగంధర్ దగ్గరకు వచ్చి కరస్పర్శ చేశాడు.

యుగంధర్ నవ్వుతూ "మీరు అప్పుడే ఎట్లా వచ్చారు? మీ పోలీసువారు క్షణం కూడా వృధా చేస్తున్నట్లు లేరే?" అన్నాడు.

స్వరాజ్యరావు మందహాసం చేశాడు. "నేను వేరే పనుండి కడపకు వచ్చాను. కోడూరు నుంచి స్థానిక పోలీసు వారు హెడ్ క్వార్టర్స్‌కి ఫోను చేశారు. ఈ కేసు ఛార్జి తీసుకోమని నాకు హెడ్ క్వార్టర్స్ నుంచి ఆర్డరు వచ్చింది" అన్నాడు.

"అంటే" ఏదో అనబోతున్నాడు రాజు.

"సర్లే, ఊరుకో అంతటితో. యుగంధర్, రండి మనం అలా కారు దగ్గరకి వెళదాం." అని వెనక నిలబడి ఉన్న స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ని చూసి "ఇప్పుడే వస్తాం" అన్నాడు స్వరాజ్యరావు. కాంతారావు హాల్లోనే నిలబడి ఉన్నాడు. అక్కడే రవీ, సునీతా, సూర్యనారాయణా కూడా ఉన్నారు. ఇన్స్పెక్టర్ స్వరాజ్యరావు యుగంధర్‌ని చెయ్యి పట్టుకుని కారు దగ్గరకు తీసుకువెళ్ళాడు. వాళ్ళతో రాజు కూడా వెళ్ళాడు. ముగ్గురూ యుగంధర్ క్రిస్లర్ కారులో కూర్చున్నారు.

"చెప్పండి, మీరు ఎందుకు వచ్చారు? మిమ్మల్ని పిలిచిందెవరు?" అడిగాడు స్వరాజ్యరావు.

కాంతారావు తనకు ఫోను చేశాడని చెప్పి, అతను చెప్పిన విషయాలన్నీ స్వరాజ్యరావుకు యుగంధర్ చెప్పాడు.

"శివరామకృష్ణయ్య ఆత్మహత్య చేసుకోలేదు యుగంధర్. హత్యచేయబడ్డాడు" అన్నాడు స్వరాజ్యరావు.

"హత్య చేయబడ్డాడని మీరెలా నిర్ణయించారు?"

"నేను కాదు నిర్ణయించింది. స్థానిక సబ్ ఇన్స్పెక్టరు అలా నిర్ణయించి, హెడ్ క్వార్టర్సుకి ఫోను చేశాడు. హర్టిసాల్ అనే మందు చాలా పెద్ద డోసు తీసుకోవడం వల్ల మరణించాడట. అది" ఇంకా ఏదో చెప్పబోతున్నాడు ఇన్స్పెక్టరు.

"నాకు తెలుసు హర్టిసాల్, వెర్నాల్, బార్బటన్ తెగకి చెందిన మందు. హృద్రోగాలకి వాడతారు. తక్కువ డోసులో. తీసుకుంటే బాగా పనిచేస్తుంది. కానీ డోసు ఎక్కవయితే చాలా ప్రమాదం" అన్నాడు యుగంధర్.

"హర్టిసాల్ మందు సీసా శవం పక్కన ఉన్న బల్లమీద ఉంది. డాక్టరు సుబ్రహ్మణ్యం దాన్ని శివరామకృష్ణయ్యకు ప్రిస్క్రయిబ్ చేశాడు. రోజూ రాత్రి పడుకోబోయే ముందు ఒక ఔన్సు బ్రాందీలో పది చుక్కలు వేసుకుని తాగమన్నాడు. నిన్న కొత్త సీసా తెప్పించారు. సాయంత్రం వచ్చినప్పుడు డాక్టరు ఆ మందు సీసా చూశాడట. అందులో దాదాపు రెండువందల చుక్కలున్నాయట. ముప్పయి అయిదు చుక్కలుగాని అంతకు ఎక్కువగానీ వేసుకుంటే ప్రమాదమట. ఆ విషయం శివరామకృష్ణయ్యకి, మిగతా అందరికీ చెప్పి ఆ మందు జాగ్రత్తగా వాడమన్నాడట డాక్టరు. డాక్టరు ఈ ఉదయం వచ్చి శవాన్ని చూడగానే చావు సహజంగా రాలేదని గ్రహించాడు. బల్లమీద ఉన్న హర్టిసాల్ మందు సీసా ఖాళీగా ఉందిట. క్రితం రోజు కొన్న నిండు సీసా ఖాళీగా ఉండటం చూసి డాక్టరు అనుమానపడ్డాడు. వెంటనే

మేజిస్ట్రేటుకు రిపోర్టు పంపాడు. శవాన్ని పోస్టుమార్టం చేయగా హర్టిసాల్ ఎక్కువ డోసు తీసుకోవడం వల్లే చావు సంభవించిందని తెలిసిందట. హర్టిసాల్ ఎక్కువ తీసుకున్న లక్షణాలు శవ పరీక్షలో స్పష్టంగా కనపడ్డాయిట" అని చెప్పాడు స్వరాజ్యరావు.

"కనిపించి ఉండవచ్చు. అంతమాత్రాన హత్య అని ఎలా నిర్ణయించారు? ఆత్మహత్య అయివుండవచ్చుగా" అన్నాడు యుగంధర్.

"మందు సీసా మీద వేలి ముద్రలు పరీక్షించారు. కొన్ని వేలిముద్రలు - కనిపించాయి. కానీ అవి శివరామకృష్ణయ్యవి కావు. అంటే మందు ఎక్కువ డోసులో ఆయన పోసుకోలేదు అని స్పష్టమవుతోంది కదా. వేలి ముద్రలు ఇంకెవరివో కావడం వల్ల హత్య చేయబడ్డాడని నిర్ణయింపబడ్డది" అన్నాడు స్వరాజ్యరావు.

"ఆ వేలిముద్రలు ఎవరివో తెలిసిందా?" అడిగాడు యుగంధర్.

●●●

**"లేదు. నిన్న మందుల షాపులో** ఆ సీసా శివరామకృష్ణయ్య కొడుకు రవి కొని తెచ్చాడు. అప్పుడు డాక్టరు శివరామకృష్ణయ్య దగ్గిర ఉన్నాడట. ఆయనే అట్టపెట్టెలోంచి సీసా బయటకు తీశాడు. కనుక సహజంగా డాక్టర్ వేలిముద్రలు సీసామీద ఉండాలి కానీ సీసామీద కనపడ్డ వేలిముద్రలు డాక్టరువి కావు. ఎవరివైనదీ మనం ఇప్పుడు తెలుసుకోవాలి" అన్నాడు స్వరాజ్యరావు.

"శివరామకృష్ణయ్య ఎన్ని గంటలకు మరణించిందీ తెలిసిందా?"

"ఇంకా నిర్ధారణగా తేలలేదు. రాత్రి పదకొండు గంటల తర్వాతా, మూడుగంటలకు పూర్వమూ మరణించి ఉండాలని డాక్టరు ఉజ్జాయింపుగా అంచనా వేశాడు. కడపనుంచి సర్జన్ వస్తున్నాడు. ఈపాటికి వచ్చి శవపరీక్ష ప్రారంభించి ఉండవచ్చు కూడా. సాయంకాలానికి మనకు రిపోర్టు వస్తుంది" అన్నాడు స్వరాజ్యరావు.

ముగ్గురూ కారు దిగి, ఇంట్లోకి వెళ్ళారు.

సునీత హాల్లో సోఫాలో కూర్చునున్నది. ఇన్స్పెక్టర్నీ, యుగంధర్నీ బెదురుతూ చూసింది. రవి అక్కడే పచార్లు చేస్తున్నాడు. కాంతారావు తలుపు దగ్గిర నిలబడి ఉన్నాడు. అసిస్టెంటు మేనేజరు సూర్యనారాయణ వసారాలో నిలుచుని సిగరెట్ తాగుతున్నాడు. సబ్ ఇన్స్పెక్టర్ రాఘవయ్య స్వరాజ్యరావుని చూసి లేచి నిలబడ్డాడు.

స్వరాజ్యరావు రవిని చూసి "మిష్టర్ రవీ! మీ తండ్రి సహజ కారణాలవల్ల మరణించలేదని ఇందాక చెప్పాను కదా, హత్య చేయబడ్డారనేందుకు నిదర్శనాలు కనపడ్డాయి" అన్నాడు.

"హత్యా!?" అన్నాడు రవి గాభరాగా.

సునీత ఊపిరి బిగపట్టింది. యుగంధర్ కాంతారావుని చూశాడు. అతను మమూలుగానే ఉన్నాడు.

"అవును. హత్యే!" అన్నాడు స్వరాజ్యరావు.

"హత్య అని ఎలా నిర్ణయించారు?" అడిగాడు రవి.

"క్షమించండి. హత్య అని నిర్ణయించడానికి మాకు లభించిన సాక్ష్యమేమిటో ఇప్పుడు ఎవరికీ చెప్పలేను. అలా నిర్ణయింపబడ్డందువల్లే దర్యాప్తు చేయమని మేజిస్ట్రేటు ఆర్డరు వేశారు" అని ఒక క్షణం ఆగి "దయచేసి నాకు ఓ ఖాళీ గది చూపించండి. నేను దర్యాప్తు చేయడానికి ఉపయోగపడుతుంది" అని స్వరాజ్యరావు లేచి నిలుచున్నాడు.

"అదుగో, ఆ గది ఖాళీగానే ఉంది. దాన్ని మీరు దర్యాప్తుకు వాడుకోండి" అన్నాడు రవి.

"థాంక్స్. మీరు రండి" అని రవిని పిలిచాడు స్వరాజ్యరావు. "దయచేసి మీరెవరూ ఇక్కణ్ణించి వెళ్ళవద్దు. మిమ్మల్నందర్నీ నేను కొన్ని ప్రశ్నలు అడగాలి" అని చెప్పి యుగంధర్ని తనతో రమ్మన్నాడు.

"మీ తండ్రిగారిని ఆఖరిసారి ఎప్పుడు కలుసుకున్నారు?" అడిగాడు రవిని స్వరాజ్యరావు.

"నిన్న సాయంకాలం నాలుగు గంటలకి షాపునుంచి మందు సీసా కొనుక్కు వచ్చాను. అది ఇవ్వడానికి మా నాన్న గదిలోకి వెళ్ళాను. అప్పుడు డాక్టరు అక్కడ ఉన్నాడు. ఆయనకిచ్చి వచ్చాను" అన్నాడు రవి.

"తర్వాత మీరు మళ్ళీ ఆ గదిలోకి వెళ్ళలేదా?"

"లేదు."

"మీ తండ్రిగారిని ఎవరు హత్యచేసి ఉంటారో మీకు ఎవరిమీదయినా అనుమానం ఉందా?"

"ఎవర్నీ నేను అనుమానించలేకుండా ఉన్నాను. హత్య అని మీరు ఎందుకంటున్నారో నాకు అసలు అర్థం కాలేదు" అన్నాడు రవి.

"మీ తండ్రిగారికి రోజూ మందు పోసి ఇచ్చేదెవరు?"

"సునీత."

"నిన్న సాయంకాలం మందుసీసా తీసుకుని మీరు మీ తండ్రిగారి గదిలోకి వెళ్ళారు. తర్వాత మళ్ళీ మీరు ఆ గదిలోకి వెళ్ళలేదు. అవునా! మీరు నాకు చెప్పవలసిన విషయాలు ఇంకేమైనా ఉన్నాయా?" అడిగాడు స్వరాజ్యరావు.

ఇంకేమీ లేవని చెప్పాడు రవి.

ఇన్‌స్పెక్టరు యుగంధర్ని చూసి "మీరేమైనా అడుగుతారా?" అన్నాడు.

యుగంధర్ తల ఊపి "మిస్టర్ రవీ! మీకు వివాహమైందా?" అని అడిగాడు.

రవి యుగంధర్ని కోపంగా చూసి "ఆ విషయం మీకెందుకు?" అన్నాడు.

"సునీత మీ భార్యా?" అడిగాడు యుగంధర్ మళ్ళీ.

"కాదు."

"అయితే సునీతా, మీరు వివాహం చేసుకున్నట్లు మీ తండ్రిగారితో ఎందుకు చెప్పారు? రెండు నెలలనుంచీ మీరిద్దరూ భార్యాభర్తలుగా ఎందుకు నటిస్తున్నారు?"

రవి ఆశ్చర్యపోయాడు. "ఈ విషయం మీకు ఎవరు చెప్పారు?" అని ఎదురు ప్రశ్న వేశాడు.

"ఎవరు చెపితేనేంలెండి. నా ప్రశ్నకు సమాధానం చెప్పండి."

"మా నాన్న పెళ్ళిచేసుకోమని నన్ను నిర్బంధం చేశాడు. మేమిద్దరం ఆలోచించుకుని ఆయన్ని తృప్తిపరిచేందుకు అలా చేశాము."

"అబద్ధం బయటపడకుండా అలా ఎంతకాలం నటిద్దామనుకున్నారు?"

రవి జవాబు చెప్పలేదు.

"మీ తండ్రిగారు ఒకటి రెండు నెలలకన్న బతకలేరనుకునే కదా అబద్ధం చెప్పారు?"

"అవును."

"మీ నాన్నగారికి బాధ కలిగించకూడదనా, లేక సునీతను పెళ్ళి చేసుకోకపోతే మీకు ఆస్తేమీ ఇవ్వనని మీ నాన్నగారు బెదిరించడంవల్లా మీరు అలా నాటకమాడారు?"

రవి జవాబు చెప్పలేదు.

"దయచేసి జవాబు చెప్పండి."

"రెండూ కారణాలే" అన్నాడు రవి.

"నిన్న మీతో డాక్టర్ సుబ్రమణ్యంగారు మీ నాన్న కోలుకుంటున్నారనీ, ఇంకా నాలుగైదు ఏళ్ళు బతకవచ్చనీ చెప్పారు. అవునా?"

"అవును."

"అయితే మరి ఏం చేద్దామనుకున్నారు?"

"అంటే?" అడిగాడు రవి.

"ఇంకా ఎంతకాలం మీ భార్యా, భర్తల నాటకం ఆడదామనుకున్నారు?"

"మా నాన్నకు నిజం చెప్పేద్దామనుకున్నాను."

"చెప్పారా?"

"లేదు."

"ఎందుకు చెప్పలేదు?"

"ధైర్యం చాలక."

"చెప్పి ఉంటే ఏమయేది?"

"ఏమో?"

"ఆస్తి ఇతర్లకి ఇచ్చేవారు. అవునా? కనుక ఇప్పుడు మీ తండ్రిగారు మరణించడం మీకు అనుకూలమైంది కదూ!"

రవి ఉగ్రుడై లేచి నిలబడ్డాడు. "ఈ నేరం నా మీదకు నెట్టుదామని చూస్తున్నారా? కన్న తండ్రిని చేతులారా చంపేటంత కిరాతకుణ్ణి అనుకున్నారా నేను? ఆయన చావు కొన్ని విషయాల్లో నాకు సౌకర్యం కలిగించిన మాట వాస్తవమే కానీ నాకంటే ఎక్కువ సౌకర్యం పొందిన వాళ్ళు ఉన్నారన్న విషయం తెలుసుకోండి మీరు." అన్నాడు.

"నిజంగానా? ఎవరికి ఎక్కువ సౌకర్యం కలిగింది? చెప్పండి." అడిగాడు యుగంధర్ నెమ్మదిగా.

"సునీతకి, కాంతారావుకి, సూర్య -" రవి నాలిక కొరుక్కుని చెప్పడం ఆపాడు.

"అట్లాగా! సునీతకు ఏం లాభం చేకూరింది?" అడిగాడు యుగంధర్.

"మీకు తెలియదేమో సునీతా, ఆ కాంతారావుల మధ్య ప్రణయం బాగా ముదిరింది. వాళ్ళు నాకు తెలియదనుకుంటున్నారు. నేను కనిపెడుతూనే ఉన్నాను. నాకెందుకులే అని ఊరుకున్నాను. నాన్న పోవడం వల్ల వాళ్ళిద్దరూ హాయిగా పెళ్ళి చేసుకునేందుకు అవకాశం కలిగింది" అన్నాడు రవి.

"నిజమే మీరన్నట్లు వాళ్ళకి మీ నాన్న పోవడం సౌకర్యాన్నిచ్చింది. మరి సూర్య - అని చెప్పకుండానే మానేశారే అతనెవరు? అతనికేం లాభం."

"ఏమీలేదు. నోరు జారి అన్నాను."

"అంటే అటువంటి మనిషి లేడనా? అతనికేం లాభం లేదనా?"

"నోరు జారి అన్నాను అసిస్టెంటు మేనేజరు సంగతి. అతనికేమీ లాభం లేదు."

"సరేలెండి. ఇక మీరు వెళ్ళవచ్చు." అన్నాడు యుగంధర్.

రవి వెళ్ళబోతుండగా "ఒకసారి సునీతగారిని రమ్మని చెప్పండి" అన్నాడు ఇన్స్పెక్టరు.

సునీత గదిలోకి రాగానే "రండమ్మా, రండి ఇలా కూర్చోండి" అన్నాడు ఇన్స్పెక్టరు.

సునీత కళ్ళు ఎర్రగా ఉన్నాయి. కళ్ళల్లో నీళ్ళు నిండుతూ ఉంటే పమిట కొంగుతో తుడుచుకుంటూ కుర్చీలో కూర్చుంది.

"మీ మామయ్యని మీరు ఆఖరుసారి ఎప్పుడు చూశారు?" అడిగాడు ఇన్స్పెక్టర్.

"నిన్న రాత్రి దాదాపు పదిగంటలప్పుడు మామయ్య గదిలోకి వెళ్ళాను. నిద్రపోతున్నాడు."

"ఆయన నిద్రపోతున్నారని మీకెలా తెలుసు?"

"అంటే ఓహో అప్పటికే పోయాడేమోననా? లేదు. పక్కమీద ఒకసారి ఇటునుంచి అటు వత్తిగిలి పడుకున్నాడు."

"మీరు రాత్రి పదిగంటలకు మీ మామయ్య గదిలో ఎందుకు వెళ్ళారు?"

"రోజూ రాత్రి నేను నిద్రపోయే ముందు మామయ్య గదిలోకి వెళ్ళి, ఒక ఔన్సు బ్రాందీలో పదిచుక్కలు హర్టిసాల్ అనే మందువేసి మామయ్యకు ఇస్తాను. నిద్రరావడానికి, గుండెనొప్పి రాకుండా ఉండడానికి ఆ మందు రోజూ నిద్రపోయే ముందు ఇవ్వమని డాక్టరు చెప్పారు. మందు ఇవ్వడానికి వెళ్ళాను" అన్నది సునీత.

"మందు ఇచ్చారా?"

"లేదు. మామయ్య నిద్రపోతున్నాడు. లేపడమెందుకని బ్రాందీలో మందు కలిపి, నిద్రలేచినప్పుడు తాగుతాడని గ్లాసు మంచం పక్కన ఉన్న బల్లమీద పెట్టాను."

"మందుపోసి గ్లాసు బల్లమీద పెట్టడం మామూలుగా చేస్తుంటారా లేక నిన్న రాత్రి మాత్రమే అలా చేశారా?"

"మామయ్య మెలుకువగా ఉంటే మందు ఇస్తాను. గ్లాసులో ఒక అర ఔన్స్ బ్రాందీ పోసి పక్కన పెడతాను. ఓ రాత్రివేళ నిద్ర మెలుకువ వచ్చి, మళ్ళీ నిద్రపట్టకపోతే బ్రాందీ ఇవ్వమని డాక్టరు చెప్పారు."

"మందు సీసా ఎప్పుడూ మంచం పక్కన ఉన్న బల్లమీదే ఉంటుందా?"

"అవును."

"సునీతగారూ. నిన్న రాత్రి పొరబాటున మీరు సీసాలోని మందంతా బ్రాందీలో పోయడం జరిగిందేమో?"

సునీత "లేదు" అంది ముక్త సరిగా.

"అటువంటి పొరపాటు జరగలేదని మీరు నిశ్చయంగా ఎలా చెప్పగలరు?" అడిగాడు స్వరాజ్యరావు.

"ఆ మందు విషమనీ, ఎక్కువ చుక్కలు వేస్తే ప్రమాదమనీ డాక్టర్లు చాలాసార్లు చెప్పారు. అందువల్ల మందు వేసేటప్పుడు నేను చాలా జాగ్రత్తగా ఉంటాను."

"సీసాలోని హర్టిసాల్ అంతా తాగడం వల్ల మీ మామయ్య మరణించారు. పొరపాటున ఎక్కువ మందు వేశారేమో బాగా జ్ఞాపకం చేసుకోండి" అన్నాడు ఇన్‌స్పెక్టరు.

సునీత ఒక క్షణం ఆగి "నేను ఏమీ పొరపాటు చెయ్యలేదు" అంది.

"అయితే బ్రాందీ గ్లాసులో అంతమందు ఎట్లాపడ్డది?"

"ఏమో! నాకు తెలియదు. మామయ్యే వేసుకున్నారేమో?"

"మీ మామయ్య వేసుకోలేదని నిశ్చయంగా చెప్పగలను" అన్నాడు స్వరాజ్యరావు.

సునీత జవాబు చెప్పలేదు.

"నిన్నరాత్రి మీ మామయ్య గదిలో చప్పుడేమైనా వినిపించిందా?"

"లేదు."

"మీరు నాకు చెప్పవలసిన విషయాలు ఇంకేమైనా ఉన్నాయా?"

"లేవు."

ఇన్‌స్పెక్టర్ యుగంధర్ని చూశాడు.

"సునీతగారూ మీరు అవివాహితులనుకుంటాను" అన్నాడు యుగంధర్.

"అవును."

"మీరూ, రవిగారూ వివాహం చేసుకున్నట్టు మీ మామయ్యగారితో చెప్పారుట. ఆయన ముందు మీరిద్దరూ భార్యాభర్తలలాగా నటించేవారుట. ఎందుకో చెబుతారా?"

"మీ కెవరు చెప్పారు?"

యుగంధర్ జవాబు చెప్పలేదు.

"మామయ్య ఒకటి రెండు నెలలకన్నా బతకడని మద్రాసులో డాక్టర్ చెప్పాడు. అందుకే ఆయన ఆఖరి రోజులు సంతోషంగా, మనశ్శాంతి పోకుండా గడవాలని ఆయన తృప్తిపరిచేందుకు అలా అబద్ధం చెప్పాను."

యుగంధర్ తలవూపి "సరే! బాగానే ఉంది. నిన్న డాక్టర్ సుబ్రహ్మణ్యంగారు రవితో మీ మామయ్య ఆరోగ్యం కోలుకుంటున్నారనీ, ఇంకో నాలుగైదేళ్ళు బతకవచ్చనీ చెప్పారుట. అప్పుడు మీరు కూడా అక్కడ ఉన్నారుట కదూ! మరి ఏం చేద్దామనుకున్నారు?" అడిగాడు.

సునీత ఒక నిముషం మాట్లాడలేదు. తరవాత ఒక నిట్టూర్పు విడిచి "మామయ్యకి నిజం చెప్పేద్దామనుకున్నాను" అంది.

"చెప్పారా?"

"లేదు."

"ఎందువల్ల చెప్పలేదు? నిన్న పొద్దున్నుంచీ రాత్రిదాకా మీ మామయ్యతో చెప్పడానికి అవకాశమే దొరకలేదా?" అడిగాడు యుగంధర్.

"అదికాదు. ఎలా చెప్పాలో తెలియక తికమకపడ్డాను. రాత్రి మందు ఇవ్వడానికి వెళ్ళినప్పుడు చెబుదామనుకున్నాను. మామయ్య మేలుకుని ఉంటే చెప్పేదాన్ని."

"మీ మామయ్య పోవడంవల్ల ఇప్పుడు మీకా చిక్కులేకుండా పోయింది కదూ!?" రెట్టించాడు యుగంధర్.

సునీత యుగంధర్ని చురచురా చుసింది. "మామయ్య మనస్సు కష్టపెట్టకుండా ఉండేందుకే నేను ఆయనతో అబద్ధం చెప్పాను. కానీ నా స్వలాభానికి కాదు. కనుక మామయ్యని చంపవలసిన అవసరం నాకు లేదు. తప్పనిసరి అయినప్పుడు కొంచెం ఇబ్బందిగా ఉన్నా నిజం చెప్పేదాన్ని. అట్లా చెప్పడంవల్ల నాకు కలిగే నష్టమేమీలేదు. మామయ్యే కష్టపడతాడు" అని సునీత లేచి నిలబడి "ఇంకా ఏమైనా ప్రశ్నలు అడగాలా?" అన్నది. యుగంధర్ లేదని తలతిప్పాడు.

తరువాత కాంతరావుని పిలిచారు. క్రితం రోజు పొద్దున్న శివరామకృష్ణయ్యగార్ని ఆఖరుసారి కలుసుకున్నాననీ, తర్వాత ఆ ఇంటివేపు తను వెళ్ళనేలేదనీ చెప్పాడు అతను. నౌకర్లని పిలిచి అడిగారు కానీ వాళ్ళు కొత్త విషయాలేవీ చెప్పలేదు.

"ఇక మనం వెళ్ళి శివరామకృష్ణయ్యగారి గది చూద్దాం" అన్నాడు స్వరాజ్యరావు. సబ్ఇన్స్పెక్టరు రాఘవయ్య స్వరాజ్యరావునీ, యుగంధర్నీ, రాజునీ మేడమీద ఉన్న శివరామకృష్ణయ్యగారి గదిలోకి తీసుకువెళ్ళాడు.

అది చాలా విశాలమైన గది. గది మధ్య ఒక పెద్ద మంచం ఉంది. మంచం మీద మెత్తని బూరుగుదూది పరుపూ, దానిమీద తెల్లని దుప్పటీ, తలవైపు మూడు దిళ్ళూ, కాళ్ళవేపున రెండు దిళ్ళూ ఉన్నాయి. నేల బల్ల ఒకటి మంచం పక్కనే ఉంది. మంచానికి కొంచెం దూరంలో తలవైపున ఒక కిటికీ ఉంది. ఆ కిటికీ ఇనప ఊచలున్నాయి. కిటికీ పక్కగా ఒక బీరువా, బల్లా కుర్చీ ఉన్నాయి. కుర్చీ పక్కన పడక కుర్చీ ఉంది.

"శవం తల ఇటు కిటికీవైపు ఉంది. ఈ బల్లమీద మందుసీసా, గాజుగ్లాసూ ఉన్నాయి. ఆ రెండూ నేను తీసుకువెళ్ళాను. గది తాళం వేయించాను. నేను వచ్చి రాసినపుడు ఈ గది ఎట్లా ఉందో ఇప్పుడూ అట్లాగే ఉంది. ఏమీ కదల్చలేదు" అన్నాడు సబ్ ఇన్స్పెక్టరు రాఘవయ్య.

స్వరాజ్యరావు తల ఊపి, గదంతా పరీక్షగా చూస్తున్నాడు. యుగంధర్ దృష్టి తలవేపు ఉన్న దిళ్ళమీద పడ్డది. అని ఓ వేపు కొంచెం కదల్చబడ్డట్లున్నాయి దిళ్ళు పైకెత్తి చూశాడు. దిళ్ళకింద ఒక మనీపర్సు, ఒక చిన్న పాకెట్ నోట్‌బుక్కూ ఉన్నాయి. యుగంధర్ పర్సు తెరిచాడు. అందులో నాలుగు వందల రూపాయల నోట్లున్నాయి. కొన్ని చిల్లర నోట్లు కూడా ఉన్నాయి. మొత్తం నాలుగువందల యాభై మూడు రూపాయల ఆరు అణాలు ఉంది. పాకెట్ బుక్ తెరిచాడు. శివరామకృష్ణయ్యగారు జమా ఖర్చులు వ్రాసుకునే పద్దు పుస్తకమది. కిందటి రోజు నిలవ ఎనిమిది వందల యాభైమూడు రూపాయల ఆరణాలు అని అందులో వ్రాసి ఉంది. యుగంధర్ ఆలోచిస్తూ పర్సూ, పాకెట్ పుస్తకమూ మళ్ళీ దిండుకింద పెట్టేశాడు.

అంతలో రాజు యుగంధర్ దగ్గరికి వచ్చి "సార్ తలుపు వెనక కనిపించింది" అంటూ ఓ జేబురుమాలు ఇచ్చాడు. అది ఖద్దరు జేబురుమాల. అంతకు మించి మరే విశేషమూ ఆ గదిలో కనిపించలేదు.

"ఆ రుమాలు ఎవరిదైనా అయివుండవచ్చు. ఎప్పుడైనా ఇక్కడ పడివుండవచ్చు. విషం ఇచ్చి హత్య చేయబడిన కేసులలో ఉండే చిక్కే ఇది. హత్య చేసిన మనిషి హతుడు మరణించినప్పుడు సమీపంలో ఎక్కడా ఉండవలసిన అవసరం లేదు" అన్నాడు స్వరాజ్యరావు చికాకుతో.

"నిన్న రాత్రి పదిన్నర దాటిన తర్వాత ఇక్కడ ఓ గంటసేపు వాన కురిసింది" అన్నాడు సబ్‌ఇన్‌స్పెక్టరు.

"అయితే?" అన్నాడు స్వరాజ్యరావు విసుగ్గా.

"కింద పెరటిగుమ్మం దగ్గిర కొన్ని అడుగుజాడలు కనిపించాయి. అటువేపు ఎవరినీ రానీయవద్దనీ, అడుగుజాడలు చెరిగిపోకుండా జాగ్రత్తగా చూడమనీ ఓ కానిస్టేబుల్‌ని అక్కడ కావిలా ఉంచాను" అన్నాడు సబ్‌ఇన్‌స్పెక్టరు.

స్వరాజ్యరావు రాఘవయ్య వేపు తిరిగి "వాటి ప్రాముఖ్యమేమిటో నాకు తెలియటంలేదు" అన్నాడు.

"నౌకర్లని అడిగితే నిన్నరాత్రి తొమ్మిది గంటలకు పెరటి గుమ్మం తలుపు లోపల గడియపెట్టామనీ, తెల్లారిన తర్వాతగానీ తెరవలేదనీ చెప్పరు" అన్నాడు సబ్ ఇన్‌స్పెక్టరు.

"రాఘవయ్య చెబుతున్న విషయమేమిటో నేను గ్రహించాను. వెళ్ళి చూద్దాం రండి" అన్నాడు యుగంధర్ స్వరాజ్యరావుతో. రాఘవయ్య యుగంధర్ని కృతజ్ఞతతో చూశాడు.

మేడ మెట్లు దిగి నలుగురూ పెరటి గుమ్మం దగ్గరికి వెళ్ళారు. ముందు సబ్ ఇన్‌స్పెక్టరు దారి తీశాడు.

గుమ్మం దగ్గిర చూపిస్తూ "ఇక్కడ కొన్ని అడుగుజాడలు ఉన్నాయి చూడండి" అన్నాడు రాఘవయ్య.

యుగంధరూ, స్వరాజ్యరావూ ఒంగి ఆ జాడలను పరీక్షగా చూశారు. అవి ఆడవాళ్ళ చెప్పుల గుర్తులు. ఒక జత అడుగుజాడలు ఇంట్లోకి వచ్చినట్లు కనిపిస్తున్నాయి. ఇంకో జత బయటికి వెళ్ళినట్లు కనిపిస్తున్నాయి.

కొంచెం పక్కగా బూట్సుల గుర్తులు కనబడ్డాయి. అవి మొగవాళ్ళ బూట్సు జాడలు. ఆ గుర్తులను బట్టి ఆ మనిషి ఇంట్లోకి వచ్చినట్లు తెలుస్తోంది.

రాఘవయ్యని చూసి యుగంధర్ తల తిప్పాడు.

రాఘవయ్య ఉత్సాహంతో "బైట కూడా అడుగు జాడలున్నాయి. చూపిస్తాను రండి" అన్నాడు.

అందరూ బయటికి వచ్చి సిమెంటు మెట్లమీద నిలుచున్నారు. బురదగా ఉన్న నేలమీద చాల అడుగుజాడలు కనిపించాయి. యుగంధర్ వాటిని జాగ్రత్తగా పరీక్షించాడు.

"వీటిలో ఒక ఆడమనిషి చెప్పుల గుర్తులూ, మొగవాడి బూట్సుల గుర్తులూ ఉన్నాయి. అవిగాక ఇంకా కొన్ని అడుగుజాడలు కూడా ఉన్నాయి. చూడండి" అంటూ యుగంధర్ జేబులోంచి కొలత టేపు తీసి వాటిని కొలవడం ప్రారంభించాడు.

"ముగ్గురూ పురుషుల అడుగుజాడలూ, ఒక స్త్రీ అడుగుజాడలు కనిపిస్తున్నాయి. రాజూ ఓ కాగితం తీసుకుని వీటి స్కెచెస్ వెయ్యి. చాలా చిత్రంగా ఉంది."

"ఏం యుగంధర్ వీటికేమైనా ప్రాముఖ్యం ఉందంటారా?" అడిగాడు స్వరాజ్యరావు.

"ఉండవచ్చు. దీన్నిబట్టి నిన్న రాత్రి పదిన్నర దాటిన తర్వాత ఈ ఇంటికి చాలామంది వచ్చినట్లు తెలుస్తోంది. ఎందుకయినా మంచిది, ఈ జాడలన్నిటికీ ఫోటోలు తీయించండి. వీటినిబట్టి నిన్న రాత్రి పదిన్నర తరువాత ఈ ఇంట్లోకి ఒక పురుషుడూ, ఒక స్త్రీ వెళ్ళినట్లు స్పష్టమవుతోంది. మిగతా ఇద్దరు పురుషుల అడుగుజాడలూ మెట్ల దగ్గర ఆగిపోయాయి. వాళ్ళు మెట్లదగ్గరే ఆగిపోయి ఉండవచ్చు. లేదా ఇక్కడ చెప్పులు వదిలి లోపలికి వెళ్ళివుండవచ్చు" అన్నాడు యుగంధర్.

"ఆడవాళ్ళ జాడలు సునీతవే అయివుంటాయి. ఈ ఇంట్లో ఉన్న స్త్రీ ఆమె ఒకతేగా! రాత్రి పదిగంటలకు తన గదిలోకి వెళ్ళి నిద్రపోయానని మనకు అబద్ధం చెప్పింది" అన్నాడు స్వరాజ్యరావు.

యుగంధర్ నవ్వుతూ "ఇవి సునీత అడుగుజాడలు కావు. సరిగా చూడండి. ఇంట్లోకి వస్తున్న జాడలూ, వెళుతున్న జాడలూ ఉన్నాయి. ఆ స్త్రీ బురదలోంచి నడిచి వచ్చినట్లు జాడలు స్పష్టంగా చూపిస్తున్నాయి. అంటే ఆ స్త్రీ వాన కురుస్తున్నప్పుడో, ఆగిపోయినాకో ఇంట్లోకి వచ్చి తిరిగి వెళ్ళిందన్నమాట. ఆ స్త్రీ సునీత కావడానికి వీలులేదు. సునీత అయివుంటే ఇంట్లోనుంచి బయటికి వెళ్ళిన జాడలు ఉండవు. బయటినుంచి ఇంట్లోకి వచ్చిన బురదజాడలే ఉంటాయి" అన్నాడు యుగంధర్.

స్వరాజ్యరావు అర్థం కానట్లు చూశాడు.

"ఇదేమంత కష్టమైన విషయం కాదు. ఇన్‌స్పెక్టర్ సునీత ఇంట్లోంచి బయటికి వెళ్ళేటప్పుడు ఆమె కాళ్ళజోడుకి బురద ఉండదు. బయటనుంచి లోపలకు వచ్చేటప్పుడు మాత్రమే జోళ్ళకు బురద ఉంటుంది. కనుక ఆ స్త్రీ సునీత కాదు. గుమ్మం దగ్గిర ఉన్న పురుషుడి అడుగుజాడలు లోపలకు వస్తున్నట్లున్నాయే కానీ, బయటకు వెళుతున్నట్లు లేవు. కనుక ఆ పురుషుడు ఇంట్లో ఉండే మనిషేనని నిర్ణయించవచ్చు" అన్నాడు యుగంధర్.

"అవును. అలాగే ఇక్కడ మెట్లమీద ఆగిపోయిన రెండు జతల అడుగుజాడలు ఆ వ్యక్తులు వెనక్కి తిరిగి వెళుతున్నప్పుడు పడ్డవే. కనుక ఆ ఇద్దరూ ఇంట్లోవాళ్ళు కారనీ, బయటనుంచి వచ్చిన వాళ్ళనీ నిర్ణయించవచ్చు" అన్నాడు రాజు.

"నిజమే కానీ అర్ధరాత్రి పదిన్నర దాటిన తరువాత ఈ ఇంటికి ఇంతమంది పరాయివాళ్ళు - ఇద్దరు మొగవాళ్ళు. ఒక ఆడది ఎందుకు వచ్చారు? వాళ్ళెవరై ఉంటారు?" అన్నాడు స్వరాజ్యరావు.

"అదే మనం తెలుసుకోవలసిన విషయం" అన్నాడు యుగంధర్.

అందరూ మళ్ళీ ఇంటి లోపలికి వెళ్ళారు. రాత్రి వాన వచ్చాక ఎవరయినా పెరటి గుమ్మం తెరిచి బయిటికి వెళ్ళారేమో ఇంట్లో అందర్నీ అడిగి కనుక్కోమని సబ్‌ఇన్‌స్పెక్టర్‌తో చెప్పారు. అంతలో కోడూరినుంచి పోస్టుమార్టం రిపోర్టు తీసుకుని ఓ కానిస్టేబులు వచ్చాడు. ఆ కాయితం తీసుకుని యుగంధరూ, స్వరాజ్యరావూ తమకు ఏర్పాటు చేయబడ్డ గదిలోకి వెళ్ళారు. వెడుతూ యుగంధర్‌రాజు చెవిలో ఏదో చెప్పాడు. రాజు తల ఊపి మేడమెట్లు ఎక్కాడు.

## 6

ఇన్‌స్పెక్టరు స్వరాజ్యరావు శవ పరీక్ష తాలూకు నివేదిక చదివి, కనుబొమలు ముడిచి "విచిత్రంగా ఉంది యుగంధర్" అంటూ ఆ కాగితాన్ని యుగంధర్‌కి అందించాడు.

శివరామకృష్ణయ్య మరణానికి కారణం హర్టిసాల్‌లో ఉన్న 'బార్బటోన్' అనే విషం యాభై గ్రెయిన్లకన్నా ఎక్కువ ఆయన శరీరంలోకి వెళితే చాలు ప్రాణం పోతుంది. కానీ ఇన్‌స్పెక్టరుకు ఆశ్చర్యం కలిగించిందేమంటే శివరామకృష్ణయ్య మంచం పక్కన బల్లమీద నిండుగా ఉన్న హర్టిసాల్ సీసాలో మందంతా ఏమయిందన్న విషయం. మర్నాటి పొద్దున్నకి ఆ మందు ఎట్లా మాయమయింది? హతుడి శరీరంలో యాభై గ్రెయిన్ల విషమే ఉందని తేలింది. కనుక ఆ మందంతా శివరామకృష్ణయ్య తాగిన బ్రాందీలో కలవలేదని స్పష్టమవుతోంది. మరి మిగతా మందంతా ఏమైంది?

"స్వరాజ్యరావూ శివరామకృష్ణయ్య సీసాలో ఉన్న హర్టిసాల్ అంతా తెలియకుండా తాగి ఉండడం అసంభవమని నాకు ముందే తెలుసు. ఎంత బ్రాందీలో కలిపినా విపరీతమైన చేదు వస్తుంది. కనుక హతుడు తాగిన బ్రాందీలో సీసాలో ఉన్న మందంతా కలియలేదని నేను అప్పుడే అనుకున్నాను" అన్నాడు యుగంధర్.

"అయితే, ఆ మందు ఏమైనట్లు" అడిగాడు స్వరాజ్యరావు.

"నేను ఆ గదంతా పరీక్షగా చూశాను. గదిలో ఎక్కడా మందు ఒలకలేదు."

"అయితే కొంత మందు బయట ఎక్కడైనా పారబోసి ఉండవచ్చు" అన్నాడు స్వరాజ్యరావు.

"కానీ, బయట పారపోయడానికి ఏం అవసరం ఉంది? అవసరం లేనిదే మందు బయట పారబోయబడిందనుకోవడంలో అర్థం లేదు. హత్యచేయడానికి వచ్చిన మనిషి బ్రాందీలో మందు పోసి త్వరగా వెళ్ళిపోక, కొంత బయట పారపోసి, ఖాళీసీసా బల్లమీద ఎందుకు పెట్టాడు? మన దర్యాప్తు ఇంకా కొంతసాగి, ఇంకా ఇన్ని వివరాలు తెలిస్తేనేగానీ ఇందులో అంతరార్థం బోధపడదు" అన్నాడు యుగంధర్.

"అన్నట్లు సీసామీది వేలిముద్దరల ఫోటో కూడా వచ్చింది" అంటూ స్వరాజ్యరావు ఓ ఫోటో యుగంధర్‌కిచ్చాడు.

యుగంధర్ ఆ ఫోటోని పరీక్షిస్తుండగా రాజు గదిలోకి వచ్చాడు. యుగంధర్ ప్రశ్నార్థకంగా రాజుని చూశాడు.

రాజు ఒకసారి తల ఊపి "పెరటి ద్వారం లోపల కనిపించిన బూట్సు జాడలు రవివి. అతని గదిలోకి వెళ్ళి చూశాను. బురద ఎండిపోయి ఉంది అతని బూట్సులకు కొలత కూడా కొలిచి చూశాను. జాడల కొలతకి బూట్సులు సరిగా సరిపోయాయి" అన్నాడు.

"మరి మనకు కనిపించిన ఆడవాళ్ళ చెప్పుల జాడల విషయం ఏమైనా తెలిసిందా?" అడిగాడు స్వరాజ్యరావు.

"కొలతనిబట్టి చూస్తే అని సునీత చెప్పుల జాడలయి ఉండవచ్చు. ఆమె గదీ చూశాను, బురద ఉన్న చెప్పులు కనిపించలేదు. దాసీదాన్ని కలుసుకున్నాను. నిన్న సాయంకాలం అయిదుగంటలప్పుడు ఇల్లు ఊడ్చిందిట. శివరామకృష్ణయ్యగారి గదికూడ ఊడ్చిందిట కాని, జేబురుమాలేదీ కనిపించలేదుట" అన్నాడు రాజు.

యుగంధర్ అర్థమైనట్లు తల ఊపాడు.

"ఇంకొక విషయంసార్. మేడపైన మెట్లకు పక్కన ఉన్న వసారాలో కాల్చి నలిపివేసిన సిగరెట్ పీకలు ఆరు కనిపించాయి. ఇవిగో వీటినిబట్టి వసారాలో ఎవరో చాలాసేపు కాచుకున్నారని తెలుస్తోంది" అన్నాడు రాజు జాగ్రత్తగా ఓ కాగితం పొట్లం విప్పి సిగరెట్ పీకలు చూపిస్తూ.

"అంటే నిన్న సాయంకాలం దాసీమనిషి ఇల్లు ఊడ్చిన తరువాత ఆ మనిషి మేడమీద వసారాలో నిలబడి ఉండాలి, ఈ బ్రాండ్ సిగరెట్లు ఈ ఇంట్లో ఎవరు కాలుస్తారో తెలుసుకున్నావా?"

"ఇవి ప్లేయర్సు నేవికట్ బ్రాండ్ రవి కాల్చేవి గోల్డుటిప్డ్ స్టేట్ ఎక్స్‌ప్రెస్ సిగరెట్లు. కనుక ఇవి అతను కాల్చి పారేసినవి కావు" అన్నాడు రాజు.

ఇంతలో అక్కడికి సబ్ ఇన్స్పెక్టరు రాఘవయ్య వచ్చాడు. "కనుక్కున్నాను సార్? వాన రాకమునుపే ముందు వాకిలీ, పెరటి వాకిలీ లోపల గడియ పెట్టానని నౌఖరు చెప్పాడు. తెల్లవారే వరకూ తనే వాకిలో తెరవలేదన్నాడు. తెల్లారి తను పెరటి వాకిలి తెరవడానికి వెళ్ళినపుడు అది లోపల గడియపెట్టి ఉందన్నాడు. సునీతగారిని అడిగాను తను వాన రాకపూర్వమే రాత్రి పదిగంటలకు తన గదిలోకి వెళ్ళి పడుకుని నిద్రపోయాననీ, తెల్లవారేవరకూ లేవలేదనీ చెప్పింది. రవికూడా అదే మాట అన్నాడు. వంటవాడు, దాసీది కూడా రాత్రి పెరటి వాకిలి తెరవలేదని చెప్పారు" అన్నాడు రాఘవయ్య.

"గుడ్, రాఘవయ్యా! మరో చిన్న విషయం తేలాలి. హర్టిసాల్ సీసామీద ఉన్న వేలిముద్రలు ఎవరివో తెలుసుకోవాలి. కనుక ఎవరికీ అనుమానం కలగకుండా ఈ ఇంట్లో అందరి వేలిముద్రలూ సంపాదించు" అన్నాడు స్వరాజ్యరావు.

అంతలో హాల్లో ఎవరో గట్టిగా మాట్లాడడం వినిపించింది. సబ్ ఇన్స్పెక్టరు వెళ్ళి అరనిముషంలో తిరిగి వచ్చాడు. "మునసబుగారు వచ్చారు. శివరామకృష్ణయ్య గారి వీలునామా తీసుకువచ్చారు" అని చెప్పాడు.

అందరూ హాల్లోకి వెళ్ళారు. రవి చాలా కోపంతో "చింపి చదవండి" మా తండ్రిగారి వీలునామా చదివేటందుకు ఊళ్ళోవాళ్ళంతా ఎందుకు? చదవండి " అని అరుస్తున్నాడు.

"కోపం తెచ్చుకోక బాబూ! వీలునామా మీద సాక్షి సంతకాలు పెట్టినవాళ్ళం ఇద్దరం - కాంతారావూ, నేనూ అతనూ ఉంటే మంచిది. అదీగాక, ఇంకో ప్రతి శివరామకృష్ణయ్యగారు ఎక్కడో దాచిపెట్టారు. అదెక్కడ దాచిందీ కాంతారావుగారికి తెలుసునేమో అడిగి అదీ తెప్పిద్దాం" అన్నాడు మునసబు ఓపిగ్గా.

"అది చాలా అనవసరంగా నాకు తోస్తోంది. కవరు చింపి వెంటనే చదవండి" అన్నాడు రవి మరింత కోపంగా.

"అంత అసహనం ఉండకూడదు నాయనా! అందుకే కాబోలు మీ తండ్రిగారు ఆస్తి నీకు వ్రాయలేదు" అన్నాడు మునసబు నవ్వుతూ.

"ఏమిటి? ఆస్తి నాకు రాయలేదా? అబద్ధం" అన్నాడు రవి ఖంగారుగా.

"అబద్ధమో, నిజమో తెలుస్తుందిగా. ఇంకో పదినిమిషాలు ఓపిక పట్టు" అన్నాడు మునసబు, ఇన్స్పెక్టర్ని చూసి నవ్వుతూ "నమస్కారమండీ, ఇన్స్పెక్టరుగారూ!" అన్నాడు.

అంతలో కాంతారావు కూడా అక్కడికి వచ్చాడు. ఇంకో ద్వారంలోంచి సునీత వచ్చింది. పొద్దున్న నుంచీ ఆ చుట్టుపక్కలే తారట్లాడుతున్న సూర్యనారాయణ వచ్చి తలుపు దగ్గిర నిలబడ్డాడు. సబ్ఇన్స్పెక్టరుతో కాంతారావు శివరామకృష్ణయ్య గదిలోకి వెళ్ళి, బీరువా తెరిచి వీలునామా ఉన్న కవరు తీసుకువచ్చాడు.

మునసబు తను తెచ్చిన కవరు చింపి, వీలునామా పైకి చదివాడు.

"రవిని నేను చాలా గారాబంగా పెంచి చెడగొట్టాను. ఉత్త అప్రయోజకుడయ్యాడు. చెడు సహవాసాలు కూడా చేస్తున్నాడని తెలిసింది. నా ఆస్తి నా కుమారుడికి ఇచ్చిపోతే అదంతా నిముషంలో నాశనం చేసి, బికారి అవుతాడని నాకు ఆదుర్దాగా ఉంది, అంతేగాక, ఇంత ఆస్తి ఒక్కసారి చేతిలోకి వస్తే మనిషి పూర్తిగా నాశనం అవుతాడని నా భయం. అందువల్ల యావదాస్తి నా మేనకోడలు సునీతకు చెందాలని నిర్ణయించాను. నా మేనకోడలు చాలా బుద్ధిమంతురాలు. చిన్నప్పటి నుంచీ నా దగ్గరే పెరిగింది. రాత్రింబవళ్ళు నాకు శుశ్రూష చేసింది. నెలకు అయిదువందల రూపాయలు రవి ఎక్కడున్నా అతనకి ఇవ్వమని సునీతను ఆదేశిస్తున్నాను. వినోదాలకీ, విలాసాలకీ ఖర్చు చేసేందుకు చేతినిండా డబ్బులేక రవి సన్మార్గంలో పడతాడని నా ఆశ. రవి అలా సన్మార్గంలో పడిననాడు సునీత ఉదారత్వమూ. హృదయ వైశాల్యమూ ప్రదర్శించి నా ఆస్తిలో సగం భాగం నా కుమారుడికి ఇస్తుందని నాకు దృఢ విశ్వాసముంది. అతనికి ఆస్థి ఇవ్వవలసిందీ, లేనిదీ, ఎప్పుడు ఇవ్వవలసిందీ సునీత ఇష్టానికే వదులుతున్నాను. సునీత మాణిక్యంలాంటి పిల్ల. రవిని వివాహం

చేసుకున్నానని నాతో అబద్ధమాడింది. కానీ జబ్బులో ఉన్న నన్ను కష్టపెట్టకూడదనీ, సంతోషపెట్టాలనీ నా మేనకోడలు నాతో అబద్ధం చెప్పిందని నాకు తెలుసు. రవి నాతో అబద్ధం చెప్పడానికి కారణం స్వార్థం. నేను ఆస్థి ఇవ్వనేమో అన్న భయంతో నన్ను మోసగించ చూశాడు. కన్నతండ్రిని మోసగించ చూసిన కొడుకుపైన నేను కరుణ చూపవలసిన అవసరంలేదు. ఇప్పుడు నేను అతన్ని క్షమించి దయచూసి ఆస్థి ఇచ్చినా అది అతను మరింత చెడిపోవడానికే ఉపయోగిస్తుంది కనుక నా యావదాస్థి నా మేనకోడలు సునీతకు బుద్ధిపూర్వకంగా ఇస్తున్నాను.''

పెద్దిగట్ల శివరామకృష్ణయ్య

●●●

**వీలునామా చదవడం పూర్తయింది.** రవి నోటి వెంట మాట రాలేదు. నిశ్చేష్టుడైపోయాడు. సునీతకూడా ఆశ్చర్యపోయి, కళ్ళప్పగించి మునసబు చేతిలోని కాగితాన్ని చూస్తోంది. అందరూ నిశ్శబ్ధంగా నిలబడ్డారు. సూదిపడితే వినపడేటంత నిశ్శబ్ధం.

''మోసం.. ఏదో మోసం జరిగింది'' అని అరిచాడు రవి.

''మోసమేమీ లేదు. మీ తండ్రిగారు స్వహస్తంతో రాశారు, దస్తూరీ చూడండి'' అన్నాడు మునసబు.

''నువ్వే నాన్నకి నిజం చెప్పావు. చెప్పి ఆస్తంతా తస్కరించావు. మోసకత్తెవు. నిన్ను నమ్మాను. పాములాటిదానివి నువ్వూ, నీ ప్రియుడు ఆ కాంతారావూ కలిసి చేశారీ పని. నాన్నకి మాయమాటలు చెప్పి, ఈ విల్లు రాయించారు. ఆస్తి మీ పేర రాయించుకుని నాన్నని మీరే హత్యచేశారు'' వెర్రికోపంతో రవి అరవడం ప్రారంభించాడు.

యుగంధర్ రవి దగ్గరకు వెళ్ళి, భుజం మీద చెయ్యి వేశాడు. ''మిస్టర్ రవీ! అలా అరిచి ప్రయోజనం లేదు. మోసం జరిగిందని మీకు అనుమానంగా ఉంటే, న్యాయం జరిపించుకునేందుకు న్యాయస్థానాలున్నాయి'' అన్నాడు. గంభీరమైన యుగంధర్ కంఠస్వరం వినగానే రవి పిల్లిలా అయిపోయాడు. అతని వీపు చరిచి, ఆవేశపడవద్దనీ, బుద్ధిమంతుడిగా ఉండి సగం ఆస్తి సంపాదించుకోమనీ, సునీత ఆస్తి తప్పకుండా ఇస్తుందనీ చెప్పాడు యుగంధర్, కోపం దిగమింగి రవి అక్కణ్ణించి వెళ్ళిపోయాడు.

కాంతారావునీ, స్వరాజ్యరావునీ పిలుచుకుని యుగంధర్ తమకిచ్చిన గదిలోకి వెళ్ళాడు. కాంతారావుని చూసి ''మీరు శివరామకృష్ణయ్యగార్ని నిన్న ఉదయం ఆఖరుసారి కలుసుకున్నానని చెప్పారు. నిజమేనా?'' అడిగాడు యుగంధర్.

''నిజమే''

యుగంధర్ జేబులోంచి ఖద్దరు రుమాలా తీసి చూపిస్తూ ''అయితే ఈ రుమాలు ఆయన గదిలో తలుపు వెనక ఎట్లా పడివుంది? కాంతారావూ.. నిన్నరాత్రి మీరు శివరామకృష్ణయ్యగారి గదిలోకి వెళ్ళారు. అప్పుడు ఈ రుమాల పొరపాటున అక్కడ జారవిడిచారు. అవునా!'' అడిగారు యుగంధర్.

కాంతారావు ఖంగారుపడి చూశాడు. సూదుల్లాంటి యుగంధర్ చూపులు గుండెల్లో గుచ్చుకుంటున్నట్లనిపించింది.

కాంతారావు తల ఆడించి ''అవును. రాత్రి వాన కురిసి వెలిసిన తరువాత నేను శివరామకృష్ణయ్యగారి గదిలోకి వెళ్ళడం తటస్థించింది. అది ఎలా జరిగిందో చెబుతాను వినండి. శివరామకృష్ణయ్యగారి వీలునామా మీద సాక్షి సంతకం పెట్టాను. ఆస్తి కుమారుడికి కాక సునీతకు సంక్రమించేట్లు ఆయన వీలునామా వ్రాశారు. అందువల్ల సునీతకు రవిని వివాహం చేసుకోవలసిన నైతిక బాధ్యత ఉంటుందని భయపడ్డాను. శివరామకృష్ణయ్యగారికి వెంటనే నిజం చెప్పి వెయ్యమని సునీతకు చెప్పడం మంచిదనుకుని ఆమెను కలుసుకునేందుకు ప్రయత్నించాను. ఎంత ప్రయత్నించినా రోజంతా ఆమెను ఒంటిగా కలుసుకునేందుకు వీలు కాలేదు, ఆ ఆలోచనతో రాత్రి నిద్దరపట్టలేదు. వాన వెలిశాక కొంచెం సేపు నడుద్దామని బయటకు వచ్చాను. మేడమీద ఒకటి. రెండు దీపాలు వెలుగుతున్నాయి. సునీత ఇంకా నిద్రపోలేదేమో అనుకుని ఆమెను కలుసుకునేందుకు ఇటు వచ్చాను. తలుపు ఒక రెక్క తెరచి ఉంది. లోపలంతా చీకటిగా

ఉంది. ధైర్యం చేసి మేడ మెట్లెక్కి పైకి వెళ్ళాను. ఎవరో వస్తున్నట్లు పక్కనే ఉన్న శివరామకృష్ణయ్యగారి గది తలుపు తెరిచి ఉంది. గదిలోకి చటుక్కున వెళ్ళాను. తలుపు వెనక దాక్కున్నాను'' అని ఒక క్షణం ఆగాడు కాంతారావు.

''తరువాత ఏం జరిగింది'' అడిగాడు యుగంధర్.

''ఎవరో ఆయన గదిలోకి వచ్చారు. కనిపించకుండా నేను తలుపుచాటున నక్కాను. గది బాగా చీకటిగా ఉంది. ఆ వచ్చిన మనిషి ఆకారం నీడలా కనిపించింది. అతను చప్పుడు చెయ్యకుండా అడుగులో అడుగు వేసుకుంటూ తిన్నగా మంచం దగ్గరికి వెళ్ళాడు. మంచం పక్కన బ్రాందీ గ్లాసు ఉన్న బల్ల దగ్గిర ఆగి ఒంగాడు. అతనేం చేసినదీ నాకు కనిపించలేదు. తర్వాత మంచం అవతల వేపుకు వెళ్ళి దిండు కిందనుంచి ఏదో తీశాడు, వెంటనే వచ్చినట్లే నెమ్మదిగా బయటకు వెళ్ళిపోయాడు.''

''తర్వాత మీరేం చేశారు?''

''సునీతను ఎలాగూ కలుసుకోలేనని చప్పుడు చెయ్యకుండా కిందకి దిగి వెళ్ళిపోయాడు.''

''ఆ వచ్చిన మనిషి ఎవరో గుర్తుపట్టారా?''

''ఆఁ అతను రవి'' అన్నాడు కాంతారావు.

''మీరు బల్ల దగ్గరకు వెళ్ళలేదా?'' అడిగాడు ఇన్‌స్పెక్టరు.

''లేదు''

''మీ వేలిముద్దరలు ఇస్తారా?''

''నిరభ్యంతరంగా!'' అన్నాడు కాంతారావు.

కాంతారావు వేలిముద్రలు ఓ కాగితం మీద తీసుకున్నాడు స్వరాజ్యరావు. కాంతారావు బయటకు వచ్చేశాడు.

కాంతారావు వెళ్ళగానే రవిని ఆ గదిలోకి పిలిచారు. క్రితం రాత్రి అతను తన తండ్రి గదిలోకి వెళ్ళినదీ, లేనిదీ అడిగారు. రాత్రి తన గదిలోంచి కదలనేలేదని రవి గట్టిగా చెప్పాడు. కాంతారావు చెప్పిన విషయాలు నిజమేనా అని అడిగాడు. కాంతారావు చెప్పినదంతా అబద్ధమనీ, బహుశా అతనే తన తండ్రిని హత్యచేసి ఉండవచ్చుననీ అన్నాడు రవి. ఇంకేమీ అడగవలసినది లేదని చెప్పి రవిని పంపేశారు.

''రవి ఆ గదిలోకి వెళ్ళాడనేందుకు కాంతారావు మాట తప్ప వేరే సాక్ష్యమేమీ లేదు. కాంతారవు అబద్ధం చెప్పి ఉండవచ్చు'' అన్నాడు స్వరాజ్యరావు.

''కాంతారావు చెప్పింది నిజమైనా, అబద్ధమైనా రవి మాత్రం నిజం చెప్పడంలేదు. రాత్రి వాన కురిసిన తరువాత అతను బయటకు వెళ్ళాడని బురదతో ఉన్న అతని బూట్సులే సాక్ష్యం'' అన్నాడు యుగంధర్.

''కాంతారావు చెప్పిన మాటలు నిజమని నిరూపించగలిగితే రవి హంతకుడని స్పష్టంగా తేలుతుంది'' అన్నాడు స్వరాజ్యరావు.

యుగంధర్ నవ్వి ''కాదు. కాంతారావు చెప్పింది నిజమయితే రవి హత్య చేయలేదని అనుకోవచ్చు'' అన్నాడు యుగంధర్.

''అదేమిటి?''

''తరువాత చెబుతాను. ముందు ఈ వేలిముద్దరల విషయం తేల్చుకుందాం'' అని రాజు వైపు తిరిగాడు యుగంధర్. సీసా మీద కనిపించిన వేలిముద్రల ఫోటోలతో. కాంతారావు వేలిముద్రలను పోల్చి చూస్తున్న రాజు ''రెండూ ఒకరివి కావు సార్. సీసా మీది. వేలిముద్దరలు కాంతారావువి కావు'' అన్నాడు.

ఇంతలో సబ్‌ఇన్‌స్పెక్టర్ రాఘవయ్య ఒక సిగరెట్ కేసూ, చిన్న పౌడరు డబ్బా, ఓ కంచు లోటా, గాజుగ్లాసూ, ఓ చెంబూ జాగ్రత్తగా పట్టుకుని గదిలోకి వచ్చాడు.

"ఇంట్లో ఉన్న వాళ్ళందరి వేలిముద్రలూ సంపాదించాను సార్!" అని ఆ వస్తువులు బల్లమీద పెట్టాడు. పౌడరు జల్లి ఒక్కొక్క వస్తువుమీదా ఉన్న వేలిముద్రలను జాగ్రత్తగా పరిశీలించారు. సిగరెట్ కేసుమీద వేలిముద్రలు రవివి, మందు సీసామీద వేలిముద్రలు అతనివికావు. దాసీదాని వేలిముద్రలు చెంబుమీదా, నౌఖరు వేలిముద్రలు కంచు లోటామీదా ఉన్నాయి. సీసామీది వేలిముద్రలు పోలిన వేలిముద్రలు కావవి. గాజుగ్లాసు మీదవున్న వంటవాడి వేలిముద్రలు కూడా సంబంధం లేదు. పౌడరు సీసామీద ఉన్న వేలిముద్రలు సునీతవి. మందు సీసామీద ఉన్న వేలిముద్రలను పోలివున్నాయవి.

స్వరాజ్యరావు ముఖం వికసించింది. "గుడ్! ఈ కేసు చాలా క్లిష్టంగా పరిణమిస్తోందనుకున్నాను. కానీ చాలా సులభంగా తేలిపోయింది. ఆస్తి సునీతకు సంక్రమించేటట్లు శివరామకృష్ణయ్య నిన్న వీలునామా వ్రాశాడు. ఆ విషయం కాంతారావు సునీతకు చెప్పాడు. శివరామకృష్ణయ్య మరణిస్తే ఆస్తి ఆమెకు వస్తుంది. కాంతారావును వెంటనే వివాహం చేసుకోవచ్చు. హార్టిపాల్ విషం అని ఆమెకు తెలుసు. బ్రాందీలో హార్టిపాల్ చుక్కలు వేసింది తనేనని ఆమె ఒప్పుకుంటోంది. పది చుక్కలకు బదులు ఇంకో నలభై బొట్లు వేసింది. అంతే పటిష్టమైన కేసు తయారయింది" అన్నాడు.

"ఇన్‌స్పెక్టర్ మీ వాదన బాగానే ఉందిగాని ఈ కేసులో ఏదో అపసవ్యం తోస్తోంది నాకు. సునీత తన వేలి ముద్రలను ఎందుకు తుడిచివెయ్యలేదు" అన్నాడు యుగంధర్.

"సీసామీద వేలిముద్రలు పడుతాయనీ, వాటివల్ల తను పట్టుబడిపోతాననీ ఆమెకు తెలియదేమో?" అన్నాడు స్వరాజ్యరావు.

"అయితే, డాక్టరు వేలిముద్రలు ఏమయ్యాయి. వాటిని ఎవరో తుడిచివేసి ఉండాలికదా!" అన్నాడు యుగంధర్.

స్వరాజ్యరావు ఆలోచనలో పడ్డాడు.

"మరో విషయం సీసాలోని మిగతా మందు ఏమైంది?"

"ఖాళీ సీసా మాత్రం అక్కడ ఎందుకు ఉంది? ఈ సందేహాలకి సమాధానాలు ఏవి? రాజూ ఒకసారి సునీతను ఇలా రమ్మను" అన్నాడు యుగంధర్.

సునీత వచ్చింది. "ఇవాళ పొద్దున్నే నువ్వు మీ మామయ్య గదిలోకి వెళ్ళావు. ఆయన పోయారని తెలుసుకున్నావు. తరువాత ఏం చేశావు? సరిగా జ్ఞాపకం చేసుకుని చెప్పు" అడిగాడు యుగంధర్.

"మామయ్య గదిలోకి వెళ్ళాను. ఇంకా నిద్ర లేవలేదేమోనని దగ్గరకు వెళ్ళి 'మామయ్యా' అని పిలిచాను. పలకలేదు, తట్టి లేపుదామని మీద చెయ్యివేశాను. ఒళ్ళు చల్లగా ఉంది. ముక్కు దగ్గర చెయ్యిపెట్టి చూశాను. శ్వాస లేదు. రాత్రి నేను మందు ఇవ్వకపోవడంవల్ల గుండె నొప్పి వచ్చి నిద్రలోనే పోయాడేమోనని గాభరాపడ్డాను. బల్లమీద గ్లాసు చూశాను. అది ఖాళీగా ఉంది. ఆశ్చర్యపోయాను. రవినీ, నౌకర్లనీ కేకలు పెట్టాను" అన్నది సునీత.

"మందు సీసా చూశానని చెప్పావు. ముట్టుకు చూశావా?" అన్నాడు యుగంధర్.

"మూత తీసి చూశాను" అన్నది సునీత.

"సరే, ఇక నువ్వు వెళ్ళవచ్చు" అన్నాడు యుగంధర్.

●●●

సునీత హాల్లోకి వెళ్ళింది. పరధ్యానంగా అక్కడే నిలబడ్డది. కాంతారావుకోసం ఆమె కళ్ళు ఆత్రంగా వెదుకుతున్నాయి. ఆమె మనస్సంతా వికలంగా ఉంది. మేనమామ పోయాడన్న దిగులే కాక, ఇంటినిండా పోలీసులు ఉండడం, వాళ్ళు అందర్నీ ప్రశ్నించడం, ప్రతి ఒక్కర్నీ అనుమానించడం సునీతకు బాధగా ఉంది. మామయ్య ఆస్తి అంతా తనకు వ్రాసిపోవడం మరింత మనోవేదనకు కారణమైంది. సునీత పరిపరి విధాల ఆలోచిస్తూ మనిషి అయోమయంలో ఉంది.

"సునీతా!"

ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూసింది సునీత. కాంతారావు ఆమె వెనుక నిలబడి జాలిగా చూశాడు. అంతవరకు గొంతులో ఇముడ్చుకున్న దుఃఖం కాంతారావుని చూడగానే ఆపుకోలేకపోయింది. ఆమె కళ్ళల్లో నీళ్ళు నిండాయి. చెక్కిళ్ళ వెంట జల జల నీళ్ళ చుక్కలు రాలాయి.

"ఎందుకు సునీతా! ఏడ్చి ఏం లాభం? ఊరుకో.. ఊరుకోవూ" కాంతారావుకు ఎలా ఓదార్చాలో, ఏమని ఓదార్చాలో తెలియక తికమకపడ్డాడు.

"కాంతా! నిజంగా హత్య చేయబడ్డాడంటావా!" అన్నది బొంగురుపోయిన కంఠస్వరంతో.

కాంతారావు తలఊపాడు.

"ఎవరు చేసుంటారు కాంత్? ఎవరికీ ఏ హానీ చేయని మామయ్యను చంపేటంత కర్కోటకుడు ఎవరు కాంత్?" అడిగింది సునీత అతని కళ్ళల్లోకి చూస్తూ.

కాంతారావు తల వంచుకున్నాడు. "ఏమో సునీతా పోలీసుల దృష్టిలో మనమంతా అనుమానితులమే. మనకందరికీ కారణం ఉంది" అన్నాడు.

"మనమీద అనుమానమా ఎందుకు?" అడిగింది సునీత.

"ఆలోచిస్తే నీకే తెలుస్తుంది సునీతా! శివరామకృష్ణయ్యగారి చావు మనందరికీ ఎంతో కొంత లాభించలేదూ! పోలీసులు నా వేలిముద్రలు తీసుకున్నారు. నీ వేలిముద్రలు తీసుకున్నారా?"

సునీత తీసుకున్నారని చెప్పింది. "రవీ, నేనూ పెళ్ళి చేసుకోలేదని అబద్ధం చెప్పామని మామయ్యకు ఎలా తెలిసి ఉంటుంది?" అడిగింది సునీత.

కాంతారావు ఒక నిముషం సేపు ఆలోచించి "ఊహించి తెలుసుకున్నారేమో" అన్నాడు.

సునీత కాంతారావుకు జవాబు చెప్పేలోగా వెనకనుంచి "బాగా అడిగావు సునీతా! నాన్నకి మన రహస్యం ఎవరు చెప్పారు? అది తెలుసుకోవాలి" అన్నాడు రవి.

కాంతారావూ, సునీతా రవిని ఎగాదిగా చూశారు. అతని కళ్ళు చింతనిప్పుల్లా ఉన్నాయి. పెదిమలు ఒణుకుతున్నాయి. వెటకారంగా నవ్వుతూ "మిమ్మల్ని ఇప్పుడు సునీతగారనాలేమో? తమరేగా ఈ ఇంటికి ఇప్పుడూ యజమానురాలు. నేను బికారినిగా" అన్నాడు రవి.

"రవీ! ఎందుకట్లా మాట్లాడతావు?" అన్నది సునీత.

"అవును. నేనేమనేందుకూ నాకు ఈ ఇంట్లో అధికారం లేదు. నిజమే నాన్నని ఎవరు చంపారో తెలుసుకోవాలి. ఎందుకు చంపారో కనుక్కోవాలి. నాన్నకి మన రహస్యం ఎవరు చెప్పారో కనుక్కోవాలి" అంటూ రవి గబగబా అక్కణ్ణించి వెళ్ళిపోయాడు.

సునీత రవిని జాలిగా చూసింది. ఆమె పెదవులు వణుకుతున్నాయి. "కాంత్! మామయ్యని నువ్వు చంపావా?" అడిగింది సునీత మళ్ళీ.

కాంతారావు ఆశ్చర్యంతో సునీతను చూసి తల విదిలించాడు.

"కాంత్ మామయ్య ఆస్తి నాకు రాశాడని నీకు ముందే తెలుసా?"

కాంతారావు తెలుసునని తల ఆడించాడు.

"కాంత్ నిన్న రాత్రి నువ్వు మామయ్య గదిలోకి వెళ్ళినమాట నిజమేనా?" అడిగింది సునీత.

కాంతారావు తెల్లబోయి "నీకెట్లా తెలుసు?" అని అడిగాడు.

"యుగంధరూ, ఇన్స్పెక్టరూ మాట్లాడుకుంటూంటే విన్నాను. చెప్పవూ?"

"అవును వెళ్ళాను" అంటూ కాంతారావు తను యుగంధర్‌తో చెప్పిన విషయాలు సునీతకు చెప్పాడు. సునీత అతని మాటలు వింటూ కళ్ళప్పగించి చూస్తూ నిలబడ్డది.

"సునీతా! ఏం అలా చూస్తున్నావు? నా మాటలు నమ్మడంలేదా?" అడిగాడు.

"ఛ! ఎందుకు నమ్మను" అన్నది సునీత అతనివేపు చూడకుండా.

"సునీతా నీకు ఆస్తి వస్తుందని తెలిసి, శివరామకృష్ణయ్యగారు అడ్డులేకపోతే నిన్ను వెంటనే పెళ్ళి చేసుకోవచ్చని ఆశపడి నేనే మీ మామయ్యను హత్యచేసి ఉంటానని నువ్వు అనుమానపడుతున్నావా? నేను హంతకుడిగా కనబడుతున్నానా నీ కళ్ళకి. నా మొహం చూసి నిజం చెప్పు" అంటూ ఆమెను భుజాలు పట్టుకుని తల తనవేపు తిప్పుకున్నాడు.

సునీత వెక్కి వెక్కి ఏడ్వడం మొదలు పెట్టింది. "కాంత్ నిన్ను నమ్మకుండా ఎలా ఉండగలను? నిన్ను ఎలా అనుమానించగలను. నిన్ను అనుమానిస్తే నన్ను అనుమానించుకున్నట్లేకదా! కాంత్ నువ్వూ, నేనూ ఒకటే నువ్వే నా ప్రాణం" అన్నది ఏడుస్తూ అతని భుజం మీద తలవాల్చి.

●●●

"ఇందాక హాల్లోకి వెళ్ళినప్పుడు చూశాను. ప్లేయర్స్ సిగరెట్లు తాగేది ఎవరయినదీ తెలిసింది. అసిస్టెంటు మేనేజరు సూర్యనారాయణ ప్లేయర్స్ తాగుతాడు" అన్నాడు రాజు.

"గుడ్ గాడ్ అతను కూడానా? నిన్నరాత్రి అతనుకూడా ఈ ఇంటికి వచ్చాడా?" అన్నాడు స్వరాజ్యరావు.

యుగంధర్ నవ్వుతూ "ఆడవాళ్ళ చెప్పుల జాడలను బట్టి ఆలోచిస్తే ఇంకెవరో స్త్రీ కూడా నిన్నరాత్రి ఈ ఇంట్లోకి వచ్చినట్లు తెలుస్తోంది. రాజూ! సూర్యనారాయణను పిలు!" అన్నాడు యుగంధర్.

రెండు నిముషాలలో రాజు సూర్యనారాయణను వెంట పెట్టుకుని వచ్చాడు.

"రండి మీరు ఆఖరుసారి శివరామకృష్ణయ్యగారిని ఎప్పుడు చూశారు?" అడిగాడు యుగంధర్.

"నాలుగురోజులయింది" అన్నాడు సూర్యనారాయణ.

"నిన్న మీరు ఇక్కడికి రానేలేదా?"

"నిన్ననా? రాలేదే"

"నిన్న రాత్రి పదిగంటల తర్వాత వచ్చారేమో జ్ఞాపకం చేసుకు చెప్పండి" అన్నాడు యుగంధర్ సూర్యనారాయణను తీక్షణంగా చూస్తూ.

సూర్యనారాయణ బెదురు చూపులు చూస్తూ "లేడు" అన్నాడు మళ్ళీ.

"సూర్యనారాయణగారూ మీరు అబద్దం చెబుతున్నారని నాకు తెలుసు. నిన్న రాత్రి మీరు ఈ ఇంట్లోకి వచ్చినట్లు సాక్ష్యం ఉంది. నిజం చెప్పండి. ఎందుకు వచ్చారు?" అడిగాడు యుగంధర్.

"నేను వచ్చానని మీకెవరు చెప్పారు?"

"ఎవరు చెబితేనేం లెండి. మీరు వచ్చారా? లేదా? వచ్చి శివరామకృష్ణయ్యగారిని హత్యచేశారా?" చాలా కోపంగా అడిగాడు యుగంధర్.

"ఏ పాపమూ ఎరుగని నామీదకు అన్యాయంగా ఈ నేరం పెట్టకండి. నేను ఇక్కడికి వచ్చిన మాట నిజమే కానీ, ఆయన్ని నేను చంపలేదు. హత్యతో నాకెటువంటి సంబంధమూ లేదు."

"అయితే, అంత రాత్రివేళ ఇక్కడికి ఎందుకు వచ్చారు?" గదమాయిస్తూ అడిగాడు యుగంధర్.

"రవి నిన్న నాకు డబ్బు ఇస్తానన్నాడు. సాయంత్రం నుంచీ అతనికోసం కాచుకున్నాను. రాలేదు. విచారించగా అతను కోడూరు వెళ్ళాడని తెలిసింది. అతను కనపడతాడేమోనని నిన్న రాత్రి వాన వెలిశాక ఇటు వచ్చాను. పెరటి తలుపు తెరిచివుంది. తిన్నగా అతని గదిలోకి వెళ్ళాను. రవితో మాట్లాడి వెళ్ళిపోయాను" అన్నాడు సూర్యనారాయణ.

"ఓహో! అట్లాగా అయితే మెట్ల పక్కన వసారాలో శివరామకృష్ణయ్యగారి గది పక్కన ఎందుకు పది పదిహేను నిమిషాలు నిలుచున్నారు?" అడిగాడు యుగంధర్ చురచుర చూస్తూ.

"మీకెవరు చెప్పారు? రవే చెప్పి ఉండాలి. ఇంకెవరికి తెలుసు. ఔను రవే చెప్పాడు. నేను వసారాలో నిలబడిన మాట నిజమే. రవే నన్ను అక్కడ తనకోసం కాచుకునుండమన్నాడు."

"ఎందుకు?"

"నేను నెమ్మదిగా వెళ్ళి రవి గది తలుపు తట్టాను. అతను తలుపు కొంచెంగా తెరిచి నన్ను చూసి బయటికి వచ్చాడు. వసారాలోకి తీసుకువెళ్ళి అక్కడ నన్ను ఉండమనీ, ఇప్పుడే వస్తాననీ చెప్పివెళ్ళిపోయాడు. తరవాత అరగంటకు గానీ తిరిగిరాలేదు."

"మీకు డబ్బు ఇచ్చాడా?"

"ఆఁ..ఇచ్చాడు."

"ఎంత?"

సూర్యనారాయణ యుగంధర్ని అనుమానంగా చూశాడు. "రెండువందలిచ్చాడు" అన్నాడు.

"ఎందుకిచ్చాడు?"

"అప్పు."

"సూర్యనారాయణగారూ! శివరామకృష్ణయ్యగారి గదిలో మందు సీసామీద కొన్ని వేలిముద్రలు కనిపించాయి. అవి మీ వేలి ముద్రలు అయివుండవచ్చా?" అడిగాడు యుగంధర్.

"నావా? ఎంతమాత్రము కావు."

"అయితే, మీ వేలిముద్రలు తీసుకుంటాము. సీసామీద వేలిముద్రలు మీవయినదీ, కానిదీ తేలుతుంది."

"నా వేలిముద్రలు తీసుకుంటారా? ఎందుకు? ఆ సీసా మీది వేలిముద్రలు నావి కావని చెప్పానుగా!" అన్నాడు భయంతో.

"ఆ సీసా మీరు ముట్టుకోనట్లయితే మీకు భయం ఎందుకు?" అడిగాడు యుగంధర్.

సూర్యనారాయణ అభ్యంతరం చెప్పలేకపోయాడు. వేలిముద్రలు ఇవ్వక తప్పింది కాదు. అతను వెళ్ళిపోతుండగా "సూర్యనారాయణగారూ.. నిన్న మీకు రవి ఇచ్చిన డబ్బు మీ దగ్గర ఉందా?" అడిగాడు యుగంధర్.

"ఆఁ..వుంది. ఎందుకూ?" అన్నాడు సూర్యనారాయణ ఖంగారుగా.

"ఓసారి ఆ రెండు వంద రూపాయలనోట్లూ ఇలా ఇవ్వండి, చూసి ఇప్పుడే ఇస్తాను" అన్నాడు యుగంధర్. అవి వందరూపాయల నోట్లని యుగంధర్కి ఎట్లా తెలుసా అని ఆశ్చర్యపోతూ సూర్యనారాయణ రెండు నోట్లూ జేబులోంచి తీసి యుగంధర్ చేతికిచ్చాడు.

యుగంధర్ ఆ నోట్ల నెంబర్లు కాగితం మీద వ్రాసుకుని రాజుతో ఏదో చెప్పాడు.

రాజు గబగబా గదిలోంచి బయటకు వెళ్ళాడు.

"మిష్టర్ యుగంధర్ సూర్యనారాయణ వేలిముద్రలు ఎందుకు తీసుకోమన్నారు? మందు సీసామీద వేలిముద్రలు సునీతవని నిర్ధారణ అయిందిగా!" అన్నాడు స్వరాజ్యరావు.

"రవితో సూర్యనారాయణకు ఇంతకు ముందునుంచీ పరిచయం ఉందని సూర్యనారాయణ మాటలను బట్టి తెలుస్తోంది. ఏకవచనం ప్రయోగించాడు. అంతేకాక రాత్రి పదిగంటల తర్వాత సూర్యనారాయణ రవి గది తలుపు తట్టడం, రవి అరగంట తర్వాత అతనికి రెండు వందలు ఇవ్వడం ఎలా ఉంది? సజావుగా ఉందా? రవిలాంటి వాడు ఎవరికయినా అనవసరంగా డబ్బు ఇస్తాడా?"

"అయితే ఎందుకిచ్చాడని మీ అభిప్రాయం?" అడిగాడు స్వరాజ్యరావు.

"సూర్యనారాయణ రవిని బ్లాక్ మెయిల్ చేస్తూ ఉండివుండాలి. ఏదో రహస్యం బయటపెడతానని రవిని బెదిరిస్తూ ఉండి ఉండాలి. అందుకే రవి సూర్యనారాయణకి డబ్బు ఇస్తూ ఉండి ఉంటాడు. సూర్యనారాయణ ఇదే మొదటిసారి బ్లాక్ మెయిల్ ప్రారంభించాడా లేక ఇంతకు ముందు ఎవరినైనా బ్లాక్ మెయిల్ చేసి పట్టుబడి శిక్ష అనుభవించాడా అనే విషయం తెలుసుకునేందుకు వేలిముద్రలు తీసుకోమన్నాను. సూర్యనారాయణ భయపడ్డాడు. అంటే పోలీసు రికార్డులలో అతని వేలిముద్రలు ఉండివుంటాయన్నమాట. సూర్యనారాయణ వేలిముద్రలు హెడ్ క్వార్టర్స్‌కి పంపి కనుక్కోండి" అన్నాడు యుగంధర్.

అంతలో రాజు వచ్చి "శివరామకృష్ణయ్యగారి పర్సులో ఉన్న నోట్ల నెంబర్లకి వరుస నెంబర్లే సూర్యనారాయణ దగ్గర ఉన్న నోట్ల నెంబర్లు" అని చెప్పాడు.

సూర్యనారాయణను గురించిన వివరాలేమైనా రికార్డులలో ఉన్నాయేమో హెడ్ క్వార్టర్సుకు ఫోను చేసి కనుక్కోమని సబ్ ఇన్‌స్పెక్టర్ని కోడూరుకు పంపాడు స్వరాజ్యరావు.

చీకటి పడుతోంది. సునీత నౌకరు చేతికిచ్చి మూడు కప్పుల కాఫీ, బిస్కట్లు గదిలోకి పంపింది. యుగంధరూ, స్వరాజ్యరావూ, రాజూ కాఫీ తాగి సిగరెట్లు వెలిగించారు.

యుగంధర్ ఆలోచనలలో మునిగి ఉన్నాడు. రెండు కాళ్ళూ ఎదురుగా ఉన్న బల్లమీదికి జాపి కుర్చీలో జారగిలబడి, నోట్లోంచి బయటకి వస్తున్న పొగమీద దృష్టి లగ్నం చేసి ఆలోచిస్తున్నాడు. ముగ్గురూ మౌనంగా అరగంటసేపు కూర్చున్నారు. తరువాత యుగంధర్ రాజుని చూసి "కాయితం, కలం తీసుకో. నే చెప్పే విషయాలు వ్రాయి" అన్నాడు. రాజు జేబులోంచి నోటు బుక్కు ఫౌన్ టెన్ పెన్ తీశాడు.

సునీత నిర్దోషి అయితే - రాత్రి పదిగంటలకు హతుడి గదిలోకి వెళ్ళింది. బ్రాందీలో పది చుక్కలు హార్టిసాల్ పోసింది. తన గదికి వెళ్ళిపడుకుంది. తెల్లారి హతుడి గదిలోకి వెళ్ళి మందు సీసా ముట్టుకుంది. సీసామీద ఆమె వేలిముద్రలు ఉండటానికి కారణం అది.

దోషి అయితే - బ్రాందీలో ఆమె ఎక్కువ మందు కలిపి ఉంటుంది. ఇంకా నాలుగయిదేళ్ళపాటు రవి భార్యగా నటించడం ఇష్టంలేకా, కాంతారావుని త్వరగా వివాహం చేసుకోవాలనీ శివరామకృష్ణయ్యను హత్యచేసి ఉంటుంది. ఆస్తి ఆమెకు సంక్రమిస్తుందని తెలియడం కూడా కారణం.

అనుమానాలు - మందు సీసామీద డాక్టర్ వేలిముద్రలు ఏమయ్యాయి? సునీతే ఆ వేలిముద్రలు చెరిపివేసిందా? అయితే తన వేలిముద్రలు ఎందుకు చెరిపివేయలేదు? మందు సీసా ఖాళీగా ఎందుకు ఉంది? సీసాలో మందంతా ఏమైంది? మామను సంతోషపెట్టడానికి రవికి భార్యగా నటించిన సునీత ఆ మామయ్యనే హత్యచేయడం అసహజం కదా. ఆస్తి తన పేర్న వ్రాశాడని తెలిశాక హత్య ఎందుకు చేస్తుంది? మళ్ళీ మనస్సు మార్చుకుంటాడని భయమా?

కాంతారావు - నిర్దోషి అయితే అతను చెప్పిన విషయాలు కొంతవరకు నిజం అనుకునేందుకు ఆధారాలున్నాయి. సూర్యనారాయణ దగ్గర ఉన్న వందరుపాయల నోట్లు శివరామకృష్ణయ్యగారి పర్సులోంచి కావడం వల్ల క్రితం రాత్రి రవి తండ్రి గదిలోకి

వచ్చి, పర్సుతీసి డబ్బుదొంగతనం చేశాడనుకోవచ్చు. దోషి అనుకుంటే కాంతారావే బ్రాందీలో హర్టిసాల్ పోసి ఉండాలి. అతను శివరామకృష్ణయ్య అడ్డులేకపోతే అతను సునీతను వెంటనే వివాహం చేసుకోవచ్చు. అయితే ఇంట్లోకి రావడానికి అతనికి తలుపు తెరిచిందెవరు? సీసాలో మిగతా మందు ఎట్లా మాయమైంది?

రవి అబద్ధాలు చెబుతున్నాడు. రాత్రి అతను ఎక్కడికో వెళ్ళి ఇంటికి వచ్చాడు. బురద అతుక్కున్న అతని బూట్సు అందుకు సాక్ష్యం. రవి ఎందుకు అబద్ధం చెబుతున్నాడు? ఎక్కడికి వెళ్ళాడు? అతను దోషి అయితే తన తండ్రి సునీతకు ఆస్తి వ్రాసినట్లు అతనికి తెలియదు కనుక ఆస్తిని త్వరగా హస్తగతం చేసుకోవాలన్న ఆతుత అతను హత్య చేయడానికి కారణం. ఒకటి రెండు నెలల్లో తండ్రి పోతాడన్న ఉద్దేశంతోనే కదా సునీతను పెళ్ళిచేసుకున్నట్లు నటించాడు. తండ్రి ఇంకా నాలుగేళ్ళు బతుకుతాడని తెలియగానే అతనికి ఓర్పు పోయి ఉండవచ్చు.

అనుమానాలు - రవే తండ్రి మనీపర్సులోంచి నాలుగు వంద రూపాయల నోట్లు తీసి ఉంటాడు. అతను దిండు దగ్గర వెదికినట్లు కాంతారావు సాక్ష్యం ఉంది. తండ్రిని హత్య చేస్తే మర్నాటినుంచీ ఆస్తి, రొఖ్ఖం అంతా తనదే అవుతుంది కదా! అలాంటప్పుడు దొంగతనం చెయ్యవలసిన అవసరం ఏమొచ్చిందతనికి?తండ్రి బతికి ఉంటాడనుకున్నప్పుడే అతను దొంగతనానికి పాల్పడడం సబబుగా ఉంటుంది. మందు సీసాలో మందేమయింది? మందు రవి ఏం చేసి ఉంటాడు.

●●●

**సూర్యనారాయణ - ఇతను ఏ మిషమీదో రవిని బెదిరించి,** అతని దగ్గర డబ్బు గుంచుకుంటున్నాడనుకోవచ్చు. అయితే వందా రెండు వందలతో సూర్యనారాయణ తృప్తిపడతాడా? రవి దగ్గర ప్రస్తుతం డబ్బులేదు గనుక అంతతో తృప్తిపడ్డా, రేపు రవికి ఆస్తి హస్తగతమైనప్పుడు తనకు పెద్ద మొత్తం లభించేందుకు సూర్యనారాయణ ఏర్పాటు చేసుకుని ఉంటాడు. అంటే రవిచేత ప్రామిసరీనోటు వ్రాయించుకుని ఉంటాడు. శివరామకృష్ణయ్య ఎంత త్వరగాపోతే అంత త్వరగా తనకా డబ్బు వస్తుంది గనుక శివరామకృష్ణయ్యను హత్య చేయడానికి సూర్యనారాయణకు కారణం ఉంది. అయితే శివరామకృష్ణ సహా బతికి ఉన్నంత కాలమూ రవిని బెదిరించి డబ్బులాగే అవకాశం వదులుకుని హత్యచేసి ఉంటాడా?

అనుమానాలు - అసలు సూర్యనారాయణ ఏమని రవిని బ్లాక్ మెయిల్ చేస్తున్నాడు? రవీ, సునీతా పెళ్ళి చేసుకోలేదని అతనికి తెలుసా? ఆ మాట శివరామకృష్ణయ్యకు చెబుతానని బెదిరిస్తున్నాడా? ఈ విషయం సూర్యనారాయణకు ఎట్లా తెలిసి ఉంటుంది? కాంతారావుగానీ, సునీతగానీ, రవిగానీ చెప్పి ఉండరు కదా! రవితో సూర్యనారాయణకు పూర్వపరిచయం ఉంది. రవి ఇదివరకే తండ్రికి తెలియకుండా ఎవరినో వివాహం చేసుకుని ఉండవచ్చు. అది సూర్యనారాయణకు తెలిసి ఉండాలి. ఆ విషయం బయట పెట్టుతానని రవిని బెదిరిస్తూ ఉండవచ్చు. సూర్యనారాయణ హంతకుడని అనుకున్నా సీసాలో మందు ఏమైంది? ఖాళీ సీసా ఎందుకు ఉంది? ఈ ప్రశ్నలకు సమాధానం దొరకడంలేదు.

యుగంధర్ లేచి గదిలో పచార్లు చేయసాగాడు. ఇంకా ఏమైనా చెబుతాడేమోనని వ్రాయడానికి రాజు కాచుకున్నాడు.

"మిస్టర్ యుగంధర్ మీ సమీక్ష బాగానే ఉంది కానీ ఇంతకీ అసలేం తేలినట్లు? ఏం తేలలేదే నలుగురిలో ఎవరైనా హత్యచేసి ఉండవచ్చు. లేదా నలుగురిలో ఎవరూ హత్యచేసి ఉండకపోవచ్చు అని కదా మీ సమీక్ష పర్యవసానం" అన్నాడు స్వరాజ్యరావు నిస్పృహతో.

"డియర్ స్వరాజ్యరావూ అయిదో మనిషిని మరిచిపోతున్నారు మీరు. రాజూ అదీ రాయి. నిన్న రాత్రి ఇంట్లోకి వచ్చిన స్త్రీ ఎవరు? ఎందుకు వచ్చింది? సునీత బయటకు వెళ్ళలేదని చెప్పింది. ఆమె చెప్పులకు బురద లేదు. సునీత మాటలు నమ్మదగ్గవిగా కనపడుతున్నాయి. కనుక రాత్రి వచ్చిన స్త్రీ పరాయి స్త్రీ అయివుండాలి."

"బాగుంది. అయితే మనం ప్రశ్నించిన నలుగురూ కాక ఇంకొకరు కూడా ఉన్నారన్నమాట అయిదుగురు అనుమానితులా?" అన్నాడు స్వరాజ్యరావు.

"రాజూ! ఆ రాసిన సమీక్ష ఒకసారి తిరగవేసి హత్య చేసినది ఎవరైనా, తేలవలసిన విషయాలేమిటో చెప్పు"

రాజు అయిదు నిమిషాలు ఆ కాయితాలు తిరగేసి చూశాడు. "సీసాలో మందేమైంది? అన్నది ముఖ్యమైన ప్రశ్న."

"అవును, ఆ ప్రశ్నకు జవాబు మనం సంపాదించాలి."

"తర్వాత - అయిదో అనుమానితురాలు - రాత్రి వచ్చిన స్త్రీ ఎవరు?" అన్నాడు రాజు.

"అవును. ఆలోచించనీ!" అని యుగంధర్ దీర్ఘమైన ఆలోచనలో పడ్డాడు.

అరగంట దాటింది. అంతలో కోడూరుకు వెళ్ళిన సబ్‌ఇన్‌స్పెక్టరు రాఘవయ్య హడావిడిగా గదిలోకి వచ్చాడు.

"ఏమిటా హడావిడి. సూర్యనారాయణ విషయం కనుక్కున్నావా?" అడిగాడు స్వరాజ్యరావు.

"హెడ్ క్వార్టర్స్‌కి ఫోను చేశాను. ఫైల్స్ తిరగేసి చూశారుట. సూర్యనారాయణ అనే ఓ మనిషిని రెండేళ్ళ క్రితం బ్లాక్ మెయిల్ ఛార్జిమీద పట్టుకున్నారుట. వ్యభిచరించిన ఓ కులస్త్రీని అతను బెదిరించి డబ్బు గుంజినట్లు కేసు పెట్టారు. కానీ సాక్ష్యం చాలకపోవడంవల్ల కేసు ఉపసంహరించుకుని అతన్ని వదిలివేశారుట. రికార్డుల్లో అతని వేలిముద్రలు ఉన్నాయట" అన్నాడు రాఘవయ్య.

యుగంధర్ ఓ నిముషం దీర్ఘంగా ఆలోచించాడు. "రవిని ఇంకోసారి పిలిచి కాస్త గట్టిగా ప్రశ్నిద్దాం. మరికొంత నిజం బయటపడుతుంది" అన్నాడు.

సబ్‌ఇన్‌స్పెక్టరు వెళ్ళి రవిని పిలుచుకువచ్చాడు. రవి చాలా చిరాకుగా ఉన్నాడు.

"కూర్చోండి. మిమ్మల్ని ఇంకా కొన్ని ప్రశ్నలు అడగాలి. దయచేసి దాచకుండా నిజం చెప్పండి" అని యుగంధర్ వేపు తిరిగి "అడగండి!" అన్నాడు స్వరాజ్యరావు.

రవి యుగంధర్‌ని చిరాకుతో చూశాడు.

"మిష్టర్ రవీ మీకు వివాహమయిందా?" అడిగాడు యుగంధర్.

రవి చకితుడై యుగంధర్ని అనుమానంగా చూశాడు. ఒక క్షణం లేదని చెబుదామా అనుకున్నట్లు సందేహించి తర్వాత "అయ్యింది" అన్నాడు.

"మీ భార్య పేరేమిటి?" అడిగాడు యుగంధర్.

"మీ దర్యాప్తుకి నా భార్య పేరు చాలా అవసరమా?"

"చెబితే మంచిది. సునీతాదేవి మీ భార్యకాదుగా?"

"సునీత నా భార్య కాదని మీకు తెలుసు. నా భార్య ఎమిలీ."

"ఎమిలీ క్రిష్టియనా?"

"అవును. ఆంగ్లో ఇండియన్ స్త్రీ."

"ఆమెను మీరు మద్రాసులో వివాహం చేసుకున్నారా?"

"అవును. జబ్బు చేసి ఓసారి ఆస్పత్రిలో ఇన్ పేషంటుగా చేరాను. ఎమిలీ నర్సుగా ఉండేది. అప్పుడు పరిచయం అయింది."

"మీరు ఎమిలీని వివాహం చేసుకుంటున్నట్లు మీ తండ్రిగారికి తెలుసా?

"తెలియదు."

"మీ భార్య ఇప్పుడెక్కడ ఉన్నారు?"

రవి ఒక నిమిషం తటపటాయించాడు. "కోడూరులో"

"కోడూరులోనా? అక్కడేం చేస్తున్నారు? మీరు ఇక్కడకు వచ్చేటప్పుడూ మీతో వచ్చారా?"

"అవును. కోడూరులో ఓ చిన్న గది అద్దెకు తీసుకుని ఉంటోంది."

"మీరూ సునీతా వివాహం చేసుకుంటున్నట్లు మీ తండ్రిగారితో మీరు చెప్పిన విషయం మీ భార్యకు తెలుసా?"

"తెలుసు."

"తెలిసే ఆమోదించారా! ఎందుకని?"

రవి జవాబు చెప్పలేదు.

"లేకపోతే ఆస్తిదక్కదనా? మిమ్మల్ని ఒక కంట కనిపెడుతూ ఉండడానికేనా ఆమె కోడూరుకి వచ్చి అక్కడ ఉంటున్నది. చెప్పండి రవీ!" గట్టిగా అడిగాడు యుగంధర్.

"అవుననుకుంటాను."

"నిన్న మందు కొనడానికి మీరు కోడూరుకి వెళ్ళినపుడు మీ భార్యను కలుసుకున్నారా!"

"కలుసుకున్నాను."

"వెళుతూ కలుసుకున్నారా, వస్తూ కలుసుకున్నారా?

"ఇంటికి వస్తూ అక్కడికి వెళ్ళాను."

"నిన్న రాత్రి పదిగంటల తర్వాత మీ భార్య ఎమిలీ ఇక్కడకు ఎందుకు వచ్చింది?"

రవి ఉలిక్కిపడ్డాడు. నిర్ఘాంతపోయి యుగంధర్ని చూశాడు.

"ఇంతవరకూ మీరు నిజం చెప్పారు. ఇప్పుడూ నిజం చెప్పండి రవీ!"

"డబ్బు కావాలని అడిగింది. ఇంట్లో ఉంది తర్వాత తెచ్చి ఇస్తానని చెప్పాను. తనే వచ్చి తీసుకుంటానని చెప్పివచ్చింది."

"మిస్టర్ రవీ! మీ జవాబు నమ్మదగిందిగా లేదు. అర్ధరాత్రి ఆడది ఒంటిగా భర్త దగ్గిర డబ్బు తీసుకునేందుకు ఇంతదూరం వస్తుందా?" అన్నాడు యుగంధర్.

"అదొకటే కాదు కారణం. నా ఇల్లు చూడాలని ఉంది అన్నది. పట్టపగలు వస్తే ఎవరైనా చూస్తారనీ, నాన్నకి తెలుస్తుందనీ భయపడ్డాను. రాత్రి వస్తానన్నది రమ్మన్నాను."

"ఓహో! తన భర్త స్వగృహం చూడడానికి అడ్డు. రాత్రివేళ వచ్చారన్నమాట. పెరటి వాకిలి ఆమెకోసం మీరే తెరిచారన్నమాట. అవునా? రాతి ఎన్నిగంటలకి వచ్చింది?"

"పదిన్నర దాటింది. పదిన్నరకు వస్తానన్నది. అందుకనే నేను గేటు దగ్గర కాచుకువున్నాను. ఆమె రాగానే లోపలికి తీసుకువచ్చాను."

"ఆమె వచ్చినప్పుడు వాన కురుస్తోందా?"

"అవును కురుస్తోంది."

"థాంక్స్ రవీ మీరు సూర్యనారాయణకు ఎన్నివేల రూపాయలకు ప్రామిసరీ నోటు వ్రాసి ఇచ్చారు." సూటిగా రవి కళ్ళలోకి చూస్తూ అడిగాడు యుగంధర్.

రవి బెదిరిపోయాడు. అయిదు నిమిషాలు నోట్లోనుంచి మాట రాలేదు. చివరికి "పదివేలకి" అన్నాడు.

"నిన్న రాత్రి మీరు అతనికి రెండువందల రూపాయల నోట్లు ఇచ్చారు నిజమేనా?"

"అవును."

"ఆ డబ్బు మీ తండ్రిగారి దిండుకిందనుంచి దొంగలించారు కదూ!"

"అవును" అన్నాడు అప్రయత్నంగా.

"మిష్టర్ రవీ ఇంకొక మాట. కోడూరులో మీ భార్య ఎమిలీ ఎక్కడుంటున్నారో దయచేసి చెపుతారా?" అడిగాడు యుగంధర్.

రవి చెప్పాడు.

డిటెక్టివ్ యుగంధర్ కుర్చీలో జారగిలబడి, తల వెనక్కి ఆనించి, కళ్ళు మూసుకున్నాడు. స్వరాజ్యరావు ఏదో మాట్లాడబోయి యుగంధర్ ఆలోచనా పరంపరల్లో మునిగి ఉండడం గమనించి ఊరుకున్నాడు. ఇంతలో రవి మళ్ళీ గదిలోకి వచ్చి "ఇన్స్పెక్టరుగారూ ఇంట్లోనుంచి ఎవర్నీ బయటికి వెళ్ళనివ్వవద్దని మీరు ఆజ్ఞ ఇచ్చారుట కదా!" అన్నాడు.

"అవును" అన్నాడు స్వరాజ్యరావు.

యుగంధర్ ఇన్స్పెక్టర్ వైపు తిరిగి "మై డియర్ స్వరాజ్యరావూ! అలా ఆజ్ఞ ఇవ్వడం అన్యాయం, పాపం, రవి తన భార్యను కలుసుకోవాలనుకుంటే మీరు అభ్యంతరం చెప్పకూడదు" అన్నాడు.

యుగంధర్ ఆ మాటలంటూ కళ్ళతో చేసిన సంజ్ఞ గ్రహించి ఇన్స్పెక్టరు వెంటనే "యస్, మిష్టర్ రవీ! మీరు మీ భార్యను కలుసుకోదలిస్తే నిరభ్యంతరంగా వెళ్ళవచ్చు" అన్నాడు.

రవి థాంక్స్ చెప్పి వెళ్ళిపోయాడు. అతని వెనకే రాజు కూడా బయటికి వెళ్ళాడు.

"రవిని వెళ్ళనివ్వమని మీరు నాకు ఎందుకు సంజ్ఞ చేశారు?" అడిగాడు స్వరాజ్యరావు యుగంధర్ని.

"రవిని నీడలా వెంటాడమని రాజుకు కూడా సంజ్ఞ చేస్తూ వేళ్ళతో కుర్చీమీద చిన్నగా కొట్టాను. మీరు వినలేదు. నాకూ, రాజుకి అలా సంభాషించుకోవడం అలవాటు. అది ఒక్కొక్కప్పుడు చాలా అవసరం కూడా" అని యుగంధర్ ఏదో ఆలోచిస్తూ గదిలో పచార్లు చేయసాగాడు.

ఉన్నట్లుండి ఆగి "మైడియర్ స్వరాజ్యరావూ! కోడూరులో ఎన్ని మందుల షాపులున్నాయో మీకు తెలుసా?" అని అడిగాడు యుగంధర్.

స్వరాజ్యరావు సబ్ ఇన్స్పెక్టర్ని పిలిచి అడిగాడు. ఒకే ఒక మందులషాపు ఉందని రాఘవయ్య చెప్పాడు.

"ఎవరైనా నిన్న హార్టిసాల్ అనే మందు అక్కడ అనె మందు అక్కడ కొన్నారేమో వాకబు చేశారా!" అడిగాడు యుగంధర్.

స్వరాజ్యరావు నవ్వుతూ "యుగంధర్! రవి కొన్నట్లు తెలుస్తూనే ఉందిగా ఇంకా వాకబు చెయ్యడం ఎందుకు? ఆలోచనలు ఎక్కువై మీ మెదడు పని చేస్తున్నట్లులేదు" అన్నాడు.

"నేను వెళ్ళి కనుక్కురానా?" అన్నాడు రాఘవయ్య.

"నేనూ వస్తాను ఉండండి" అని యుగంధర్ బయలుదేరాడు.

"నేను మాత్రం ఇక్కడెందుకు" అంటూ వాళ్ళ వెనకే స్వరాజ్యరావు పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ వెళ్ళాడు.

అరగంట సేపట్లో జీపు, కారు కోడూరు బజారు వీధిలో ఉన్న జనరల్ డ్రగ్ స్టోర్సు ముందు ఆగింది.

●●●

**యుగంధర్ చేసిన సంజ్ఞ తెలుసుకుని** రాజు గదిలోంచి బయటకు వెళ్ళి మోటారు షెడ్ వేపు చూశాడు. రవి షెడ్ దగ్గరికి వెళుతున్నాడు. అక్కడ నిలబడివున్న కానిస్టేబుల్ చెవిలో ఏదో చెప్పి రాజు ఎదురుగా ఉన్న వేపచెట్టు వెనక దాక్కున్నాడు. రవి కారు స్టార్టు

చేసి, రివర్సు గేర్లో నెమ్మదిగా కారు బయటకు తీసుకువచ్చాడు. కానిస్టేబులు కారు ఆపి "ఇన్ స్పెక్టరు అనుమతి తీసుకున్నారా?" అని అడిగాడు.

రవి అవునని చెప్పగా ఇన్‌స్పెక్టరుతో చెప్పి వస్తాను ఉండమని చెప్పి, రెండు నిమిషాల్లో తిరిగివచ్చి "సరే, వెళ్ళండి" అని చెప్పాడు కానిస్టేబుల్.

ఆలోగా రాజు కారు డిక్కీ తలుపు తెరిచి లోపలకు దూరి తలుపు మూసుకున్నాడు. ఇరవై నిమిషాలపాటు రాజు డిక్కీలో ఉడకకి మగ్గిపోయాడు. కారు ఎక్కడో ఆగింది. రవి కారు దిగాడు. కొంచెం సేపు ఉండి డిక్కీ తలుపు తెరిచి చూశాడు రాజు. ఒక ఇంటిపక్క తోటలో కారు ఆగివుంది. నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ పెరటి గుమ్మం వైపు నడిచాడు. దక్షిణం వైపు ఉన్న కిటికీ దగ్గర ఆగిపోయాడు. కిటికీ మూసి ఉన్న వెంటిలేటరులోంచి మాటలు వినిపించాయి. కిటికీ రెక్కల మధ్య ఉన్న సందుకి కన్ను ఆనించి లోపలకు చూశాడు. ఒక బల్లమీద ఓ ఆంగ్లో ఇండియన్ యువతి కూర్చుని ఉంది, ఆమె ఎమిలీ అయ్యుండాలనుకున్నాడు రాజు. రవి ఎదురుగా ఉన్న ఇంకో కిటికీ దగ్గర నిలబడి ఉన్నాడు. అతని కళ్ళల్లోంచి నీళ్ళు కారుతున్నాయి. ఎమిలీ అతని దగ్గరకు వెళ్ళి తలమీద చెయ్యివేసి జుట్టు సర్దుతూ "డార్లింగ్ ఏడుస్తున్నావా? ఎందుకు? ఎలాగూ మీ నాన్న పోతారనుకున్నదేగా!" అన్నది.

"అది కాదు డియర్ నాన్న సహజమైన చావు చావలేదు. ఎవరో హత్య చేశారు నాన్నని" అన్నాడు రవి కళ్ళు తుడుచుకుంటూ.

"హత్యా! ఎలా తెలుసు నీకు?" అడిగింది ఎమిలీ.

"ఎలా తెలియడమేమిటి? పొద్దున్నుంచీ పోలీసులు ఇల్లంతా ఆక్రమించుకున్నారు. ఎవరినీ బయటకు వెళ్ళనివ్వటంలేదు."

"ఎట్లా హత్య చేశారు? ఎవరు చేశారు?"

"నాన్న రోజూ తీసుకునే హర్టిసాల్ ఎక్కువ డోసు పోశారు ఎవరో. అది విషం"

"ఎవరు పోసి ఉంటారు? పోలీసులు ఎవరినైనా అనుమానిస్తున్నారా?" అడిగింది ఎమిలీ.

రవి వెటకారంగా నవ్వి "బాగానే ఉంది. ఎవర్నైనా అనుమానించడం ఏమిటి? అందర్నీ అనుమానిస్తున్నారు. నువ్వు నిన్న రాత్రి అక్కడకు వచ్చిన విషయం కూడా కనుక్కున్నారు. ఆ యుగంధర్ ఆవలిస్తే పేగులు లెక్కపెడతారు"

ఎమిలీ రవి జుట్టులోంచి చెయ్యి తీసేసి ఒక అడుగు వెనక్కి వేసింది. "డార్లింగ్" అంటూ అతని కళ్ళల్లోకి చూసింది. రవి తలెత్తి ఆమెను చూశాడు.

"డార్లింగ్ నువ్వు చేశావా ఆ పాడు పని. నాతో నిజం చెప్పవూ" అడిగింది ఎమిలీ.

రవి నిశ్చేష్టుడై ఎమిలీని చుశాడు. "ఎమిలీ! నువ్వు నన్ను అనుమానిస్తున్నావా?" అన్నాడు ఒణుకుతున్న కంఠంతో.

ఎమిలీ అమాంతం రెండు చేతులూ రవి మెడచుట్టూ వేసి, అతన్ని దగ్గరికి లాక్కుంటూ "లేదు, డార్లింగ్ నీ మీద నాకు అనుమానమా! ఛ! ఊరికే అడిగాను. నన్ను ఇంటికి తీసుకువెళ్ళు. మీ నాన్నగారు లేరుగా. ఇంకేం భయం. ఇప్పుడు నేనేగా ఆ ఇంటికి యజమానురాల్ని" అన్నది.

రవి ఎమిలీ భుజం మీద తల ఆనించి చెవి దగ్గర నెమ్మదిగా "ఎమిలీ మన కలలన్నీ అంతర్ధానమయినాయి. నాన్న ఆస్థి నాకు ఇవ్వలేదు" అన్నాడు.

ఎలక్ట్రిక్ షాక్ తగిలినట్లు ఎమిలీ అతని మీదనుంచి చేతులు తీసేసి, తీక్షణంగా చూస్తూ "ఏమిటి? ఏమంటున్నావు?" అన్నది.

"డార్లింగ్ నాన్నకు నిజం తెలిసిపోయింది. నేనూ, సునీత ఆడిన నాటకం కనుక్కున్నాడు. నాకు ఆస్తిలో చిల్లికానీ ఇవ్వలేదు. నెలకు అయిదువందలు భరణం ఏర్పాటు చేశాడు."

ఎమిలీ గదిలో ఇటూ అటూ పచార్లు చేయసాగింది. బోనులో పడ్డ చిరుతపులిలా రౌద్రంగా ఉంది.

"మంచం మీద నుంచి కదలలేని ముసలాయన్ని నమ్మించలేకపోయావు. నీ నాటకం తెలిసిపోయేట్లు ప్రవర్తించి ఉంటావు. నా బుద్ధిహీనతగానీ నువ్వు ఏనాడు ఏ పని సక్రమంగా చేశావు, డామిట్" అంటూ చెప్పు కాలితో నేలను ఒకసారి తన్ని, చేతి గడియారం చూసుకుని అవతల గదిలోకి వెళ్ళింది. అర నిముషంలో ఒక తోలు పెట్టె తీసుకు వచ్చింది తాడుమీద వేళ్ళాడుతున్న గౌను తీసి మడిచి పెట్టెలో పెట్టడం ప్రారంభించింది.

"డార్లింగ్ ఏమిటిది? ఎక్కడికి?" అంటూ రవి ఆమె వెనకకు వెళ్ళి, నడుం చుట్టూ చెయ్యి వేశాడు. ఎమిలీ అతని చెయ్యి లాగేసింది. "ఇంకో గంటలో మద్రాసుకు రైలు ఉంది. వెళుతున్నాను" అన్నది.

"ఇంకో నాలుగు రోజులుండు, నేనూ వస్తాను" అన్నాడు రవి.

ఎమిలీ తీక్షణంగా రవిని చూసింది. "మిస్టర్ రవీ మన జీవితాలు వేరయ్యే పరిస్థితి వచ్చింది. నువ్వంటే నాకు ఇష్టమే. కానీ నీలాంటి యువకులు పట్నం నిండా ఉన్నారు. నాకు కావలసింది మగవాడి సహచర్యం మాత్రమే కాదు. విలాసాలూ, వినోదాలూ, భోగభాగ్యాలూ కావాలి. జీవితానికి తోరణం కట్టుకుని నిత్యమూ పండుగలాగ జీవించాలి. అలా జీవించడానికి బాగా డబ్బు ఉండాలి. నీ తండ్రి ఆస్తిపరుడనీ, ఆయన తదనంతరము నువ్వు లక్షలకు అధికారివవుతావనీ నమ్మి నిన్ను పెళ్ళిచేసుకున్నాను. నా ఆశలన్నీ అడుగంటాయి. కనక నా దారిన నేను పోతున్నాను. నన్ను వెళ్ళనీ. అడ్డుపడక, గుడ్ బై! ఇక నువ్వు వెళ్ళవచ్చు. నీకోసం పాపం ఆ ఇన్స్పెక్టరూ, యుగంధరూ కాచుకునుంటారు వెళ్ళు" అన్నది కఠినంగా.

ఎమిలీ ఆవేశంతో ఈ మాటలు అని, గట్టిగా ఊపిరి పీల్చిందో లేదో ఎవరో తలుపు తట్టినట్లయింది.

"ఎవరది?" ఎమిలీ కేక వేసింది.

"దయచేసి తలుపు తియ్యండి."

"ఎవరు మీరు?"

"డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ స్వరాజ్యరావుని."

●●●

ఇన్స్పెక్టర్ స్వరాజ్యరావు యూనిఫారం చూడగానే జనరల్ డ్రగ్ స్టోర్స్‌లో గల్లా పెట్టె దగ్గర కూర్చున్న మనిషి చటుక్కున లేచి నిలబడి "రండి సార్" అన్నాడు.

"నిన్న సాయంత్రం హర్టిసాల్ అనే మందు సీసా ఎవరికయినా అమ్మారా" అడిగాడు ఇన్స్పెక్టరు.

షాపు అతను ఒక క్షణం ఆలోచించి రిజిష్టరు తీసి చూసి "అమ్మాను సార్!" అన్నాడు.

"దయచేసి ఎవరికి అమ్మిందీ చెబుతారా?"

షాపు అతను ఫైలు తీసి డాక్టరు ఇచ్చిన ప్రిస్క్రిప్షన్ చూసి "శివరామకృష్ణయ్యగారి కుమారుడు రవికి అమ్మానండీ" అన్నాడు.

"నిన్న ఇంకెవరికైన కూడా హర్టిసాల్ అమ్మారేమో చూసి చెప్పండి!" అడిగాడు యుగంధర్.

షాపు అతను మళ్ళీ రిజిష్టరు తిరగేసి "ఇంకొకరికి యాభై డ్రాప్పు అమ్మాను" అని చెప్పాడు.

"ఆ యాభై డ్రాప్పు కొన్నవారెవరో ప్రిస్క్రిప్షన్ చూసి చెబుతారా?" అడిగాడు యుగంధర్.

ప్రిస్క్రిప్షన్ల ఫైలు తీసి "మిసెస్ ఎమిలీ అనే ఆమెకు అమ్మాను సార్" అన్నాడు షాపు అతను.

స్వరాజ్యరావూ, యుగంధరూ ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు.

"దయచేసి ఆ ప్రిస్కిప్షన్ ఒకసారి ఇలా ఇవ్వండి" అడిగాడు యుగంధర్. షాపు అతను ఇచ్చాడు. ఎమిలీకి డాక్టరు రఘుపతిరావు వ్రాసి ఇచ్చిన ప్రిస్క్రిప్షన్ అది. రోజూ రాత్రి పడుకోబోయేటప్పుడు రెండు చుక్కలు నీళ్ళలో వేసుకుని తాగమని రాశాడు డాక్టర్ ప్రిస్క్రిప్షను మీద.

డాక్తరు రఘుపతిరావుగారి డిస్పెన్సరీ ఎక్కడ ఉందో షాపు అతన్ని అడిగి తెలుసుకున్నాడు యుగంధర్.

"ఎమిలీ స్వయంగా వచ్చిందా? ఎవర్నయినా పంపిందా?" అడిగాడు యుగంధర్. ఆమె స్వయంగా వచ్చిందని చెప్పాడు షాపతను.

"శివరామకృష్ణయ్యగారి కుమారుడు రవి రెండువందల డ్రాప్స్ ఉన్న నిండు సీసా కొన్నాడు. ఎమిలీ యాభై డ్రాప్స్ కొన్నది. ఎమిలీ కొన్న మందు ఎందులో పోసి ఇచ్చారు?" అడిగాడు యుగంధర్.

"కొత్త సీసా మూత తీసి, యాభై డ్రాప్స్ ఇంకో సీసాలో పోసి ఇవ్వబోయాను. కానీ ఎమిలీ కంపెనీవారి ఒరిజినల్ బాటిల్‌లోనే పోసి ఇవ్వమంది. ఒక ఖాళీ సీసా ఉంటే అందులో పోసి ఇచ్చాను." అన్నాడు షాపు అతను.

"థాంక్స్. ఈ ప్రిస్క్రిప్షను తీసుకు వెళతాము." అంటూ యుగంధర్ లేచాడు. స్వరాజ్యరావూ, రాఘవయ్యా కూడా లేచారు. ముగ్గురూ జీపు, కారు ఎక్కారు. అయిదు నిముషాల్లో జీపు డాక్టర్ రఘుపతిరావు డిస్పెన్సరీ ముందు ఆగింది.

లోపలికి వస్తున్న ఇన్‌స్పెక్టర్నీ, సబ్ ఇన్‌స్పెక్టర్నీ చూసి "యస్ యస్ ఏమిటి? పనిమీద వచ్చారా? కూర్చోండి" అన్నాడు డాక్టరు రఘుపతిరావుగారు. ఆయనకు యాభైఏళ్ళు ఉంటాయి. మంచి ప్రాక్టీసు ఉన్న డాక్టరు.

ఇన్‌స్పెక్టర్నీ, యుగంధర్నీ రాఘవయ్య డాక్టరుకు పరిచయం చేశాడు.

తను తెచ్చిన ప్రిస్క్రిప్షన్ డాక్టరు కిచ్చి "ఇది మీరు ఇచ్చినదే అనుకుంటాను" అన్నాడు యుగంధర్.

"అవును" అన్నాడు డాక్టరు ప్రిస్క్రిప్షన్ చూసి.

"ఎమిలీ అనే ఆమెకు ఈ ప్రిస్క్రిప్షన్ మీరు ఇచ్చారు. ఆమెకేం జబ్బు?" అడిగాడు యుగంధర్.

"ఎమిలీ చెప్పిన రోగ లక్షణాలను బట్టి కార్డియాక్ ఆరంభంలో ఉందనుకున్నాను. అందుకే హర్టిసాల్ ప్రిస్కయిబ్ చేశాను" అన్నాడు డాక్తరు.

డాక్టరుకు థాంక్స్ చెప్పి యుగంధరూ, స్వరాజ్యరావూ రాఘవయ్యను వెంటబెట్టుకుని ఎమిలీ ఇంటికి వెళ్ళారు.

●●●

సునీత తోటలో పచార్లు చేస్తోంది. యుగంధరూ, ఇన్‌స్పెక్టరూ వెళ్ళి అప్పటికి గంట దాటింది. చీకటి పడబోతోంది. ఇంతలో ఎవరో నడిచివస్తున్న అలికిడి అయింది. సునీత వెనక్కి తిరిగి చూసింది.

సిగరెట్ పొగ వదులుతూ సూర్యనారాయణ ఆమె వేపు వస్తున్నాడు. "ఏమండీ ఒంటిగా ఇక్కడున్నారు?" అన్నాడతను.

సునీత జవాబు చెప్పకుండా చిన్నగా నవ్వింది.

"మీ కోసమే వెతుకున్నాను" అన్నాడతను మళ్ళీ.

"ఎందుకు?"

"మీకు కాంతారావు కనిపించాడా?"

ఏకవచనం ఉపయోగించినందుకు ఆశ్చర్యపడుతూ "ఇందాక చూశాను. ఏం?" అని అడిగింది సునీత.

"ఏమీలేదు అతనితో మాట్లడవలసివుంది, అన్నట్టు మీరు కాంతారావుని వివాహం చేసుకోబోతున్నారా?" అడిగాడు సూర్యనారాయణ.

సునీత కోపంగా చూస్తూ "ఆ విషయం మీకు అనవసరం" అన్నది.

"కోపం తెచ్చుకోకండి. మీకు కాబోయే భర్త అయితే అతన్ని పోలీసులకు పట్టించను. అందుకే అడిగాను" అన్నాడు వెటకారంగా నవ్వుతూ.

సునీతకు అతని మాటలు అర్థం కాలేదు. "అంటే?" అడిగింది.

"ఆ ఏముంది ఏం జరిగింది నాకు పూర్తిగా తెలియదు సుమండీ. శివరామకృష్ణయ్యగార్ని హత్య చేయడంలో మీరు కూడా కాంతారావుతో కలిశారో లేదో "

"ఏమిటిది నోటికి వచ్చినట్లు పేలుతున్నావు?" అన్నది సునీత ఆగ్రహం పట్టలేక.

సూర్యనారాయణ పకపకా నవ్వాడు. "కోపం తెచ్చుకోకండి. మీ విషయం నాకు నిశ్చయంగా తెలియదని చెప్పానుగా కానీ కాంతారావు" అని ఆగాడు.

"ఆఁ కాంతారావుగారు?"

"ఇది ఆయన గదిలో బల్లకింద కాగితాల కట్టల వెనక కనిపించింది" అంటూ జేబులోంచి గుడ్డలో చుట్టిన ఓ ఖాళీసీసా తీసి చూపించాడు. అది హార్టిసాల్ సీసా.

సునీత దిగ్భ్రమ చెంది అలాగే నిలబడిపోయింది. సూర్యనారాయణ ఆ సీసా గుడ్డలో చుట్టి జేబులో పెట్టుకుని "దీని మీద కాంతారావు వ్రేలిముద్రలు ఉంటాయి. ఉండితీరతాయి. దీన్ని ఇన్‌స్పెక్టర్‌కు ఇస్తే కాంతారావు ఆట కడుతుంది. సంకెళ్ళు వేసి తీసుకుపోతారు" అన్నాడు.

సునీత నోటివెంట మాటరాలేదు.

"మీకు అతనంటే చాలా ఇష్టంకదూ! అతనికోసం ఏమైనా చేస్తారు కదూ!" అంటూ సునీత కళ్ళల్లోకి చూశాడు.

"అవును. నాకు తెలుసు. అతన్ని కాపాడడం మీ చేతుల్లో ఉంది. మీరు తలచుకుంటే" సునీత అప్పటికీ మాట్లాడలేదు.

"నాకు ఇరవై వేలు ఇస్తే ఈ సీసా బద్దలు కొట్టేస్తాను, పోలీసులకి చెప్పను" అన్నాడు ఆశగా ఆమెవైపు చూస్తూ.

"నీకు ఇరవై వేలివ్వాలా?" అనగలిగింది సునీత.

"అవును. నేను ఇంత సహాయం చేసేటప్పుడు ఇరవై వేలు ఇవ్వడానికేం? పోనీ ఇంకో సులభమైన మార్గం చెబుతాను. వింటారా?"

సునీత సూర్యనారాయణ్ణే చూస్తోంది. ఆమె మనస్సులో ఆలోచనలు సుడిగుండంలో నీళ్ళలా గిర్రుమని తిరుగుతున్నాయి. "కాంత్ హంతకుడా!" ఇది ఒకటే ఆమె ఆలోచన. ఎవరో ఆమె గుండెల్లో పొడిచినట్లయింది. రక్తాన్నంతా పీల్చి శరీరాన్ని పిండుతున్నట్లనిపించింది.

సూర్యనారాయణ మళ్ళీ పకపకా నవ్వాడు. "సునీతా! ఏమంటావు? డబ్బు ఇస్తావా? పోనీ ఇంకో సులువైన మార్గం ఉంది. చెబుతాను. అలా చెయ్యి. నన్ను పెళ్ళి చేసుకో కాంతారావు సంగతి ఎవరికీ చెప్పను. ఏం?" అన్నాడు.

అంతే సూర్యనారాయణ నోటివెంట ఇంకో మాటరాలేదు. కాళికా శక్తి విరుచుకుపడ్డట్టయింది, నిద్రపోతున్న సింహాన్ని లేపి కవ్వించినట్లయింది. ఫెడీ ఫెడీమని సూర్యనారాయణని ఈ దవడా ఆ దవడా వాయించడం ప్రారంభించింది. అతను దిగ్భ్రమ చెందాడు . పరిగెత్తిపోవడానికి కాళ్ళు కూడా ఆడలేదు.

"సునీతగారూ" అని కొంచెం దూరంలో ఎవరో పిలవడం వినిపించింది. ఆ పిలుపుతో సునీతకు ఒళ్ళు తెలిసింది. ఎదురుగా యుగంధర్. అసిస్టెంటు రాజు నిలుచున్నాడు.

సూర్యనారాయణ పరుగెత్తి వెళ్ళబోయాడు. రాజు అతని చేతిని గట్టిగా పట్టుకుని "ఆగు ఎక్కడికిపోతావు?" అని "ఏం జరిగింది?" అడిగాడు సునీతని.

సునీత రెండు చేతులూ మొహానికి అడ్డం పెట్టుకుని వెక్కి వెక్కి ఏడుస్తోంది.

"చెప్పవయ్యా! ఏం చేశావు?" గదమాయించాడు రాజు.

సూర్యనారాయణ బిత్తరపోయి చూశాడు. నోటివెంట మాట రాలేదు. ఇంతలో యుగంధర్ అక్కడికి వచ్చాడు. సునీత దగ్గరకు వెళ్ళి తలమీద చెయ్యివేసి "ఏం జరిగిందమ్మా నాతో చెప్పు" అన్నాదు.

సునీత ఏడుస్తూనే చెప్పింది. "కాంతారావు గదిలో హర్టిసాల్ సీసా దొరికిందట. అది మీకు ఇస్తానని బెదిరిస్తున్నాడు. తనకు ఇరవై వేలు ఇస్తే" సునీత ఆగింది.

యుగంధర్ సూర్యనారాయణని తీక్షణంగా చూసి "ఏది సీసా? ఇట్లా ఇవ్వు" అన్నాడు.

సూర్యనారాయణ పిల్లిలా అయిపోయి సీసా జేబులోంచి తీసి యుగంధర్ కి ఇచ్చాడు.

"ఇంట్లోకి వెళదాం పదమ్మా. రాజూ అతన్ని పారిపోకుండా గట్టిగా పట్టుకుని తీసుకురా" అన్నాడు యుగంధర్.

●●●

**"నేను ఇన్స్పెక్టర్ స్వరాజ్యరావుని"** అని ఇన్స్పెక్టరు అనగానే ఎమిలీ రాతిబొమ్మ అయిపోయింది.

"వాళ్ళు ఇక్కడికి ఎందుకువచ్చారు?" అడిగింది రవిని.

"ఏమో! ముందు తలుపు తియ్యి" అన్నాడతను.

ఎమిలీ తలుపు తీసింది. ముందు ఇన్స్పెక్టరూ, వెనక సబ్ఇన్స్పెక్టరూ, యుగంధర్ లోపలికి వచ్చారు. రాజు కూడా గోడపక్కనుంచి బయటికి వచ్చి యుగంధర్ చెవిలో తను విన్న దాని సారాంశం చెప్పాడు.

"తమరే కదూ ఎమిలీ?" అడిగాడు ఇన్స్పెక్టరు.

ఎమిలీ తల ఊపింది.

"నిన్న సాయంకాలం డ్రగ్ స్టోర్సులో మీరు హర్టిసాల్ అనే మందు కొన్నారు. అవునా?" అడిగాడు ఇన్స్పెక్టరు.

"అవును. కొన్నాను. అది నేరమా? డాక్టర్ ప్రిస్కిప్షన్ ఇచ్చాడు" అన్నది ఎమిలీ.

రవి ఆశ్చర్యంలో ఎమిలీని చూశాడు. ఇన్స్పెక్టరు సందేహిస్తూ యుగంధర్ని చూశాడు.

"మీరు ఆ మందు ఏం చేశారు?" అడిగాడు యుగంధర్.

"ఏం చేస్తాను. నిన్న రాత్రి రెండు చుక్కలు నీళ్ళల్లో వేసుకు తాగాను. మిగతా మందు అదుగో సీసాలో ఇక్కడే ఉంది" అంటూ అలమారు వేపు చూసింది ఎమిలీ.

యుగంధర్ నెమ్మదిగా అలమారు దగ్గరకు వెళ్ళి సీసా చూశాడు. అందులో చాలా మందు ఉంది.

"ఎమిలీ మీరు నిన్న రాత్రి మీ భర్త ఇంటికి వెళ్ళారు అవునా?" అడిగాడు యుగంధర్.

"అవును, వెళ్ళాను. వెళ్ళడం తప్పా?"

"శివరామకృష్ణయ్యగారు తాగిన బ్రాందీలో మీరు హర్టిసాల్ కలిపారు కదూ! నిజం చెప్పండి" గదమాయించాడు యుగంధర్.

ఎమిలీ యుగంధర్ని కోపంగా చూసి "ఈ నేరం నా మీదకు నెట్టుదామని చూస్తున్నారా? హంతకుణ్ణి పట్టుకోవడం మీకు చేతకాలేదా?" అన్నది.

యుగంధర్ ఎమిలీ కళ్ళల్లోకి చూస్తూ "ఈ సీసా మేము తీసుకువెళతాము" అని సిల్క్ రుమాలుతో చుట్టి సీసా జేబులో పెట్టుకున్నాడు.

''తప్పకుండా తీసుకు వెళ్ళండి. అందులో సరిగా నలభై ఎనిమిది చుక్కల మందు ఉంటుంది. రెండు చుక్కలతో పిల్లి కూడా చావదు'' అన్నది ఎమిలీ.

''సర్లెండి'' ఎమిలీతో అని ఇన్‌స్పెక్టర్ వేపు తిరిగి ''ఎమిలీనీ, రవినీ కూడా మనతో ఎస్టేటుకు తీసుకు వెళదాం'' అన్నాడు యుగంధర్.

''నేను రావడానికి వీలులేదు. ఈ రైలుకి మద్రాసు వెళుతున్నాను'' అన్నది ఎమిలీ.

యుగంధర్ నవ్వుతూ ''క్షమించండి. ఈ కేసు విషయం తేలేవరకూ మీరు ఈ ఊర్నుంచి వెళ్ళడానికి వీలులేదు'' అన్నాడు.

రవినీ, ఎమిలీనీ తీసుకుని అందరూ ఎస్టేటుకు బయలుదేరారు. యుగంధర్ సిల్కు రుమాలులో చుట్టిన హార్టిసాల్ సీసా సబ్ ఇన్‌స్పెక్టరు కిచ్చి చెవిలో ఏదో చెప్పాడు. రాఘవయ్య పోలీసు స్టేషను దగ్గర జీపు దిగి సీసా తీసుకువెళ్ళాడు.

ఎస్టేటుకు వెళ్ళగానే యుగంధర్ సునీత కోసం కబురు పంపాడు. నౌకరు ఆమె తోటలో ఉందని చెప్పాడు. పిలుచుకు రమ్మని రాజుని పంపారు. రాజు వెళ్ళేటప్పటికి సునీత సూర్యనారాయణను ఈ దవడా ఆ దవడా వాయిస్తోంది.

●●●

రవీ, ఎమిలీ సోఫాల్లో కూర్చున్నారు. కాంతారావు అక్కడే నిలుచున్నాడు. ఇన్‌స్పెక్టరు గుమ్మం దగ్గర ఉన్నాడు. యుగంధర్ సునీతను వెంటపెట్టుకుని వచ్చాడు. వెనకాలే రాజు సూర్యనారాయణను గట్టిగా పట్టుకుని వచ్చాడు.

''హల్లో ఏమిటి ఈ ఊరేగింపు?'' అడిగాడు ఇన్‌స్పెక్టరు.

సూర్యనారాయణకి దొరికిన మందు సీసా గురించీ, అతను సునీతను బెదరించిన విషయమూ యుగంధర్ చెప్పాడు.

కాంతారావును తీక్షణంగా చూస్తూ ''ఈ సీసా విషయం ఏం సంజాయిషీ చెపుతారు?'' అడిగాడు స్వరాజ్యరావు.

''శివరామకృష్ణయ్యగారి గదిలో బల్లమీద ఖాళీ సీసా ఉంటే ఎందుకయినా పనికి వస్తుందని అడిగి తీసుకున్నాను'' అన్నాడు కాంతారావు.

''దాన్ని కాగితాల వెనక ఎందుకు దాచిపెట్టారు''

''నేను దాచలేదు. బల్లమీద పెట్టాను'' అన్నాడు కాంతారావు.

యుగంధర్ వచ్చి అందరికీ మధ్య నిలబడ్డాడు. ''సరే అందరూ కూర్చోండి'' అన్నాడు.

అంతలో రాఘవయ్య వచ్చి యుగంధర్ చెవిలో ఏదో చెప్పాడు. యుగంధర్ తల ఊపి ఒక అడుగు ముందుకు వేసి ''ఎమిలీ'' అన్నాడు. ఎమిలీ తలెత్తి చూసింది.

''శివరామకృష్ణయ్యగారిని నువ్వు హత్య చేశావు. బ్రాందీలో హార్టిసాల్ కలిపింది నువ్వే. ఇప్పుడయినా నిజం ఒప్పుకుంటావా?'' అన్నాడు యుగంధర్.

''నన్ను బెదరించ చూస్తున్నారా?'' అడిగింది ఎమిలీ.

''ఊరికే బెదరించడం కాదు. నిన్న సాయంకాలం రవి డ్రగ్ స్టోర్సులో హార్టిసాల్ కొని నీ దగ్గరకు వచ్చాడు. ఇదివరకు నర్సుగా పనిచేశావు. నీకు ఆ మందు విషమని తెలుసు. బహుశా అప్పుడు నీకు శివరామకృష్ణయ్యగారికి విషం ఇచ్చి హత్య చేయాలన్న ఉద్దేశం కలిగి ఉంటుంది. అందుకే రవిని ఎలాగో ఒప్పించి అతని ఇంటికి నిన్న రాత్రి వెళ్ళావు. నువ్వు రవి గదిలో ఉండగా రవికోసం సూర్యనారాయణ వచ్చాడు. అతనితో మాట్లాడడానికి రవి బయటకు వెళ్ళాడు. ఆ సమయం చూసుకుని నువ్వు నెమ్మదిగా శివరామకృష్ణయ్యగారి గదిలో ప్రవేశించావు. బల్లమీద గ్లాసులో ఉన్న బ్రాందీలో హార్టిసాల్ కలిపావు. శివరామకృష్ణయ్యగారి గదిలో మందు ఎక్కడ ఉంటుందో నీకు తెలియదు. అందుకని డాక్టరు రఘుపతిరావు దగ్గరకు వెళ్ళి నీకు కార్డియాక్ ఎక్టాసిస్ ఉన్నట్లు ఆ

రోగలక్షణాలు చెప్పి హర్టిసాల్‌కు ప్రిస్క్రిప్షన్ వ్రాయించుకున్నారు. నర్సువి కనుక నీకు ఆరోగ లక్షణాలు సరిగా తెలుసు. డ్రగ్ స్టోర్సులో హర్టిసాల్ కొని, రాత్రి శివరామకృష్ణయ్యగారు త్రాగిన బ్రాందీలో కలిపావు'' అన్నాడు యుగంధర్.

ఎమిలీ నోట మాటరాలేదు. స్వరాజ్యరావు ఆశ్చర్యంతో యుగంధర్ని చూశాడు.

''మైడియర్ స్వరాజ్యరావు ఎమిలీ కొన్న హర్టిసాల్ మందు అట్లాగే సీసాలో ఉందికదా. బ్రాందీలో ఆ మందు ఎట్లా కలిసి ఉంటుందనుకుంటున్నారేమో మీరు. చెబుతా వినండి. మొదటినుంచీ నాకు ఒక విషయం అర్థం కాక తికమకపడ్డాను. అదేమిటంటే - శివరామకృష్ణయ్యగారి గదిలో ఉన్న మందు సీసాలో మందు అంతా మాయమైంది. ఆయన తాగింది యాభై చుక్కలేనని పోస్టు మార్టంలో తేలింది. అయితే మిగతా మందు ఏమైనట్లు? ఈ ప్రశ్నకు సమాధానం కోసం చాలా ఆలోచించాను. సునీతా, రవీ, కాంతారావూ నిన్న రాత్రి శివరామకృష్ణయ్యగారి గదిలోకి వెళ్ళినట్లు మనకు సాక్ష్యం ఉంది.

రవి అతని తండ్రి మంచం దగ్గర నిలబడి, మందున్న బల్లదగ్గర ఒంగినట్లు కూడా మనకు తెలిసింది. అంతేగాక, నిన్న రాత్రి ఎమిలీ కూడా ఇక్కడకు వచ్చినట్లు ఆమె ఒప్పుకుంది. కనుక బ్రాందీలో హర్టిసాల్ కలపడానికి వీళ్ళందరికీ అవకాశం ఉంది. సూర్యనారాయణ గదిలోకి వెళ్ళినట్లు సాక్ష్యం లేకపోయినా ఈ ఇంటికి నిన్న రాత్రి వచ్చినట్లు తెలిసింది. అయిదుగురుకీ శివరామకృష్ణయ్య మరణం ఎంతో కొంత లాభించింది. కనుక అయిదుగురికి శివరామకృష్ణయ్యగారిని హత్య చేయడానికి కారణం ఉందని తేలింది. తేలని విషయం సీసాలో మందు అంతా ఏమైందనేది. హత్య చేసిన మనిషి మిగతా మందు బయట పారపోసి ఉండవచ్చు. కానీ అట్లా పారపోయడానికి కారణంగాని, ఉద్దేశం కానీ కనిపించలేదు. కనుక సీసాలో మందు ఏమైందో తెలుసుకోవడం ముఖ్యం. ఆ మందు విషయం ఎవరెవరికి తెలుసుననే విషయం ఆలోచించాను. సునీతకు తెలుసు - రవికి తెలుసు - ఎమిలీకి తెలుసు. కాంతారావూ, సూర్యనారాయణా కూడా మందు సీసా చూసి ఉండవచ్చు. అయితే ఆ మందు ఎదురుగా, చేతికి అందుబాటులో ఉంటుందని ఎవరెవరికి తెలుసు? సునీతకు, రవికీ తెలుసు. మిగతా ముగ్గురికీ తెలిసే అవకాశం లేదు. సునీతా, రవీ కాక మిగతా వారిలో ఎవరైనా హత్య చేసి ఉంటే వారు హర్టిసాల్ సీసా తమతో తీసుకువచ్చి ఉండాలి. ఆ సీసాలో మందు బ్రాందీలో కలిపి ఉండాలి. అంతలో బల్లమీద ఉన్న నిండు సీసా వారి కంటపడి ఉంటుంది. ఆ సీసా అలాగే ఉంటే శివరామకృష్ణయ్యగారు ఆత్మహత్య చేసుకోలేదని నిర్ధారణగా తెలుస్తుంది. కనుక ఆ సీసాలో మందు ఉండకూడదు. అందుకని తన దగ్గర ఉన్న ఖాళీసీసా బల్లమీద పెట్టి, నిండు సీసా హత్యచేసినవారు తీసుకువెళ్ళి ఉంటారు. అందుకే రవి కాక ఇంకెవరైనా నిన్న హర్టిసాల్ కొన్నారా అని డ్రగ్ స్టోర్సులో విచారించాను'' అన్నాడు యుగంధర్.

ఎమిలీ లేచి నుంచుని వెక్కరింపుగా నవ్వుతూ ''మిష్టర్ యుగంధర్ మీ పరిశోధన అద్భుతంగా ఉంది. కానీ మీకు ఇసుమంతైనా సాక్ష్యం లేదు. నేను కొన్న మందు నా అలమారులో సీసాలో దాదాపు అంతా అట్లాగే ఉందికదా'' అంది.

యుగంధర్ నవ్వాడు. ''అవును. చాలా తెలివిగానే చేశావు. శివరామకృష్ణయ్యగారి గదిలోంచి తీసుకు వెళ్ళిన నిండు సీసాలో మందు పారపోసి సరిగా నలభై ఎనిమిది చుక్కలు మాత్రం మిగిల్చావు. ఎంతైనా నర్సువుకదా!'' అన్నాడు.

''ఓహో! అలాగా మీకు అందుకు నిదర్శనం ఏమిటి?'' అడిగింది ఎమిలీ.

''ఎమిలీ నిదర్శనం లేకుండానే నీ మీద ఈ నేరం మోపుతున్నావనుకున్నావా అలమారులో ఉన్న సీసా మీద వేలి ముద్రలు పరీక్ష చేయించాను. నీ వేలి ముద్దరలు కాక ఇంకొకరి వేలి ముద్దరలూ నీ సీసా మీదకి ఎట్లా వచ్చాయి? అది శివరామకృష్ణయ్యగరి ఇంట్లో సీసా అని స్పష్టమవుతోంది. అది నీ అలమారులోకి ఎట్లా వచ్చింది?'' అడిగాడు యుగంధర్.

ఎమిలీ మొహంలో నెత్తురు చుక్కలేదు. కళ్ళు అప్పగించి నివ్వెరపోయి చూసింది. రాతిబొమ్మలా అయిపోయింది. ఈదురుగాలికి ఊగిపోయే చెట్టులాగే అటూ ఇటూ ఊగిపోయి కుప్పగా నేలమీద కూలింది.

●●●

ఎమిలీకి స్పృహ రాగానే, సంకెళ్ళు వేసి ఆమెను జీపు కారు ఎక్కించాడు స్వరాజ్యరావు.

బ్లాక్ మెయిల్ ఛార్జిమీద సూర్యనారాయణను కూడా అరెస్టు చేశాడు. యుగంధర్‌కి 'థాంక్స్' చెప్పి ఖైదీలిద్దరినీ, తీసుకుని, స్వరాజ్యరావు, సబ్‌ఇన్‌స్పెక్టరు వెళ్ళిపోయారు.

యుగంధర్, రాజూ, సునీతా, కాంతారావూ హాల్లో కూర్చున్నారు. కొంచెం సేపు అందరూ మౌనంగా ఉన్నారు. ఉన్నట్లుండి నిట్టూర్పు విడుస్తూ "గుడ్ బై నేను వెళుతున్నాను" సునీతతో అన్నాడు రవి.

సునీత లేచి రవి దగ్గరకి వెళ్ళింది. "రవీ మామయ్య ఆస్తి నాకు ఇవ్వడానికి కారణం నీమీద కోపం రావడమే. నాకు మా నాన్న ఇచ్చిన ఇరవై ఎకరాల ఆస్తి ఉంది అది చాలు. మీ నాన్న ఆస్తి నీదే నాకొద్దు నువ్వే తీసుకో" అన్నది.

రవి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. "సునీతా!" అన్నాడు ఆమె రెండు చేతులూ పట్టుకుని.

●●●

కాంతారావూ, సునీతా యుగంధర్‌కి ధన్యవాదాలు చెప్పారు. యుగంధర్, రాజూ క్రిజ్లర్ కారులో మద్రాసుకు బయలుదేరారు. కాంతారావూ, సునీతా వసారాలో నిలబడి వెళుతున్న యుగంధర్ని చూస్తున్నారు. చీకటి పడుతోంది. దూరాన ఎక్కడో చెట్టుమీద కోయిల పాడుతోంది.

కాంతారావు సునీతకు దగ్గరగా జరిగి "సునీతా! నువ్వు చేసిన త్యాగం అమోఘమైనది" అన్నాడు.

"ఏం త్యాగం చేశాను? అతని ఆస్తి అతనికి ఇచ్చాను. అంతేగా!" అన్నది.

కాంతారావు సునీతను రెండు చేతుల్లో దగ్గరకు లాక్కుని "నాలాటి అనామకుణ్ణి పెళ్ళి చేసుకోడానికి ఇష్టంపడటం త్యాగం కాదూ!" అన్నాడు.

"నేను అదృష్టవంతురాల్ని" అంటూ సునీత అతని భుజం మీద తల వాల్చింది.

***అయిపోయింది.***